శనివారం 11-11-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 231



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చట్టసభివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'




బంగారానికి ధనత్రయోదశి డిమాండ్ -17లో



ఆరోగ్య ధన ప్రాప్తిరస్తు! -14లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


56 ఏళ్ళ నమ్మకం
130+ షోరూమ్స్
20 నగరాలలో
బెస్ట్ ప్రైస్ | బెస్ట్ సర్వీస్
vijay sales
Shop On www.vijaysales.com
FREE Delivery
₹1 Down Payment on EMI
విజయ్ సేల్స్ లో దీపావళి వేడుకలు
పెద్ద ఆఫర్ తక్కువ EMI
*ఎక్స్ఛేంజ్ నదుపాయం కలదు
SHOWROOMS OPEN AT 10 AM
SANSUI
4K UHD LED TV
PRICE ₹2,19,000
OFFER PRICE ₹1,42,000
HDB FINANCIAL SERVICES CASHBACK ₹12,000*
EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹ 1,29,990
DOWN PAYMENT ₹28,400 | EMI ₹14,200 x 8 mths
86 (218 cm)
1+1 YEARS WARRANTY
4K UHD
androidtv
WE ACCEPT EMI CARDS
Get upto ₹5000 Flight Voucher
Paytm Cashback No Cost EMI on EMI transaction
HDB FINANCIAL SERVICES 12% CASH BACK Plus 5x MY VS Reward Points UPTO ₹12000
AMERICAN EXPRESS UPTO ₹5,000 INSTANT DISCOUNT
Up To ₹15,000/- Instant Discount and Cashback on Banks & Paper Finance
HDFC BANK ICICI Bank HSBC YES BANK DBS one IndusInd Bank kotak RBL BANK FEDERAL BANK AU
SONY
Stunning Picture. Immersive Sound.
X82L SERIES
Special Festive OFFERS
3 YEARS WARRANTY
INSTANT CASHBACK UPTO ₹10,000
1 EMI FREE
BUY NOW AT Rs.2,995/-
SAVE UPTO Rs. 49,990/-
SAMSUNG
Big TV Festival
Big offers. Big savings. Big celebrations.
Get Galaxy S23 Ultra 256GB | 12GB worth ₹ 124999 (1 unit)
Get Soundbar (1 unit) worth up to ₹ 59990
3 Year warranty
LG Life's Good.
CHEER INDIA ON. TURN YOUR STADIUM ON.
HDR10 Pro
AI Sound Pro
ThinQ webOS
Powerful Gameplay
3 YEAR WARRANTY
30% OFF LG SOUNDBAR
1 EMI FREE
FIXED EMI ₹2,999
iPhone 15
PRICE ₹79,900/-
Cashback ₹5,000
Trade in Value ₹15,000
Trade in Bonus ₹6,000
Effective Price ₹53,900*
Per Day EMI ₹82*
MacBook Air M1
8GB | 256GB
VSP ₹75,900
Cashback ₹5,000
Trade in Value ₹15,000
Trade in Bonus ₹10,000
Effective Price ₹45,900*
Per Day EMI ₹71*
iPad 9th Gen
PRICE ₹28,000/-
Cashback ₹2,000
Effective Price ₹26,000*
Per Day EMI ₹39*
Watch Series 9
PRICE ₹41,900/-
Cashback ₹2,500
Trade in Value ₹3,000
Trade in Bonus ₹2,000
Effective Price ₹34,400*
Per Day EMI ₹51*
iPhone 13 + AirPods Pro
COMBO EMI ₹2658/-
COMBO PER DAY EMI ₹89/-
iPhone 13 + AirPods Pro
mi NOTE 12 4G 6GB | 64GB
Scratch and win Gold Coin*
VSP ₹11,999
CASHBACK ₹1,500*
EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹10,499
vivo V29e 5G 8GB | 128GB
BEST SELLING
VSP ₹26,999
CASHBACK ₹3,000*
EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹23,999
realme C53 4GB | 128GB
Best Selling
VSP ₹9,499
HP PAVILION, VICTUS, SPECTRE, OMEN, ENVY
24 Mnts EMI/ZERO DP
LENOVO LEGION GAMING, YOGA SERIES, SLIM 5 & FLEX 5
Per Day EMI ₹81*
ACER ASPIRE, SWIFT, SPIN, NITRO, PREDATOR
Per Day EMI ₹103*
Wide range of Refrigerators
UPTO 10% Cashback* MAX UPTO ₹2,500* on Direct Cool
UPTO 20% Cashback* MAX UPTO ₹15,000* on Frost Free
UPTO 20% Cashback* MAX UPTO ₹15,000* on Side by Side
Wide range of Washing Machines
UPTO 5% Cashback* MAX UPTO ₹2,500* on Semi Automatic
UPTO 15% Cashback* MAX UPTO ₹9,000* on Top Load
UPTO 20% Cashback* MAX UPTO ₹12,000* on Front Load
PS5 CONSOLE
SAVE ₹10,000/-
PLAY HAS NO LIMITS
Great Gifting Ideas
CORPORATE BOOKINGS OR BULK ORDERS
Please mail us at corporatesales@vijaysales.com
EXCHANGE YOUR OLD MICROWAVE FOR NEW & GET ₹1000/- OFF*
ROAST, BAKE, GRILL AND COOK
NEW LAUNCH
FRONT LOAD WASHING MACHINE
ALSO AVAILABLE 7KG & 8KG
vise
PRICE ₹60,000
LAUNCH PRICE ₹29,990
CASHBACK ₹4,498*
EFFECTIVE LAUNCH PRICE ₹25,492 (AFTER ABOVE CASHBACK)
VSFL90RS (9 kg)
EMI ₹2,999 x 10 mths (Paper Finance) | ZERO DOWN PAYMENT | NO COST EMI
LED TVs | Large Appliances | Air Conditioners
Mobiles | Laptops | Accessories
Kitchen Appliances
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్ | వరంగల్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | తిరుపతి | కాకినాడ | ముంబై | ఢిల్లీ | థానే | నవీ ముంబై | పూనే | సూరత్ | వడోదర
అహ్మదాబాద్ | గురుగ్రామ్ | ఫరీదాబాద్ | నోయిడా | ఇందిరాపురం
SCAN FOR STORES
Scan to Shop Online www.vijaysales.com



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 231

శనివారం 11-11-2023



రచిన్‌కు అవార్డు...
ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' పురస్కారం గెల్చుకున్న న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ -17లో



మోదీపై పీహెచ్‌డీ
ప్రధానిపై పీహెచ్‌డీ చేసిన తొలి ముస్లిం మహిళా స్కాలర్ సజ్మాపై కథనం -13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

గోదావరి-కావేరిపై సమ్మతి!



గోదావరి– కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై ముందడుగు పడింది. ప్రాజెక్టు నిర్మాణానికి సమ్మతి తెలుపుతూ పరస్పర అవగాహన ఒప్పందం(ఎంఓయూ)పై సంతకాలు చేసేందుకు తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశాతోపాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి సూత్రప్రాయ అంగీకారం తెలిపింది.

- వివరాలు 18లో

నత్తనడకన ఉపకార దరఖాస్తులు



పోస్టుమెట్రిక్ విద్యార్థులకు అమలు చేస్తున్న ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియకు స్పందన కరువైంది. ఈ పథకాల కింద దరఖాస్తు ప్రక్రియ మొదలై 2 నెలలు దాటినా ఇప్పటివరకు పావువంతు మంది విద్యార్థులు కూడా ఈపాస్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోలేదని తెలుస్తోంది.

- వివరాలు 5లో

పూరీ, హసన్ ఆలయాల్లో తోపులాట



ఒడిశాలోని ప్రఖ్యాత పూరీ జగన్నాథుని ఆలయం, కర్ణాటకలో హసన్‌లో ఉన్న హసనాంబ ఆలయాలకు శుక్రవారం వేకువ జాము నుంచి భక్తులు పోటెత్తారు. రద్దీ కారణంగా చోటుచేసుకున్న తోపులాటల్లో 27 మంది గాయపడ్డారు. కొందరు స్పృహ తప్పారు. ఈ ఘటనలో ప్రాణాపాయం తప్పిందని అధికారులు చెప్పారు.

- వివరాలు 6లో

ఇదండీ జోక్



ఎలక్షన్లో రిపీట్ కాదు కదా సార్!



శుక్రవారం కామారెడ్డి సభలో 'బీసీ డిక్లరేషన్'ను విడుదల చేస్తున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, రేవంత్‌రెడ్డి. చిత్రంలో మధుయాష్కీ, చాడ, కోదండరాం, మహేశ్‌కుమార్‌గౌడ్, ఠాక్రే, కె. నారాయణ, వీహెచ్

అమలు 'గ్యారంటీ'

కర్ణాటకలో చేసి చూపించాం.. ఇక్కడా మాట నిలబెట్టుకుంటాం

దీనిపై కేసీఆర్ తప్పుడు ప్రచారం.. కామారెడ్డి సభలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

పథకాలు అమలు చేస్తున్నామో లేదో వచ్చి చూడాలంటే కేసీఆర్ ముఖం చాటేశారు

బీఆర్‌ఎస్ అబద్ధాలను నమ్మొద్దు.. కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపు

తెలంగాణ ద్రోహులను పక్కనపెట్టుకుని కేసీఆర్ నీతులు: రేవంత్‌రెడ్డి

స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు

ప్రత్యేకంగా సబ్‌ప్లాన్.. ఎంబీసీ శాఖ.. బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ హామీలు.. -12లో

సాక్షి, కామారెడ్డి: కర్ణాటకలో కాంగ్రెస్ హామీలు నెరవేర్చడం లేదని, తెలంగాణలో ఏం అమలు చేస్తుందంటూ సీఎం కేసీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మండిపడ్డారు. హామీలు అమలవుతున్నాయో లేదో వచ్చి చూడాలని కేసీఆర్‌ను ఆహ్వానిస్తే ముఖం చాటేశారని.. పైగా అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కర్ణాటకలో తాము ఇచ్చిన 'గ్యారంటీ' హామీలను అమల్లోకి తెచ్చామని.. తెలంగాణలోనూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని ప్రకటించారు. శుక్రవారం కామారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నామినేషన్ వేశారు. అనంతరం పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో మిగతా 12వ పేజీలో ▶

కాంగ్రెస్ డిక్లరేషన్లన్నీ చిత్తు కాగితాలే

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

- బీజేపీ కార్యాలయంలో కాంగ్రెస్ మైనార్టీ డిక్లరేషన్‌కు రూపకల్పన
- బీసీలు, మైనార్టీల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నం
- 100 స్పీడ్‌లో కారు.. 100 సీట్లు ఖాయం



మహమూద్ అలీతో కలసి మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రకటిస్తున్న డిక్లరేషన్లన్నీ చిత్తు కాగితాలేనని, డిక్లరేషన్ల పేరిట ఆ పార్టీ దేశ వ్యాప్తంగా ప్రజలను మోసగిస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు విమర్శించారు. మైనార్టీ డిక్లరేషన్ పేరిట రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలల్లో మైనార్టీలు, బీసీల జనగణన చేసి 'ఫెయిర్ రిజర్వేషన్' ఇస్తామనడంలో కాంగ్రెస్ కుట్ర దాగి ఉందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం హోం మంత్రి మహమూద్ అలీ, పార్టీ నేతలు ఇంతియాజ్ ఇషాక్ అలీ, సలీమ్, సోహైల్ తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

బీజేపీ భావజాలానికి అనుగుణంగా..

ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు తదితరులను గతంలోనే రాజ్యాంగం మతపరమైన మైనార్టీలుగా గుర్తించిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. మైనార్టీ డిక్లరేషన్ పేరిట మైనార్టీలు, బీసీల నడుమ విద్వేషాలు సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, ఈ తరహా ప్రతిపాదనలతో అటు మైనార్టీలు, ఇటు బీసీలు నష్టపోతారని చెప్పారు. మైనార్టీలు బీసీలుగా గుర్తింపు పొందితే వారికి ప్రత్యేకమైన మంత్రిత్వ శాఖ, బడ్జెట్ కేటాయింపులు, మైనార్టీ సంక్షేమ, ఫైనాన్స్ కార్పొరేషన్ల రద్దు తదితర ప్రమాదాలు పొంచి ఉంటాయన్నారు. బీజేపీ మిగతా 12వ పేజీలో ▶

నేడు రాష్ట్రానికి మోదీ

మాదిగల విశ్వరూప మహాసభలో పాల్గొననున్న ప్రధాని

ఈనెల 26న నిర్మల్‌లో కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్న మోదీ

రాష్ట్రంలో ఎన్నికల ప్రచార ముగింపు సభకూ రాక



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీజేపీ తరఫున ప్రచారంకోసం మరోసారి రాష్ట్రానికి రానున్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల ఆత్మగౌరవ సభలో పాల్గొన్న ప్రధాని మళ్లీ శనివారం మాదిగల విశ్వరూప మహాసభకు హాజరుకానున్నారు. తొలుత బీసీ సీఎం నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న ప్రధాని, ఈసారి తెలంగాణతో పాటు ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాధాన్యం సంతరించుకున్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకునే మిగతా 16వ పేజీలో ▶

ముగిసిన నామినేషన్ల పర్వం

- చివరి రోజు 2,151 నామినేషన్లు దాఖలు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ఘట్టం ముగిసింది. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల పరిధిలో శుక్రవారం చివరిరోజు రికార్డు సంఖ్యలో 2,151 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయ వర్గాలు తెలిపాయి. పూర్తి సమాచారం అందిన తర్వాతే స్పష్టమైన గణాంకాలు వెల్లడికానున్నాయని అధికారులు పేర్కొన్నారు. అసెంబ్లీ మిగతా 5వ పేజీలో ▶

119 నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల వివరాలు

-7, 8 పేజీల్లో

సంక్షేమం కావాలా.. సంక్షోభం కావాలా?

- జమ్మికుంట ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్‌రావు
- ఈటల మాయమాటలకు మోసపోవద్దు
- కౌశిక్‌ను గెలిపిస్తే హుజూరాబాద్ అభివృద్ధి బాధ్యత నాదే -2లో



జమ్మికుంట సభలో మాట్లాడుతున్న హరీశ్‌రావు



శుక్రవారం కోదాడ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఉత్తమ్ దంపతులతో కలిసి మాట్లాడుతున్న డీకే శివకుమార్

కేసీఆర్‌ను శాశ్వతంగా ఫాంహౌస్‌కు పంపుదాం

కోదాడ రోడ్ షో, స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

- వివరాలు 12లో

డిసెంబర్ 13, 14 తేదీల్లో చలో ఢిల్లీ

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 13, 14 తేదీల్లో చలో ఢిల్లీ, పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించడం, అత్యధిక స్థానాల్లో బీసీ అభ్యర్థులకు పార్టీ టికెట్లు కేటాయించడంతోనే సరిపోదని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించినప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. రాజకీయ రంగంలో బీసీల ప్రాతినిధ్యం 14 శాతం దాటలేదని కేంద్రప్రభుత్వం ఇటీవల సేకరించిన గణాంకాల ద్వారా తేలిందని వెల్లడించారు. బీసీ బిల్లు కోసం బీసీలు సంఘటితంగా పోరాటం చేయాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు. తెలంగాణలో 119 ఎమ్మెల్యేలుంటే 22 మంది మాత్రమే బీసీ ఎమ్మెల్యేలు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం ఏపీ అధ్యక్షుడు ఎన్.మారేశ్, బీసీ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బొల్ల మహేందర్, నీల వెంకటేశ్, వేముల రామకృష్ణ, జయంతి, శ్రీనివాస్, ఉదయ్‌కుమార్, సుధాకర్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ కూటమి విజయం



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ కూటమి ఘన విజయం సాధించింది. శుక్రవారం నిర్వహించిన ఓట్ల లెక్కింపు రాత్రి వరకు కొనసాగింది. రాత్రి ప్రకటించిన ఫలితాల ప్రకారం ఎస్‌ఎఫ్‌ఐ కూటమి నుంచి అధ్యక్షుడిగా ఎండీ అతీక్ అహ్మద్, ఉపాధ్యక్షుడిగా గాజే ఆకాశ్, ప్రధాన కార్యదర్శిగా దీపక్ కుమార్ ఆర్య, జాయింట్ సెక్రెటరీగా ఎల్.బాలాంజనేయులు, సాంస్కృతిక కార్యదర్శిగా సమీమ్ అక్తర్ షేక్, క్రీడా కార్యదర్శిగా అతుల్ నుంచి ఘనవిజయం సాధించారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ కూటమి విజయోత్సవ వేడుకలను నిర్వహించారు.

సంక్షేమం కావాలా.. సంక్షోభం కావాలా?

- జమ్మికుంట ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్‌రావు
- ఈటల మాయమాటలకు మోసపోవద్దు
- కౌశిక్‌ను గెలిపిస్తే హుజూరాబాద్ అభివృద్ధి బాధ్యత నాదే



జమ్మికుంటలో జరిగిన సభకు హాజరైన ప్రజలు

హుజూరాబాద్: రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం కావాలో.. సంక్షోభం సృష్టించే పార్టీలు కావాలో ప్రజలే ఆలోచించాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట గాంధీచౌక్ వద్ద జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సర్వేలన్నీ బీఆర్‌ఎస్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డి గెలుస్తారని చెబుతున్నాయని అన్నారు. ఇక హుజూరాబాద్‌లో జీ హుజూర్ రాజకీయాలు నడవవని పేర్కొన్నారు. గత ఉప ఎన్నికల్లో గట్టెక్కేందుకు ఈటల రాజేందర్ ఎన్నో మాయమాటలు చెప్పారని, దళితబంధు రాదని ఒక అపనమ్మకాన్ని సృష్టించారని ధ్వజమెత్తారు. హుజూరాబాద్‌లో 100 శాతం దళితబంధు అమలుచేసి చరిత్ర సృష్టించామని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలతో రాష్ట్రానికి ఒరిగేదేంలేదన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం కింద ప్రతీ మహిళకు నెలకు రూ.3 వేలు, అలాగే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.15 లక్షలకు పెంచుతామని చెప్పారు. గ్యాస్ సిలిండర్‌ను రూ.400కు అందిస్తామని వివరించారు. కౌశిక్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే హుజూరాబాద్ అభివృద్ధి బాధ్యత తనదే అని మంత్రి హామీ ఇచ్చారు.

ఈటల మాటలు వింటే పదేళ్లు వెనక్కి

హుజూరాబాద్ ప్రజలు ఈటల మాటలు వింటే అభివృద్ధిలో పదేళ్లు వెనకబడిపోతారని మంత్రి హరీశ్ పేర్కొన్నారు. గెలిచాక హుజూరాబాద్‌ను విడిచిపెట్టి వెళ్లారని విమర్శించారు. ఈసారి హుజూరాబాద్, గజ్వేల్‌లో ఈటల ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. ఢిల్లీ నాయకులను హుజూరాబాద్‌కు తీసుకొస్తున్న ఈటల.. వారితో ఈ నియోజకవర్గానికి ఒరిగే ప్రయోజనం ఏంటో చెప్పాలని ప్రశ్నించారు. దమ్ముంటే ఉప్పల్ రైల్వే ఓవర్‌బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ సంస్థ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో మరింత దృష్టి పెట్టండి

- ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య గొడవ మనకు పాఠం కావాలి
- అధికారులనుద్దేశించి ఆడియో సందేశం విడుదల చేసిన డీజీపీ అంజనీకుమార్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వాతావరణం రోజురోజుకూ వేడెక్కుతున్న నేపథ్యంలో పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో మరింత దృష్టి పెట్టాలని డీజీపీ అంజనీకుమార్ సూచించారు. ఎన్నికల విధుల్లో ప్రస్తుత పరిస్థితులు, రానున్న కొద్ది రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై డీజీపీ శుక్రవారం సిబ్బందికి ఆడియో సందేశాన్ని పంపారు. ఆయా జిల్లాలు, పోలీసు కమిషనరేట్లలో ఉన్నతాధికారులంతా వారి పరిధిలోని స్టేషన్లలో ఎన్నికల ఏర్పాట్ల సన్నద్ధతను మరోసారి పరిశీలించాలని ఆయన కోరారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా చెక్‌పోస్టులను సందర్శించి సిబ్బంది సన్నద్ధతను పరిశీలించాలని సూచించారు. రానున్న కొద్ది రోజుల్లో డబ్బుల పంపిణీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున దానిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. అలాంటి అంశాలపై వార్తలను మీడియాలో ప్రసారం అయ్యేలా చూసుకోవాలని, ఈ వార్తల వ్యాప్తితో ఓటర్లలో విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. 'రాచకొండ కమిషనరేట్ పరిధిలో గురువారం ఇబ్రహీంపట్నంలో నామినేషన్‌కు వెళుతున్న సమయంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య జరిగిన అల్లర్లలో నలుగురు పోలీసులతోపాటు పలువురికి గాయాలు అయ్యాయి. ఈ సంఘటన నుంచి యువ అధికారులు పాఠం నేర్చుకోవాలి. ఒకేసారి రెండు రాజకీయపార్టీల నాయకులు ఒకే చోటకు చేరకుండా జాగ్రత్తపడాలన్నది గుర్తుంచుకోవాలి' అని డీజీపీ సూచించారు.

సీఈవో కార్యాలయంపై ఫిర్యాదు

వివరణ కోరిన కేంద్ర ఎన్నికల సంఘం

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) కార్యాలయం పారదర్శకంగా వ్యవహరించడంలేదని, రోజువారీగా మీడియాకు సమాచారాన్ని అందించడంలేదని ఓ విలేకరి ఫిర్యాదు చేయగా, కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించి వివరణ కోరింది. కనీసం రోజువారీగా జప్తుల నివేదికలను సైతం సరిగ్గా ఇవ్వడంలేదని ఆ విలేకరి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే తనిఖీల్లో పట్టుబడుతున్న నగదు, ఇతర సామగ్రి వివరాలను రోజూ మీడియాకు విడుదల చేస్తున్నామని సీఈవో కార్యాలయం వివరణ ఇచ్చినట్టు తెలిసింది.

కోడ్ ఉల్లంఘనలపై 426 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) ఉల్లంఘనలపై రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 10 నుంచి ఈ నెల10 వరకు మొత్తం 426 ఎఫ్‌ఐఆర్‌లు నమోదైనట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం శుక్రవారం వెల్లడించింది. పోలీసులతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలు అతిక్రమించే వారిపై కేసుల కొరడా ఝుళిపిస్తున్నాయి. పార్టీలకు అతీతంగా ఈ కేసులు నమోదవుతున్నాయి.

జాతీయ అగ్నిమాపక క్రీడల్లో తెలంగాణకు మూడోస్థానం

సాక్షి, హైదరాబాద్: నాగ్‌పూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీసెస్ కాలేజీలో ఈనెల 5 నుంచి 7 వరకు నిర్వహించిన జాతీయ అగ్నిమాపక క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపకశాఖ అధికారులు మూడో స్థానం సాధించారు. వాటర్ టెంటర్ (డ్రిల్ విత్ రెస్క్యూ) పోటీలో కాంస్య పతకం దక్కడంపై అగ్నిమాపకశాఖ అధికారులు సంతోషం వ్యక్తంచేశారు. పోటీల్లో పాల్గొన్న ఫైర్ సిబ్బంది రాజు, సంతోష్, శ్రీనివాస్, వాసు, ఉదయ్‌కుమార్, అబ్దుల్ అజీజ్‌లను డీఎఫ్‌ఓలు ఎస్ సందన్న, కేవీ కృష్ణకుమార్, ఏడీఎఫ్ఓ కృష్ణారెడ్డి శుక్రవారం అగ్నిమాపకశాఖ శిక్షణ అకాడమీలో సన్మానించారు.



తాజ్‌కృష్ణాలో కేసీ వేణుగోపాల్‌తో బల్మూరి వెంకట్, శివసేనారెడ్డి, రాక్రే తదితరులు

బుజ్జగింపు.. భరోసా

కేసీ మార్కు 'రాజీ'కీయం

- టికెట్లు రాని 15 మందితో వేణుగోపాల్ భేటీ
- పార్టీకి మంచి రోజులు వస్తున్నాయని, భవిష్యత్తులో ప్రాధాన్యత కల్పిస్తామని హామీ
- షెట్కార్, సంజీవరెడ్డిల మధ్య సయోధ్య.. నారాయణఖేడ్ టికెట్ మార్పు
- పలువురికి ఎంపీ టికెట్లపై వాగ్దానం.. జహీరాబాద్ ఎంపీగా షెట్కార్!

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశించి టికెట్ రాక భంగపడిన తెలంగాణ కాంగ్రెస్ నేతలను ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్ తనదైన శైలిలో బుజ్జగించారు. పార్టీకి మంచి రోజులు వస్తున్నాయంటూ నచ్చజెప్పారు. భవిష్యత్తులో ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. పలువురికి ఎంపీ సీట్లపై హామీ ఇచ్చినట్లు కూడా సమాచారం. నారాయణఖేడ్‌పై మీరే తేల్చుకోండంటూ నిర్ణయాన్ని 'ఆ ఇద్దరికే' వదిలిపెట్టారు. ఒకరోజు పర్యటనకు గాను గురువారం హైదరాబాద్‌కు వచ్చిన ఆయన అర్ధరాత్రి వరకు తాజ్‌కృష్ణా హోటల్‌లో తెలంగాణ కాంగ్రెస్ నేతలతో సమావేశమయ్యారు. టికెట్లు రాని దాదాపు 15 మంది నేతలను పిలిపించి ఆయన స్వయంగా మాట్లాడారని సమాచారం. ముఖ్యంగా నారాయణఖేడ్ అసెంబ్లీ టికెట్ విషయంలో నెలకొన్న వివాదాన్ని ఆయన పరిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులకు ఎంపీ టికెట్ల విషయంలో హామీ ఇచ్చినట్టు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మీ ఇద్దరూ తేల్చుకోండి

నారాయణఖేడ్ అసెంబ్లీ టికెట్‌ను జహీరాబాద్ మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్‌కు కాంగ్రెస్ పార్టీ కేటాయించింది. అయితే మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల కిష్టారెడ్డి కుమారుడు సంజీవరెడ్డి కూడా ఈ టికెట్ ఆశించారు. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరు నేతలను పిలిపించిన కేసీవీ ఎవరికి టికెట్ కావాలో తేల్చుకుని తన దగ్గరకు వస్తే వారికే బీఫారం ఇస్తానని చెప్పినట్టు తెలిసింది. దీంతో ఆ ఇద్దరు నేతలు ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడుకున్నారని, ఈ భేటీలో భాగంగా సంజీవరెడ్డి అసెంబ్లీకి, షెట్కార్ లోక్‌సభకు పోటీ చేయాలని నిర్ణయించుకున్నారని, అందుకే చివరి నిమిషంలో బీఫారంను సంజీవరెడ్డికి ఇచ్చారని సమాచారం. షెట్కార్‌ను జహీరాబాద్ లోక్‌సభకు పోటీ చేయిస్తామని కేసీవీ స్పష్టమైన హామీ ఇవ్వడంతో నారాయణఖేడ్ కథ సుఖాంతమైంది.

మరికొందరికి కూడా..

ఇదే కోవలో కాంగ్రెస్ నేతలు బలరాం నాయక్, పారిజాతా నర్సింహారెడ్డి, గాలి అనిల్‌కుమార్, నాగరిగారి ప్రీతం, అద్దంకి దయాకర్, శివసేనారెడ్డి, బల్మూరి వెంకట్, బెల్లయ్య నాయక్ తదితరులతో కేసీవీ విడివిడిగా సమావేశమయ్యారు. వీరిలో బలరాం నాయక్ (మహబూబాబాద్), గాలి అనిల్‌కుమార్ (మెదక్)లకు లోక్‌సభ టికెట్లు ఇస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. అద్దంకి దయాకర్ (వరంగల్)ను కూడా పార్లమెంటుకు పోటీ చేయిస్తామని చెప్పినట్టు సమాచారం.

ఎమ్మెల్యేగా ఓడిపోతే ఇక అంతే..

ఈ సమావేశాల్లో భాగంగా కేసీవీ మరో ఆసక్తికరమైన అంశాన్ని ప్రస్తావించారు. ఇప్పుడు పట్టుపట్టి ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేస్తున్న నాయకులు ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాల్సిందేనని, ఒకవేళ ఓటమి పాలైతే మాత్రం మళ్లీ ఎంపీ టికెట్లకు పోటీకి రాకూడదని ఆయన సూచించినట్టు తెలిసింది. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డిలతో కేసీవీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇద్దరు యువ నాయకులకు పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని, టికెట్ రానంత మాత్రాన అసంతృప్తి చెందాల్సిన పని లేదని చెప్పారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. బల్మూరి గురించి బోసురాజు ఏదో చెప్పబోగా.. 'వెంకట్ గురించి అధిష్టానానికి తెలుసు. ఈ ప్రభుత్వంపై పార్టీ పక్షాన గట్టి పోరాటం చేశాడు. 60కి పైగా కేసులు నమోదయ్యాయి. జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. రాహుల్‌గాంధీ జైలుకు వెళ్లి వెంకట్‌ను పరామర్శించారు..' అని వేణుగోపాల్ అన్నారు. వెంకట్ రాజకీయ భవిష్యత్తుపై తాను వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటానని, పార్టీ కూడా వెంకట్‌కు తగిన ప్రాధాన్యతనిస్తుందని హామీ ఇచ్చినట్టు సమాచారం. కాగా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి బల్మూరి పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరో వైపు సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఫోన్‌లో కేసీవీ తో మాట్లాడారని తెలుస్తోంది. అయితే ఆయన ఏం మాట్లాడారనేది పార్టీ వర్గాలు గోప్యంగా ఉంచాయి. కాగా వేణుగోపాల్ శుక్రవారం ఉదయం 6:30 సమయంలో ఢిల్లీ వెళ్లారు.


Reliance Growth is Life
SMART BAZAAR
SMART SUPERSTORE
బెస్టివల్ సేల్
1st NOV - 15th NOV
ఫెస్టివల్ ను బెస్టివల్ గా చేసుకోండి
స్మార్ట్ బజార్ కు విచ్చేయండి
కూకట్‌పల్లి: CMR కాంప్లెక్స్, కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ పక్కన. పంజాగుట్ట: గలేరియా మాల్, పంజాగుట్ట మెట్రో స్టేషన్ పక్కన. సైదాబాద్: అరిహంత్ టవర్ సంతోష్‌నగర్, క్రాస్ రోడ్ దగ్గర. తార్నాక: ఇన్నర్ రింగ్ రోడ్ ఆరాధన 70mm థియేటర్ ఎదురుగా. కొంపల్లి: రన్‌వే 9 దగ్గర, కుత్బుల్లాపూర్, కొంపల్లి రోడ్. మాదాపూర్: ఇనార్బిట్ మాల్, ఎల్1. అబిడ్స్: MPM మాల్, GPO ఎదురుగా, అబిడ్స్ X రోడ్. కాచిగూడ: మహేశ్వరి పరమేశ్వరి టవర్స్, కాచిగూడ ఎక్స్ రోడ్. అమీర్‌పేట్: GS 24 క్యారెట్ బిల్డింగ్, మెయిన్ రోడ్. గుడిమల్కాపూర్: కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ పక్కన, గుడిమల్కాపూర్ రోడ్. తిరుమలగిరి: మిలటరీ డెయిరీ ఫామ్ రోడ్ సుభాష్‌నగర్ బస్టాప్. మియాపూర్: మెయిన్ రోడ్ మియాపూర్ బస్టాప్, మియాపూర్ ఎక్స్ రోడ్స్. టోలిచౌకి: సలార్‌పురియా సత్వ మాగ్నస్, బ్లాక్ A, టోలిచౌకి రోడ్ షేక్‌పేట ఫ్లైఓవర్ కింద. గచ్చిబౌలి: గచ్చిబౌలి ఫ్లైఓవర్ పక్కన. పాత అల్వాల్: IG విగ్రహం దగ్గర, CYSR గార్డెన్స్. కూకట్‌పల్లి: యశోద గార్డెన్స్, శాంతినగర్. చాంద్రాయణగుట్ట: బార్కాస్ రోడ్ భారత్ పెట్రోల్ పంప్ దగ్గర. శంషాబాద్: బస్టాండ్ కాలనీ, RB నగర్. బండ్లగూడ: HP పెట్రోల్ బంక్ దగ్గర, చేవెళ్ల రోడ్డు. బల్కంపేట్: శ్రీ ఎల్లమ్మ దేవాలయం పక్కన, బికెగూడ, నిజాంపేట్: గోకుల్స్ ప్లాజా, నిజాంపేట్ రోడ్. బాచుపల్లి: కేవీఆర్ ప్యారడైజ్ కాలనీ దగ్గర, మల్లంపేట రోడ్డు. కొత్తపేట: మోహన్ నగర్, ఎస్బీఐ కాలనీ, గడ్డిఅన్నారం: ఏషియన్ శివ గంగా రోడ్డు. బోడుప్పల్: చిల్కానగర్ మెయిన్ రోడ్ SSS గార్డెన్ ఎదురుగా. నాచారం: ESI హాస్పిటల్ ఎదురుగా. పీర్జాదిగూడ: సాయిపురం కాలనీ, ZP ఉన్నత పాఠశాల ఎదురుగా. ఫిల్మ్ నగర్: రోడ్ నం. 3, ఫిల్మ్ నగర్
SMART BAZAAR
SMART SUPERSTORE
స్వీట్స్
BUY ANY 1 GET ANY 1 FREE
కాజు కత్రి / గులాబ్ జామున్ / రసగుల్లా / మైసూర్ పాక్ / సోన్ పాప్డి / బేసన్ లడ్డూ
200 g మొదలుకుని (సెలక్ట్ వేరియంట్స్)
(బికాజి / స్వాగత్ / టీజ్ ఫ్యాక్టరీ / లాల్ / బికానో)
ఎమ్ఆర్‌పి ₹99 మొదలుకుని
డ్రై ఫ్రూట్స్
BUY1 GET1 FREE
డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ప్యాక్ 225 g
మొదలుకుని (సెలక్ట్ వేరియంట్స్)
(గుడ్ లైఫ్ / నటురోస్ / నటురాల్ / వెండర్ బ్యాండ్ / బోలాస్)
ఎమ్ఆర్‌పి ₹399 మొదలుకుని
₹299/₹369
గుడ్ లైఫ్ ఆల్మండ్ వెల్యూ ప్యాక్ / జీడిపప్పు (W320) 500 g
ఎమ్ఆర్‌పి ₹525 / ₹499
ఆదా చేసుకోండి ₹226 / ₹130
ఇంటి నిత్యావసరాలు
₹49 మొదలుకుని
PHILIPS ECOLINK
దీపావళి డెకొరేషన్
(LED లైట్ / దీపాలు / రంగోలి / తోరణం అండ్ టీ లైట్)
ఎమ్ఆర్‌పి ₹140 మొదలుకుని
₹699
24 పీసెస్ స్టెయిన్‌లెస్ స్టీల్ డిన్నర్ సెట్
ఎమ్ఆర్‌పి ₹2400
మొదలుకుని
50%
ఫోర్డ్ నాన్ స్టిక్ రేంజ్ విత్ హీట్ డాట్ టెక్నాలజీ
ఎమ్ఆర్‌పి ₹1295 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹648 మొదలుకుని
క్యాడ్బరీ సెలబ్రేషన్ / ఫెరెరో రోచెర్ చాకొలేట్ / లాటే / ఓరియన్ చాకో పై ఒరిజినల్ 130.9 g
మొదలుకుని (సెలక్ట్ వేరియంట్స్)
33% వరకు తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹135 మొదలుకుని
అమూల్ కాజు కత్రి 200 g / 500 g
ఆదా చేసుకోండి ₹20/ ₹50
ఎమ్ఆర్‌పి ₹190 / ₹435
స్మార్ట్ ప్రైస్ ₹170 /₹385
బిస్కెట్స్ 300 g మొదలుకుని
(సెలక్ట్ వేరియంట్స్)
BUY ANY 2 GET ANY 1 FREE
ఎమ్ఆర్‌పి ₹120
మొదలుకుని / యూనిట్
కోకో-కోలా / స్ప్రైట్ / థమ్స్అప్ / మిరిండా / పెప్సీ / మాజా 600 ml
మొదలుకుని (సెలక్ట్ వేరియంట్స్)
BUY ANY 3 GET ANY 1 FREE
ఎమ్ఆర్‌పి ₹38
మొదలుకుని / యూనిట్
తెలుగు నంకీన్ 150 g
మొదలుకుని (సెలక్ట్ వేరియంట్స్)
BUY 1 GET 1 FREE
ఎమ్ఆర్‌పి ₹65
మొదలుకుని
విజయా ఘీ 1 ℓ
స్మార్ట్ ప్రైస్ ₹610
ఎమ్ఆర్‌పి ₹690
ఆదా చేసుకోండి ₹80
ఫార్చూన్ రైస్ బ్రాన్ హెల్త్ ఆయిల్ 5 ℓ + ఫార్చూన్ రోజానా దుబార్ బాస్మతి రైస్ 5 kg
స్మార్ట్ ప్రైస్ ₹949
కంబైన్డ్ ఎమ్ఆర్‌పి ₹1425
ఆదా చేసుకోండి ₹476
గుడ్ లైఫ్ డైలీ రైస్ 30 kg
స్మార్ట్ ప్రైస్ ₹1459 (₹48.63/kg)
ఎమ్ఆర్‌పి ₹1650
ఆదా చేసుకోండి ₹191
ప్యారీస్ వైట్ లేబల్ సల్ఫర్ ఫ్రీ చక్కెర 5 kg
స్మార్ట్ ప్రైస్ ₹222 (₹44.40/kg)
ఎమ్ఆర్‌పి ₹300
ఆదా చేసుకోండి ₹78
గోల్డ్ డ్రాప్ / ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 1 ℓ
స్మార్ట్ ప్రైస్ ₹108/ ₹110
ఎమ్ఆర్‌పి ₹138 / ₹138
ఆదా చేసుకోండి ₹30 / ₹28
పాలిష్ చేయని పల్సెస్ శ్రేణి (టాటా/గుడ్ లైఫ్)
BUY ANY 2 GET ANY 1 FREE
ఎమ్ఆర్‌పి ₹64
మొదలుకుని / యూనిట్
గ్రాస్ బ్రూమ్ రెగ్యులర్ / XL 1 యూనిట్
50% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹170 / ₹250
స్మార్ట్ ప్రైస్ ₹85 / ₹125
సింథాల్ / డవ్ / ఫియామా / గోద్రెజ్ నం.1 / లక్స్ / పియర్స్ సోప్ 125 g
మొదలుకుని (మల్టీ ప్యాక్) (సెలక్ట్ వేరియంట్స్)
BUY ANY 2 GET ANY 1 FREE
ఎమ్ఆర్‌పి ₹175
మొదలుకుని / యూనిట్
బాడీ లోషన్ / క్రీమ్ / ఫేస్‌వాష్ 100 ml
మొదలుకుని (సెలక్ట్ వేరియంట్స్)
50% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹230
మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹115
మొదలుకుని
బ్యూటీ ఎసెన్షియల్స్ 0.35 ml మొదలుకుని
(సెలక్ట్ వేరియంట్స్)
BUY 1 GET 1 FREE
ఎమ్ఆర్‌పి ₹99
మొదలుకుని
పూజ సామాగ్రి (అగర్బత్తి / క్యాంఫర్ / నెయ్యి / సాంబ్రాణి కప్స్) (సెలక్ట్ వేరియంట్స్)
BUY 1 GET 1 FREE
ఎమ్ఆర్‌పి ₹25
మొదలుకుని
గోల్డ్ ప్లేటెడ్ పోర్సలీన్ సర్వింగ్ శ్రేణి
స్మార్ట్ ప్రైస్ ₹499 మొదలుకుని
ఎమ్ఆర్‌పి ₹998
మొదలుకుని
TRIDENT Raymond Home
డబల్ బెడ్‌షీట్ విత్ పిల్లో కవర్ (144 TC)
స్మార్ట్ ప్రైస్ ₹737
Offer valid till 12th November 2023
ఎమ్ఆర్‌పి ₹2699
3 పీసెస్ హార్డ్ ట్రాలీ సెట్
*7 సంవత్సరం వారంటీ
స్మార్ట్ ప్రైస్ ₹5999
ఎమ్ఆర్‌పి ₹22000
BERGNER
మాస్టర్‌ప్రో ఏయిర్ ఫ్రయర్ 4.2 ℓ
స్మార్ట్ ప్రైస్ ₹4999
*8 ప్రీసెట్ మెను
ఎమ్ఆర్‌పి ₹16990
దివాళికి స్వాగతం పలకండి స్టైల్‌తో
స్మార్ట్ బజార్ కు విచ్చేయండి
ఉమెన్స్
కుర్తా ₹299
చుడీదార్ ₹299
దుపట్టా ₹199
డ్రెస్ ₹599
మెన్స్
కుర్తా ₹299
జాకెట్ ₹699
టీ-షర్ట్ ₹299
డెనిమ్స్ ₹599
కిడ్స్
కుర్తా ₹349
లెహంగా సెట్ ₹599
టీ-షర్ట్ ₹149
*T & C Apply.
వద్ద కూడా లభ్యం
fresh Signature
AXIS BANK
dil se open CELEBRATIONS
10% Instant Discount
On Min. Txn of ₹3000/- on Axis Bank Credit Cards | Max Discount up to ₹500/- Valid Once Per Card | Offer Valid From 9th Nov to 15th Nov 2023
ICICI Bank 10% Instant Discount*
On Credit Cards | Min. Transaction of ₹3,000/- | Max Discount up to ₹500/- Valid From 9th to 18th November 2023 | Valid Once per Card
మీకు సమీపంలో ఉన్న స్టోర్ లొకేట్ చేయడానికి స్కాన్ చేయండి

మానవుడు జీర్ణమైన వస్త్రాలను విసర్జించి కొత్త వాటిని ఎలా ధరిస్తాడో,
అలాగే దేహధారి జీర్ణమైన శరీరాలను విసర్జించి కొత్తవాటిని స్వీకరిస్తాడు.
– హైందవ ధర్మం

సాక్షి
శనివారం, 11 నవంబర్ 2023

కష్టాల్లో 'ఫైర్ బ్రాండ్'

తొలిసారి చట్టసభల్లో అడుగుపెట్టినవారికి గుర్తింపు రావటం అంత సులభం కాదు. ప్రసంగించే అవకాశం లభించటం, దాన్ని సద్వినియోగం చేసుకోవటం చాలా అరుదు. మహిళా ఎంపీల విషయంలో దాదాపు అసాధ్యం. కానీ రాజకీయ రంగప్రవేశం చేసిన కొద్దికాలంలోనే తృణమూల్ కాంగ్రెస్ తరఫున ఎన్నికై లోక్‌సభలో ప్రవేశించిన మహువా మొయిత్రా చాలా త్వరగానే 'వార్తల్లో వ్యక్తి' అయ్యారు. తీరా నాలుగేళ్లయ్యే సరికల్లా వివాదంలో చిక్కుకున్నారు. ఏం జరిగిందో అందరూ గ్రహించే లోగానే ఉరుము లేని పిడుగులా, ఊహించని ఉత్పాతంలా వచ్చిపడిన వివాదం చివరికామె పార్లమెంటు సభ్యత్వానికి కూడా ఎసరుపెట్టేలా పరిణమించింది. సభ్యుల నైతిక వర్తనను నియంత్రించే లోక్‌సభ ఎథిక్స్ కమిటీ ఆమెను సభ నుంచి బహిష్కరించాలని స్పీకర్‌ను కోరుతూ గురువారం నివేదికను ఆమోదించింది. ఇందుకు ప్రధానంగా అనైతిక వర్తన, తీవ్ర తప్పిదాలకు పాల్పడటం కారణాలుగా చూపింది. అంతేకాదు... ఈ విషయంలో సంస్థాగత విచారణ, చట్టపరంగా గట్టి చర్యలు అవసరమని సిఫార్సు చేసింది. పార్లమెంటు సభ్యులు సభలో ప్రశ్నలు వేయటానికి వినియోగించే ఎన్ఐసీ వెబ్‌సైట్ లాగిన్, పాస్‌వర్డ్ ఆమె తన స్నేహితుడైన దుబాయ్ రియలెస్టేట్ వ్యాపారి దర్శన్ హీరానందానీకి ఇచ్చారనీ, ఆయన నుంచి కోటి రూపాయల ముడుపులు తీసుకుని ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీ సంస్థలపై ప్రశ్నలు సంధించారనీ మొయిత్రాపై వచ్చిన ఆరోపణలు. ఆ ప్రశ్నలు అదానీ సంస్థల ప్రయోజనాలు దెబ్బతీసేంత తీవ్రమైనవా? అందువల్ల హీరానందానీకి ఒరిగేదేమిటి? ముడుపుల సంగతిని మొయిత్రా తోసిపుచ్చారు. లాగిన్, పాస్‌వర్డ్ ఇచ్చినట్టు అంగీకరించారు. అందుకుగల కారణాలు చెప్పారు. ఇదంతా దేశభద్రతకు ముప్పు తెచ్చే చర్య అనీ, లంచం తీసుకుని ప్రశ్నలేయటం అనైతికమనీ బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే గత నెలలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు ఫిర్యాదు చేశారు. కమిటీ విచారణ తీరుతెన్నులను ప్రశ్నిస్తూ ఇప్పటికే మొయిత్రా ఓం బిర్లాకు లేఖ రాశారు. కమిటీ తనను ప్రశ్నించిన తీరు 'వస్త్రాపహరణం' మాదిరిగా వున్నదంటూ దుయ్యబట్టారు.

మొయిత్రా రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ వలె ఆంగ్ల భాషాప్రావీణ్యం వుండటం వల్లనే త్వరగా ఆమెకు పేరుప్రతిష్ఠలు సాధ్యమైనాయని అనుకోవటానికి లేదు. ప్రసంగించదల్చుకున్న అంశంపై పట్టు సంపాదించటం ఒక్కటే మొయిత్రా ప్రత్యేకతని చెప్పడానికి కూడా లేదు. విషయ పరిజ్ఞానంతోపాటు విస్ఫులింగాలు విరజిమ్మే స్వభావం, నిర్భీతిగా పాలక పక్షాన్ని నిలదీసే తత్వం ఆమెకొక విశిష్టతను తీసుకొచ్చాయి. అంతకుముందు మూడేళ్లు ఆమె తృణమూల్ ఎమ్మెల్యేగా పనిచేశారు. కానీ మొయిత్రా గురించి దేశానికంతకూ తెలిసింది ఈ నాలుగేళ్ల కాలంలోనే. సభలోనే కాదు... వెలుపల కూడా ఆమె ప్రధాని నరేంద్ర మోదీకి, బీజేపీకి వ్యతిరేకంగా నిప్పులు చిమ్ముతారు. మూకుమ్మడి అత్యాచారం కేసులో యావజ్జీవ శిక్షపడిన గుజరాత్ దోషులకు క్షమాభిక్ష పెట్టడాన్ని సవాలు చేస్తూ ఆమె సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎథిక్స్ కమిటీ విచారణలో నిర్ధారించిన అంశాలేమిటో, అవి ఏరకంగా తీవ్రమైన స్వభావంతో కూడుకున్నవో ఇంకా తెలియాల్సి వుంది. ఎన్ఐసీ లాగిన్, పాస్‌వర్డ్ ఇవ్వటం విషయంలో ఇంతవరకూ ఎలాంటి నిబంధనలూ లేవు. అయినా సరైంది కాదనుకుంటే ఆమెను మందలించవచ్చు. కమిటీలోని విపక్ష సభ్యులు చెబుతున్న ప్రకారం 800 మంది ఎంపీల్లో అనేకులు సగటున కనీసం ఇద్దరు ముగ్గురికి ఇలా ఇస్తారు. కంప్యూటర్‌ల వాడకం, సాంకేతిక పరిజ్ఞానం లేకపోవటం ఇందుకు కారణం. ఈ విషయంలో స్పీకర్ ఏం నిర్ణయిస్తారన్నది చూడాలి. ఆ సంగతలా వుంచితే ఫిర్యాదు, విచారణ వగైరాలన్నీ ఆదరా బాదరాగా సాగినట్టు కనబడుతోంది. అక్టోబర్ 26న కమిటీ తొలి సమావేశం జరిగింది. ఈ నెల 2న జరిగిన రెండో సమావేశం మధ్యలోనే ముగిసింది. అడిగినవాటికి జవాబివ్వకుండా ఆమె దుర్భాషలాడారని కమిటీ ఛైర్మన్ వినోద్ కుమార్ సోంకార్ ఆరోపిస్తే... ఫిర్యాదుతో సంబంధం లేని ప్రశ్నలతో తన వ్యక్తిత్వాన్ని దిగజార్చేలా వేధించారన్నది మొయిత్రా ఆరోపణ. దుబాయ్ వెళ్తే ఏ హోటల్‌లో దిగుతారు... మీతో ఎవరుంటారు... మీరు మీ మిత్రులతో మాట్లాడుతున్నట్టు వారి భార్యలకు తెలుసా అని అడిగారని కూడా ఆమె ఆరోపించారు. దీనికి నిరసనగా ఆమె, విపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. కమిటీ విచారణ గోప్యం కనుక ఆరోపణలు, ప్రత్యారోపణల్లో నిజానిజాలేమిటో తెలియదు. అయితే ఈ మొత్తం వ్యవహారం మన పార్లమెంటరీ వ్యవస్థ ఔన్నత్యాన్ని దెబ్బతీస్తుందన్నది మాత్రం వాస్తవం.

అసలు దూబే ఫిర్యాదుకు మొయిత్రా మాజీ సహచరుడు దేహద్రాయ్ లేఖ ఆధారమన్న సంగతి కమిటీకి తెలుసా? కమిటీకిచ్చిన అఫిడవిట్‌లో మొయిత్రాకు ముడుపులు చెల్లించానని హీరానందానీ అంగీకరించారా? లేదని విపక్ష సభ్యులు చెబుతున్నారు. విడిపోయిన జంట పరస్పరం ఆరోపించుకోవటం సర్వసాధారణం. ఇప్పటికే పెంపుడు కుక్క విషయంలో వారిద్దరూ కేసులు పెట్టుకున్నారు. కనుక దేహద్రాయ్ ఫిర్యాదు అంశంలో దూబే, ఎథిక్స్ కమిటీ ఆచితూచి అడుగులేయాల్సింది. మహిళ గనుకే ఇలా చేశారన్న అపవాదు రానీయకుండా చూసుకోవాల్సింది. ఈ వ్యవహారంలో వ్యక్తిగతం, రాజకీయం కలగాపులగం చేశారన్న అప్రదిష్ఠ కలగడమూ మంచిది కాదు. ఏదేమైనా వ్యవస్థను ఢీకొట్టేవారు నిరంతరం అత్యంత జాగురూకతతో మెలగాలని మొయిత్రా ఇప్పటికే గుర్తించి వుంటారు. ఈ వివాదంలో పార్లమెంటరీ వ్యవస్థ ఔన్నత్యానికి అనుగుణమైన నిర్ణయం వెలువడాలని అందరూ కోరుకుంటారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.త్రయోదశి ప.12.47 వరకు తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** చిత్త రా.1.43 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ఉ.8.30 నుండి 10.15 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.04 నుండి 7.34 వరకు, **అమృతఘడియలు:** సా.6.49 నుండి 8.33 వరకు, శని త్రయోదశి, మాసశివరాత్రి.

సూర్యోదయం : 6.06
సూర్యాస్తమయం: 5.22
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

బాబు వారి అవినీతి చరితము

అభిప్రాయం



డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి

దేశంలోనే అత్యంత అవినీతిపరుడిగా నారా చంద్రబాబు నాయుడు అపఖ్యాతి మూటగట్టుకున్నాడు. చిన్న పూరిల్లు, రెండెకరాల పొలంతో చంద్రబాబు జీవితం మొదలైంది. కానీ 2004లో ముఖ్యమంత్రిగా దిగిపోయే నాటికి అతని ఆస్తులు లక్ష కోట్లకు చేరినాయని అంచనా. అవినీతి, అక్రమాల్లో ఆరితేరిన వాళ్లంతా అనుయాయుల రూపంలో ఇతని వెంటే ఉంటారు. ఇక 2014లో ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రాన్ని ఎలా లూటీ చేశాడో మొత్తం అవినీతి చరిత్రంతా ఆంధ్రప్రదేశ్ 'సీబీసీఐడీ' వారు సాక్ష్యాధారాలతో సహా కోర్టు ముందుంచారు. 2014 నుండి 2019 వరకు అతడు చేసిన అవినీతి పనులు, సంపాదించిన దాదాపు 6 లక్షల కోట్ల ధనం మీద ఇప్పుడు విచారణ మొదలైంది.



కోర్టు తీర్పుల వలన లభించిన ప్రోత్సాహంతో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు మరీ బరితెగించాడు. భార్య, కొడుకు పేర్లతో వందల కోట్ల రూపాయల విలువగల భూ క్రయ, విక్రయాలు కొనసాగించాడు. చివరకు రెండెకరాల ఆస్తి మాత్రమే కలిగిన వృద్ధురాలైన తన తల్లి అమ్మణ్ణమ్మను కూడా ఈ అవినీతి జాబితాలోకి లాక్కొచ్చాడు. ఆమె హైటెక్ సిటీ దగ్గర 35 లక్షలకు 5 ఎకరాల భూమిని కొని, దానిని ఆస్తిపరుడైన మనుమడికి కానుకగా ఇచ్చిందంటే నమ్మే విషయమేనా?

కోల్పోయిన 'ట్రస్ట్'

1995లో ముఖ్యమంత్రి పదవి చేపట్టి వారం రోజులు పూర్తి కాకుండానే మాదాపూర్‌లో ఒక ప్రభుత్వ అధీన సంస్థకు చెందిన 140 ఎకరాల భూమి, ఆ తరువాత అదే సంస్థకు చెందిన మరో 18 ఎకరాల భూమిని ఎల్ అండ్ టీ కంపెనీకి స్వాధీనం చేయవలసిందిగా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించడం వెనుక పెద్ద గూడుపుఠాణియే జరిగింది. ఆ కంపెనీ అధిపతి రామకృష్ణకూ, చంద్రబాబు నాయుడికీ ఉన్న సాన్నిహిత్యంతో అదే ఎల్ అండ్ టీ కంపెనీ భాగస్వామ్యం గల ప్రయివేటు సంస్థకు కాకినాడ రేవును అప్పగించాడు. 1,500 కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్టులు ఎల్ అండ్ టీ కంపెనీకి అందాయి. దాని ఫలితంగా బంజారాహిల్స్‌లో 'హుడా' వారు మార్కెట్ కాంప్లెక్స్ నిర్మించాలనుకున్న స్థలాన్ని స్వాధికారికంగా తనకు తనే అప్లికేషన్ పెట్టుకొని, ఆ స్థలాన్ని పొంది, ఇదే ఎల్ అండ్ టీ కంపెనీ రామకృష్ణ గారి దయతో ఎన్టీఆర్ ట్రస్ట్ భవనాన్ని నిర్మించిన మాట వాస్తవం కాదా?

బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 'వెంకటేశ్వర కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ' పేర ఉన్న భవనం, పంజాగుట్టలో హెరిటేజ్ ఫుడ్స్ ప్రధాన కార్యాలయ భవనం, లెక్కల్లో చూపని ఆస్తులు. ప్రైవేట్ పవర్ ప్రాజెక్టుల కుంభకోణాలలో చంద్రబాబు సహాయం పొందిన ఒక కంపెనీ యాజమాన్యం పంజాగుట్ట భవన పునర్నిర్మాణానికి 2, 3 అంతస్తులు పెంచటానికి కోట్ల రూపాయలు ఖర్చు చేసింది.

ఇంకా ఇతర ఆస్తులు: నల్లగొండ జిల్లా ఎమ్.డి.ఎల్. యల్లారెడ్డి గూడలో 19 సెంట్ల భూమి, ఎసి.ఓ. కొత్తగూడ, శేరిలింగంపల్లి మండలం ఆర్ఆర్ వద్ద 19 ఎకరాల భూమి, తమిళనాడులోని శ్రీపెరంబదూర్ సమీపంలోని టెన్నార్ కుప్పం గ్రామంలో 2.23 ఎకరాలు, మాదాపూర్‌లోని శ్రీరామ అగ్రికల్చరల్ ఫామ్‌లో 3.28 ఎకరాలు, వివిధ కంపెనీలలో రూ. 1 కోటీ 12 లక్షల 31 వేలు – ఇవన్నీ అతను ప్రకటించిన ఆస్తులే. ఇవి కాక శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి, మాదాపూర్ ప్రాంతాల్లో సుమారు 25, 30 రిజిస్ట్రేషన్ పత్రాల ద్వారా చంద్రబాబు అతని కుటుంబ సభ్యులు, సమీప బంధువులు వ్యాపార లేదా అవినీతి వాటాదారులు ఎన్నో స్థలాలను కొన్నారు. ఈ భూముల విలువ పెంచటానికి చంద్రబాబు ప్రజాధనంతో రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి ఆ స్థలాల ధరలను పెంచుకున్నాడు.

ఎన్టీఆర్ కుటుంబ సభ్యులను తన చెప్పుచేతల్లో ఉంచుకోవడానికి భూతాల గృహంగా మారిన రామకృష్ణ స్టూడియోను అద్దెకు తీసుకోవటానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో, ప్రభుత్వం తరఫున ఉన్న రేట్ల కంటే రెట్టింపు కిరాయికి తీసుకొని నెలకు 12 లక్షల ప్రభుత్వ ధనాన్ని చెల్లించాడు. ఏ మాత్రం సౌకర్యాలు లేని ఆ స్టుడియోలోకి 'స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్' కార్యాలయాన్ని బలవంతంగా బదిలీ చేయించి అధికారులు, సిబ్బంది, విజిటర్స్‌ను ఎన్నో ఇబ్బందులకు గురిచేశాడు.

వెయ్యి పేజీల పుస్తకమే!

ఆ సమయంలో వివిధ పథకాలకు కేటాయించిన నిధుల్లో ఎక్కువ శాతం మాయమైపోయి ప్రజలకు, నిరుపేద దళిత విద్యార్థులకు అరకొరగా మాత్రమే లభించాయి. పనికి ఆహార పథకం కింద బియ్యం, స్టేషనరీ కొనుగోలులో కోట్లాది రూపాయలు గల్లంతయ్యాయి. ఆంధ్రప్రదేశ్ బ్రూవరీస్ ప్రభుత్వ సంస్థకు మద్యం విక్రయించే ఉత్పత్తిదారులు, ఇతర రాష్ట్రాల్లో అమ్మే ధర కంటే ఏపీలో ఎక్కువ ధరకు పెంచి, ఆ లాభాల్లో చంద్రబాబుకు వాటా ఇచ్చేవారు. విద్యుత్ సంస్థల్లో కూడా అధిక ధరలకు అవకాశం ఇచ్చి వారిచ్చే లంచాలకు ఆశపడేవాడు. ఇక ఇతని బినామీలుగా మురళీ మోహన్, సీఎం రమేశ్ ప్రసిద్ధి చెందారు. ఇతని దారుణాలు ఇంకా చాలా ఉన్నాయి. అబ్బో... 'నారా'వారి అవినీతి చరిత్ర 1,000 పేజీల పుస్తకం అవుతుంది. దేవాలయ భూములు కోట్ల రూపాయల విలువ చేసేవి లక్షల రూపాయలకు అక్రమంగా విక్రయం అవుతున్నట్లు ఆనాడు చిన్నజీయర్ స్వామి వంటి వారే ఆరోపించారు. ఈ అక్రమ సంపాదనంతా ఎన్టీఆర్ ట్రస్ట్‌కు విరాళాల రూపంలో అందేది. అలాగే సిమెంట్ ఉత్పత్తిదారులు, స్టీలు, ఇసుక, కంకర వ్యాపారులకు ధరలు అధికంగా పెంచుకోవటానికి అనుమతినిచ్చి వారినుండి పెద్ద స్థాయిలో ముడుపులు తీసుకునేవాడు.

చివరకు వ్యవసాయదారుల నోట్లో మట్టికొట్టే విధంగా ఎన్నో కల్తీ విత్తనాలు, ఎరువులు అమ్మే సంస్థలకు అనుమతినిచ్చి వారి నుండి భారీగా డబ్బు వసూలు చేసేవాడు. దానివలన మోసపోయిన రైతులు సరిగా పంటలు పండక అప్పులపాలై చివరకు కొన్ని వేల మంది ఆత్మహత్యలకు పాల్పడితే నామమాత్రపు పరిహారాన్ని ప్రకటించి దానిని కూడా 'కడతేరని కష్టాలు కాదు, కడతేరితే ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం' అంటూ అమానవీయంగా ప్రకటన చేయించాడు. ఇతని హయాంలో అంటే 1998–99లో ఒక్క వరంగల్ జిల్లాలోనే 300 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కార్పొరేట్ వ్యవసాయం పేరుతో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశాడు. ఇతని హయాంలోనే ఎంతోమంది చేనేత కార్మికులు బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. కరెంటు లేక, పొలాలకు నీళ్ళందక లక్షల హెక్టార్లలో పైరులు ఎండిపోయాయి. అడిగినవాళ్ళను కాల్పించి తప్పించాడు. అందుకే 'తెలంగాణ వాదం' మరొక్కసారి ఊపిరి పోసుకుని ఉద్యమించింది.

తన కోసమే జనమనే అహంకారం

ఇప్పటికీ ఇతనికి కనువిప్పు జరగలేదు. 'తన కోసమే జనం తప్ప, జనం కోసం తాను కాదనే' అహంకారాన్ని పెంచుకున్నాడు. ఎన్ని పరాభవాలు జరిగినా ఇప్పటికీ అతని అవివేకపు కార్యక్రమాలు మానలేదు. ఇతడి వలన తెలుగుజాతి, తెలుగుదేశం పార్టీ పరువు దిగజారిపోయాయే తప్ప దేశ చరిత్రలో గొప్ప స్థానం పొందిన పథకం ఒక్కటీ రూపొందలేదు. పైగా, తెలుగు రాష్ట్రం మీద కొంచెం కూడా అవగాహన లేని ఇతడు విదేశాల మీద మోజుతో ప్రతి విదేశీ పథకాలను ప్రస్తావించేవాడు. ఉదాహరణకు మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమకు జర్మనీ, జపాన్‌లను, ఇన్ఫర్మేషన్‌కు ఇజ్రాయేల్‌ను అస్తమానం పొగుడుతూ సొంత రాష్ట్రాన్ని మట్టికరిపించాడు. ఎప్పుడు ఇతను అధికారానికొచ్చినా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచటమే. ఆర్థికంగా, రాష్ట్రాన్ని దివాళా తీయించడం, అప్పులు చెల్లించలేనంత ఆర్థిక దుఃస్థితిలో ఉంచటం పరిపాటిగా మారింది. విపరీతమైన ధనకాంక్షతో హద్దుమీరి ప్రజాధనాన్ని లూటీ చేసి విదేశాలలో వ్యాపారాల మీద పెట్టుబడులు పెట్టాడు. 2004లో ఇతను దిగిపోయే నాటికి అతని ఆస్తులు లక్ష కోట్లకు చేరినాయని అంచనా. ఇక 2014లో ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రాన్ని ఎలా లూటీ చేశాడో మొత్తం అవినీతి చరిత్రంతా ఆంధ్రప్రదేశ్ 'సీబీసీఐడీ' వారు సాక్ష్యాధారాలతో సహా కోర్టు ముందుంచారు. గౌరవ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గారు అసెంబ్లీలో వాటి వివరాలను ప్రెజెంట్ చేయడం జరిగింది.

2

అవినీతి, అక్రమాల్లో ఆరితేరిన వాళ్లంతా అనుయాయుల రూపంలో, అధికారుల రూపంలో ఇతని వెంటే ఉంటారు. వాళ్ళు పట్టుబడినా శిక్షలు ఉండవు. దొంగ నోట్లు ముద్రించిన రామకృష్ణ గౌడ్, కృషి బ్యాంక్ ద్వారా ప్రజల్ని మోసం చేసిన వెంకటేశ్వర రావు, విద్యార్థి స్కాలర్ షిప్పులను మాయం చేసిన వారు, పేదవాడి పనికి కూలీగా ఇచ్చిన బియ్యాన్ని లారీలు లారీలు అమ్ముకున్న పెద్ద మనుషులు, హత్యల్లో, బాంబు పేలుళ్లలో ప్రసిద్ధి చెందినవారంతా ఇతని అనుచరగణమే. ఏ శిక్షలూ ఉండవు. డబ్బు సంపాదించు, ఎన్నికల్లో గెలువు... ఇక వేరే పాపపుణ్యాల సంగతి నీకెందుకు – ఇదే ఆయన పార్టీ వారికి ఇచ్చిన గొప్ప సందేశం.

అదొక చీకటి యుగం

అలాగే ఇతని 2020 విజన్ గమనిస్తే తెలుగు రాష్ట్రాల పరిస్థితులు భౌగోళిక స్థితులు ఏ మాత్రం అవగాహన లేనట్లు కన్పిస్తుంది. మొత్తం ఇతని పరిపాలనా కాలమంతా విదేశీ పొగడ్తలతోనే సరిపోయింది. స్వార్థపరత్వం, పదవీ లాలస, అవినీతి... ఇతని సహజ లక్షణాలు. 14 సంవత్సరాల ఇతని పాలనా కాలమంతా ఆంధ్ర రాజకీయ చరిత్రలో ఒక చీకటి యుగంగా పరిగణించవచ్చు.

ప్రతి వ్యవస్థలో తన వ్యక్తులను ప్రవేశపెట్టి, కోర్టులను సైతం పక్కదారి పట్టించి, వచ్చిన కేసులన్నీ విచారణకు రాకుండానే కొట్టి వేయించుకోవడం ఇతనికే సాధ్యపడిన గొప్ప కళ. జస్టిస్ బీఎస్ఏ స్వామి గారు తాను రాసిన 'ఎ కాస్ట్ క్యాప్చర్స్ ఏపీ జ్యుడీ షియరీ' అనే పుస్తకంలో చంద్రబాబుకూ, న్యాయమూర్తులకూ ఒక మాజీ న్యాయమూర్తి అనుసంధానకర్తగా వ్యవహరించారు అని రాశారు. దీనిని బట్టే అర్థమౌతున్నది కదా, ఇతని కేసులన్నీ ఎందుకు పక్కదారి పట్టాయో! ఇతని హయాంలో మీడియాకు పెద్ద ఎత్తున నిధులు ఇవ్వబడ్డాయి. ఒక్క 'ఆంధ్రజ్యోతి'కే 750 కోట్లు ఇచ్చాడంటేనే మీడియానెంతగా జేబులో పెట్టుకున్నాడో అర్థమౌతున్నది.

ఇతని దరిద్రపు పాలనలో ఎన్నో పెద్ద పరిశ్రమలు మూతబడ్డాయి. పేద విద్యార్థులు పై చదువులకు దూరమయ్యారు. ఇతను ప్రోత్సహించిన ప్రయివేటు విద్యాసంస్థలు ఇతనికి ముడుపులు చెల్లిస్తూ భారీ ఫీజులు పెంచి విద్యార్థులను పీడించాయి. చివరకు కోలా కృష్ణమోహన్ వంటి 'యూరో లాటరీ' మోసగాడి నుండి కూడా ఎన్టీఆర్ ట్రస్ట్‌కు 10 లక్షల విరాళం తీసుకున్నాడంటే ఎంత దిగజారుడు మనస్తత్వమో అర్థం చేసుకోవచ్చు.

ఇప్పటివరకు రాసిందంతా 2004 ఎన్నికల ముందు వరకు ఈ దేశంలో సంపాదించిన అక్రమాస్తులను గురించి. ఇంకా సింగపూర్, మలేషియా, మారిషస్, దుబాయ్, స్విట్జర్లాండ్, అమెరికాలో ఉన్న ఆస్తుల వివరాలన్నీ వేరే.

ఇన్నాళ్ళకైనా అతని పాపాలు, అవినీతి చిట్టాలు బయటకు రావటానికి కారణమైన కేంద్ర సంస్థలు ఐటీ, ఈడీలకూ, రాష్ట్ర సీఐడీ వారికీ, ధైర్యంతో ఎన్నికలను కూడా లెక్క చేయకుండా ఈ కేసుల్ని బయటకు తీసుకురావటంలో సహకరించిన ముఖ్యమంత్రి, గౌరవనీయులు జగన్ మోహన్ రెడ్డి గారికీ ఈ రాష్ట్ర ప్రజలు కృతజ్ఞతలు చెప్పుకోవలసి ఉంది.

2014 నుండి 2019 వరకు అతడు చేసిన అవినీతి పనులు, సంపాదించిన దాదాపు 6 లక్షల కోట్ల ధనం మీద ఇప్పుడు విచారణ మొదలైంది గనుక ప్రజలందరికీ అవి అందుబాటులో ఉన్నాయని రాయటం లేదు. ప్రజలందరూ అర్థం చేసుకోగలరు.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

భవితను నిర్ణయించే హక్కు

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం. కాని ఈనాడు ఓటును అమ్మే, కొనే సరుకుగా మార్చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి తీరని నష్టం. ప్రజలు తమకు సేవచేయడం కోసం ఐదేళ్ళ కాలపరిమితికి సేవకుల్ని ఎన్నుకోగలిగిన అవకాశాన్ని ఇచ్చేది ఓటు. ఓటు విలువను ప్రతి ఒక్కరూ గుర్తించి ఓటు హక్కును వినియోగించుకోవాలి. నిరక్షరాస్యులే కాదు, ఉన్నత విద్యావంతులు సైతం ఓటు హక్కును బాధ్యతగా వినియోగించు కోవడం లేదు. మన భవితను నిర్ణయించే ఓటు హక్కు పట్ల నిర్లిప్తత ఎంతమాత్రం మంచిది కాదు. ముఖ్యంగా యువత నిర్లిప్తత వీడి బాధ్యతను గుర్తించాలి. యువతరంతోనే మార్పు సాధ్యమవుతుంది.

అవినీతికి, అక్రమాలకు పాల్పడని వారూ, ప్రజాస్వామ్యం, సెక్యులర్ విలువల పట్ల అపార నమ్మకం కలిగిన వారినే ఎన్నుకోవాలి. 'అందరూ అందరే' అన్నట్లుగా అభ్యర్థులున్నప్పుడు, ఉన్నంతలో మెరుగైన వ్యక్తిని ఎంపిక చేసుకోవాలి. మతోన్మాద ఫాసిస్టు భావాలు కలిగిన వారిని చట్టసభల్లోకి రాకుండా చూడాలి. ప్రజల మనోభావాలతో ఆడుకొనేవారినీ, డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలకు లోను చేసి ఓట్లు కొల్లగొట్టాలనచూసే వారినీ చిత్తుచిత్తుగా ఓడించాలి.

ఏవిధంగా చూసినా, ఈ ఎన్నికలు చాలా కీలకమైనవి. మతోన్మాద శక్తులు మన సంస్కృతినీ, సామరస్య వాతావరణాన్నీ కలుషితం చెయ్యాలని చూస్తున్నాయి. అలాకాకుండా గంగా జమునా తెహజీబ్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ సంక్షేమాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరిదీ. మతోన్మాద శక్తులకు ఏమాత్రం అవకాశం ఇచ్చినా లౌకిక విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్వీర్యమై ఉన్మాద భావజాలం రాజ్యమేలుతుంది. అభ్యర్థి నచ్చని పక్షంలో ఓటువేయకుండా ఉండడం సరికాదు. చివరి అస్త్రంగా మాత్రమే 'నోటా'కు ఓటువేసి, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా బరిలో ఉన్న అభ్యర్థులెవరూ అర్హులు కాదన్న సంకేతాన్ని ఇవ్వవచ్చు.

– ఎమ్.డి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్

దేశ విభజనను వ్యతిరేకించిన దేశ భక్తుడు

సందర్భం




డొక్కా మాణిక్య వరప్రసాద్

మౌలానా అబుల్ కలాం ఆజాద్ ప్రఖ్యాత రాజనీతిజ్ఞుడు, విద్యావేత్త, రచయిత. భారత స్వాతంత్ర్యం కోసం సామాజిక సాంస్కృతిక అంశాలపై విశ్లేషణలతో కూడిన వ్యాసాలు రాశారు. పద్నాలుగు ఏళ్ళకే 'ది వాయిస్ ఆఫ్ ట్రూత్' అనే జర్నల్‌ను నడిపారు. ఆయన భారతీయత నిండిన మేధావి. స్వాతంత్ర్యానంతరం మొదటి కేంద్ర విద్యాశాఖా మంత్రి. జాతీయ విద్యావిధాన రూపశిల్పి. ఆయన పుట్టినరోజును భారతీయ అక్షరాస్యతా దినోత్సవంగా మనం జరుపుకొంటున్నాం.

భారత స్వాతంత్ర్య సమరంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమించిన ముస్లిం దేశభక్తుల్లో ఆజాద్ అగ్రగణ్యులు. ఆయన సనాతన పండిత వంశంలో జన్మించారు. బాల్యం కలకత్తాలో గడిచింది. ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాల్, అరబిక్, ఇంగ్లిష్ భాషలను నేర్చుకున్నారు. తత్వ శాస్త్రం, గణితాల్లో ప్రావీణ్యం సంపాదించారు. లార్డ్ కర్జన్ 1905లో బెంగాల్‌ను విభజించినపుడు తీవ్రంగా వ్యతిరేకించారు. ''అల్‌హిల్'' అనే పత్రికను స్థాపించి జాతీయ భావాలను ప్రచారం చేశారు.

గుజరాత్‌లోని 'చౌరీ చౌరా' వద్ద జరిగిన హింసాత్మక సంఘటనలకు నిరసనగా గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని నిలిపివేశారు. దీనికి గాంధీ నాయకత్వంపై తిరుగుబాటు వచ్చింది. ఆజాద్ మిత్రుడు బెంగాల్ వాసి సి.ఆర్. దాస్ కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి 'స్వరాజ్య' పార్టీని స్థాపించారు. అయినా ఆజాద్ గాంధీతోనే ఉండి తన రాజకీయ దృక్పథాన్ని వెల్లడించారు. సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా దేశమంతటా పర్యటించారు. పర్యటన అనంతరం ముస్లింలకు ప్రత్యేక ఎన్నికల విధానం కావాలని ముస్లింలీగ్ నేతలు చేపట్టిన ఉద్యమాన్ని వ్యతిరేకించారు. నెహ్రూతో ఉన్న సాన్నిహిత్యంతో భారతదేశం స్వాతంత్ర్యానంతరం సోషలిజం భావజాలంతో అసమానతలు, పేదరికం లేని గొప్ప దేశంగా ఎదగాలని తపించారు. లక్నో కాంగ్రెస్ సభలో సోషలిజం సాధనకై కాంగ్రెస్ కట్టుబడి ఉండాలని ఉద్ఘాటించారు.



1940లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గెలిచి దేశమంతటా పర్యటించి హిందూ ముస్లిం ఐక్యత కోసం పనిచేశారు. దేశ విభజన సమయంలో హిందూ ముస్లిం అల్లర్ల వల్ల ఆజాద్ తీవ్రంగా కలత చెందారు. బెంగాల్, బిహార్ ప్రాంతాల్లో పర్యటించి మత సామరస్యం కోసం కృషి చేశారు. దేశాన్ని ఇండియా, పాకిస్తాన్‌లుగా విభజించాలనే బ్రిటిష్ ప్రతిపాదనపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో చర్చ జరిగినపుడు ఆజాద్ ఆ చర్చను బహిష్కరించారు. భారత ఉపఖండమంతా ఐక్యంగా ఉండాలని ప్రావిన్షియల్ రాష్ట్రాలకు అత్యధిక అధికారాలు ఇస్తూ, కేంద్రం పరిమితమైన అధికారాలతో ఉండే ప్రతిపాదనలను ఆజాద్ చేశారు. తద్వారా హిందూ, ముస్లింల మధ్య ఐక్యత సాధించి భారత ఉపఖండమంతటినీ ఐక్యంగా ఉంచవచ్చునని కాంగ్రెస్ పెద్దల ముందుంచారు. నాడు ఆజాద్ ప్రతిపాదనను స్వీకరించినట్లయితే పాకిస్తాన్ ఏర్పడేది కాదు.

స్వాతంత్ర్యానంతరం భారతదేశ మొదటి విద్యాశాఖా మంత్రిగా ప్రాథమిక విద్య ప్రతి బాలునికీ, బాలికకూ అందాలని ఆకాంక్షించారు. ఢిల్లీలో 'జామియా మిలియా ఇస్లామియా' విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక భారతీయ విద్యా సంస్థలు ఆజాద్ ఆలోచనల్లో రూపుదిద్దుకున్నవే.

'ఇండియా విన్స్ ఫ్రీడమ్' అనే రచన అనేక చారిత్రక సందర్భాలనూ, ఆయన జీవితంలోని ఎత్తుపల్లాలనూ తెలియజేసింది. ప్రతి రాజకీయ కార్యకర్త, చరిత్ర పరిశోధకులు చదవవలసిన పుస్తకం. మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి దేశ భక్తుని, త్యాగధనుని గురించి స్మరించుకోవటం నేడు దేశానికి ఎంతో అవసరం.

వ్యాసకర్త మాజీమంత్రి
(నేడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి)

మూడు అవతారాలతో ముడిపడినది

దీపావళి రాత్రి అన్ని అమావాస్య రాత్రుల లాంటిది కాదు. కరుణశ్రీ చెప్పినట్లు, ఇంటా బయటా వెలిగే దీపాల కాంతులతో, తళుకులొలికే తన నక్షత్రాలన్నిటినీ తీసుకొచ్చి ఆకాశమే నేలమీద దిగినట్టు తోచే రాత్రి అది. 'రావణు పరిమార్చి రాముడర్ధాంగితో/అనుజన్ము భరతు కాంచినది నేడె'. ఇదీ కరుణశ్రీ మాటే. ఆశ్వయుజ అమావాస్య నాడు రాముడు అయోధ్యకు తిరిగివచ్చిన నాటినుంచి, ఆ సుదినం పర్వదినమైపోయింది. అంతకు పద్నాలుగేళ్లకు ముందు అరణ్యాలకు వెళ్ళిన లోకాభిరాముడు ఎన్నో ఘనకార్యాలు పూర్తిచేసి, విజయిగా తిరిగి వచ్చినప్పుడు, ఆనందోత్సాహాలతో అయోధ్యలో అంగనలు ఇంటింటా ఆయనకు ఎత్తిన నీరాజనాలే దీపావళులై, దీపావళి పండగ సంప్రదాయానికి ఆరంభంగా నిలిచాయని ఒక ఊహ. ఇది రామావతారం నాటి కథ.

జ్యోతిర్మయం

అంతకు క్రితం, కృత యుగంలో, 'బలి చక్రవర్తిని బంధించి పాతాళ/మునకు వామనుడు పంపినది నేడె!' అది వామనావతార సందర్భం.

'క్రూరుడౌ నరకాసురుని సత్యభామ కృ/ష్ణుని వెంట చని వధించినది నేడె'. నరకాసురుడు తను వధించబడిన రోజున, (నరక చతుర్దశి నాడు) లోకంలో ప్రజలందరూ అభ్యంగన స్నానాలు చేసి, నూతన వస్త్రాలు ధరించేటట్టు వరమడిగి పొందాడని ఒక ఐతిహ్యం. నరకాసుర వధ కథను పోతన గారు నవరస భరితమైన ఉపాఖ్యానంగా చెప్పి, అష్ట పత్నీ వల్లభుడి ఇష్టసఖి సత్యభామకు సాహిత్య ప్రపంచంలో కూడా ఒక ప్రత్యేక విశిష్టతను సంతరించి పెట్టారు. నరకాసుర సంహారం కృష్ణావతారంలో జరిగిన ఘనకార్యం.

ఇలా నారాయణుడి దశావతారాలలో మూడు ముఖ్యమైన అవతారాలతో ముడిపడి ఉన్న దీపోత్సవ అమావాస్య ఈ దేశవాసుల జీవితాలలో ఈనాటికీ హర్షోల్లాసాలను నింపుతూనే ఉన్నది. ఏ శుభకార్యానికైనా అనువైన పెట్టని శుభముహూర్తాలుగా భావించబడే పర్వ దినాలలో ఒకటిగా నిలిచి ఉంది. ముఖ్యంగా లక్ష్మీదేవి పూజ జరిపి ఆమె అనుగ్రహం పొందడానికి ఇది లక్షణమైన సుముహూర్తం.

పదార్థాల తత్వాన్ని వివరంగా చూపగల జ్ఞాన దీపమైన వర్ధమాన మహావీరుల తర్వాత, పదార్థ తత్వం తెలియడానికి భౌతిక దీపాలను ఆశ్రయించాల్సి వస్తుందని సూచించేందుకు, ఆయన నిర్వాణ తిథి అయిన ఆశ్వయుజ అమావాస్య నాడు దీపావళులు వెలిగించే సంప్రదాయం జైన సోదరులు పాటిస్తారు.

ఇప్పుడు మన ముంగిట ఉన్న ఈ సంవత్సరపు దీపావళి పర్వదినం అందరి జీవితాలనూ అన్ని విధాలా ప్రకాశవంతం చేసి, సకల జనులకూ సన్మార్గ దర్శనం చేసి, తన పేరును సార్థకం చేసుకోవాలని ఆశంస!

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

త్రిపుర గవర్నర్ ఓఎస్డీగా నర్సింహులు



నర్సింహులుకు నియామక పత్రం ఇస్తున్న గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

హుడా కాంప్లెక్స్: త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ఓఎస్డీగా జి.నర్సింహులు నియమితులయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లికి చెందిన చంద్రయ్య, సత్తమ్మ కుమారుడైన నర్సింహులు సరూర్‌నగర్ డివిజన్ కృష్ణానగర్‌లో నివాసముంటున్నారు. పాతికేళ్లుగా ఇంద్రసేనారెడ్డి సహాయకుడిగా కొనసాగుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, శాసనసభ్యుడిగా ఇంద్రసేనారెడ్డి పలు హోదాల్లో ఉన్నప్పుడు నర్సింహులు సహాయకుడిగా పనిచేశారు. ప్రస్తుతం గవర్నర్‌కు ఓఎస్డీగా నియామకం కావడంపై గ్రామస్తులు, స్నేహితులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

నేడు బీఆర్‌ఎస్ గిరిజన ఆత్మీయ సమ్మేళనం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచారంలో భాగంగా భారత్ రాష్ట్ర సమితి శనివారం 'స్థానిక సంస్థల గిరిజన ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం'నిర్వహించనుంది. మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని ఎస్‌ఎస్‌ఆర్ పుష్ప కన్వెన్షన్ హాల్‌లో జరిగే ఈ ఆత్మీయ సమ్మేళనానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతో పాటు మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్ పాల్గొంటారు. గిరిజన సామాజిక వర్గానికి చెందిన జిల్లా పరిషత్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, సర్పంచులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పీఏసీఎస్ చైర్మన్లకు పార్టీ ఆహ్వానం పంపింది. గిరిజన కార్పొరేషన్ చైర్మన్ వాల్యా నాయక్ దీనిని సమన్వయం చేస్తున్నారు.

దాస్యం వినయ్ భాస్కర్‌కు ఊరట

సాక్షి, హైదరాబాద్: వరంగల్ వెస్ట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. తెలంగాణ ఉద్యమం నాటి కేసులో వినయ్ భాస్కర్‌కు నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు ఒక నెల జైలు శిక్ష విధిస్తూ 2021లో తీర్పునిచ్చింది. తెలంగాణ ఉద్యమ సమయంలో రైల్‌రోకోలో పాల్గొన్న కేసులో వినయ్ భాస్కర్‌పై అభియోగాలు రుజువుకావడంతో ఆయనకు శిక్ష పడింది. వినయ్ భాస్కర్‌తో పాటు 18 మందికి జైలు శిక్షతో పాటు రూ.3 వేల జరిమానా విధించింది. ఈ తీర్పును వినయ్ భాస్కర్ హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కిందికోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఒకరికి దూరం.. మరొకరికి వారం

మంచిర్యాల అగ్రికల్చర్: నిమిషం ఆలస్యంతో ఓ అభ్యర్థి నామినేషన్ వేసే అవకాశానికి దూరమయ్యాడు. మరో వ్యక్తి నామినేషన్ వేయడానికి వారం పాటు ప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. ఆసక్తికరమైన ఈ వివరాలు..
మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ నీలకంఠేశ్వర్, మరో అభ్యర్థి కోరుకంట రవీందర్ నామినేషన్ వేసేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్దకు రాగా నిమిషం ఆలస్యమైందని పోలీసులు వారిని గేటు వద్దే అడ్డుకున్నారు. దీంతో వారు నామినేషన్ వేయకుండానే వెనుదిరిగారు.

వారం రోజులు తిరిగి చివరికి నామినేషన్..
మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలానికి చెందిన మొగిళి కృష్ణ వారం రోజులు రిటర్నింగ్ కార్యాలయం చుట్టూ తిరిగి చివరికి శుక్రవారం నామినేషన్ వేశారు. వారం రోజులుగా నామినేషన్ వేసేందుకు వస్తుండగా అతడి మానసిక పరిస్థితిపై అనుమానం కలిగి పోలీసులు అడ్డుకున్నారు. చివరికి అన్ని ధ్రువీకరణ పత్రాలు, డిపాజిట్ డబ్బులు ఉన్నాయని వారికి చూపించడంతో రిటర్నింగ్ అధికారి వద్దకు అనుమతించారు. దీంతో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

'చిల్లర' రాజకీయం



నామినేషన్ వేసేందుకు వెళ్తున్న దేవరాజు

రాజకీయాలు చిల్లరగా మారాయంటూ చిల్లర నాణేలతో కరీంనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఓ యువకుడు నామినేషన్ వేసి వినూత్నంగా నిరసన తెలిపాడు. కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామానికి చెందిన పల్లెల దేవరాజు శుక్రవారం రూ.10వేల విలువైన రూ.10 నాణేలతో వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశాడు. చలామణిలో ఉన్న రూ.పది నాణేలను ప్రజలు ఎవరూ తీసుకోవడంలేదని, అది చలామణిలో ఉందని తెలపడం కోసం కూడా రూ.10 నాణేలు తెచ్చానని వెల్లడించారు. పది రూపాయల నాణేలతో నామినేషన్ వేసే సమయంలో అధికారులు వాటిని లెక్కించి తీసుకున్నారు. – కరీంనగర్

నత్తనడకన ఉపకార దరఖాస్తులు

- రెండు నెలలవుతున్నా పావువంతు పూర్తికాని రిజిస్ట్రేషన్లు
- సంక్షేమ శాఖల అంచనా 12.65 లక్షలు.. నమోదైంది 2.5 లక్షలు మాత్రమే
- వచ్చే నెలాఖరుతో ముగియనున్న దరఖాస్తు గడువు
- పొడిగింపు లేదంటున్న అధికారులు
- కాలేజీలు చొరవ తీసుకోకుంటే నిర్దేశించిన గడువులోగా లక్ష్యం చేరడం కష్టమే



సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ విద్యార్థులకు అమలు చేస్తున్న ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియకు స్పందన కరువైంది. ఈ పథకాల కింద దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించి రెండు నెలలు దాటినా ఇప్పటివరకు కనీసం పావువంతు మంది విద్యార్థులు కూడా ఈపాస్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోలేదని తెలుస్తోంది. కోర్సు పూర్తయ్యే వరకు విద్యార్థులు ఏటా క్రమం తప్పకుండా ఈ దరఖాస్తులు సమర్పించడం తప్పనిసరి.. కాలేజీ యాజమాన్యం సైతం చొరవ తీసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు ప్రక్రియను పూర్తి చేయించాలి. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 12.65 లక్షల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకుంటారని సంక్షేమ శాఖలు అంచనా వేశాయి. కానీ ఇప్పటివరకు 2.5 లక్షల మంది విద్యార్థులు మాత్రమే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అధికారిక అంచనాతో పోలిస్తే 20 శాతం మాత్రమే దరఖాస్తులు సమర్పించడం గమనార్హం.

వచ్చే నెలాఖరుతో ముగియనున్న గడువు..: ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ గడువు డిసెంబర్ నెలాఖరుతో ముగియనుంది. దరఖాస్తు ప్రారంభ సమయంలోనే నాలుగు నెలల పాటు గడువు ఇవ్వనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం.. గడువు పెంపు ఉండదని స్పష్టం చేసింది. ఈమేరకు కాలేజీ యాజమాన్యాలకు సర్క్యులర్లు సైతం జారీ చేసింది. విద్యార్థులు ఈపాస్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చొరవ తీసుకోవాలని కాలేజీ యాజమాన్యాలకు సూచించింది. కానీ క్షేత్రస్థాయిలో కాలేజీ యాజమాన్యాలు కనీసం పట్టించుకోవడం లేదు. ఒక విద్యార్థి కోర్సు ముగిసే వరకు ప్రతి సంవత్సరం ఈపాస్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కొత్తగా కోర్సులో చేరే విద్యార్థి ఈపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తుకు సంబంధించిన వివరాలను సమర్పించాలి. ఇప్పటికే కోర్సులో చేరి తదుపరి సంవత్సరం చదివే విద్యార్థి రెన్యువల్ కేటగిరీలో దరఖాస్తు సమర్పించాలి. విద్యార్థి వివరాలు కాలేజీ యాజమాన్యం వద్ద అందుబాటులో ఉండడంతో యాజమాన్యమే ప్రత్యేకంగా ఒక ఉద్యోగిని నియమించి దరఖాస్తు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయవచ్చు. కానీ యాజమాన్యాలు అలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో దరఖాస్తు ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. గతేడాది దరఖాస్తు ప్రక్రియను దాదాపు ఏడు నెలల పాటు కొనసాగించారు. గడువు ముగిసినప్పటికీ పూర్తిస్థాయిలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల కోరిక మేరకు ప్రభుత్వం గత ఏడాది మూడు సార్లు గడువును పొడిగించింది. కానీ ఈ ఏడాది పొడిగింపు ప్రక్రియ ఉండదని, నిర్దేశించిన సమయానికి దరఖాస్తు సమర్పించాలని సూచించినప్పటికీ స్పందన అంతంతమాత్రంగానే ఉంది. మరో నెలన్నరలో దరఖాస్తు గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో దరఖాస్తు ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలంటూ తాజాగా జిల్లాస్థాయిలో సంక్షేమ శాఖల అధికారులు కాలేజీ యాజమాన్యాలకు నోటీసులు ఇస్తున్నారు.

కన్నీళ్లు.. కన్నెర్ర | టికెట్ రాక.. నిరసనల కాక

- సంగారెడ్డిలో బీజేపీ ఆఫీసుపై దాడి.. ఫర్నిచర్ ధ్వంసం
- సూర్యాపేటలో హైవేపై రమేశ్‌రెడ్డి నిరసన

నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన శుక్రవారం ప్రధాన పార్టీల అభ్యర్థుల మార్పుచేర్పులు ఆయా పార్టీల్లో కలకలం రేపాయి. నామినేషన్ వేయడానికి అంతా సిద్ధం చేసుకున్న తర్వాత చివరి నిమిషంలో తమ పేరు లేదని తెలిసి ఆశావహులు బోరున విలపించారు. వివిధ రూపాల్లో నిరసనలకు దిగారు. శనివారం చోటుచేసుకున్న ఆయా ఘటనల వివరాలిలా..

రేవంత్ అన్యాయం చేశారంటూ రమేశ్‌రెడ్డి ఉద్వేగం



సూర్యాపేట: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా పేరుపడిన పటేల్ రమేశ్‌రెడ్డి సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు చివరిదాకా ప్రయత్నించి విఫలమయ్యారు. గురువారం అర్ధరాత్రి ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ జాబితాలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో రమేష్‌రెడ్డి ఉద్వేగానికి గురై విలపించారు. రేవంత్‌రెడ్డి తనకు అన్యాయం చేశారని, ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి జగదీష్‌రెడ్డిని గెలిపించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దరిమిలా రమేష్‌రెడ్డి అనుచరులు జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. శుక్రవారం నామినేషన్ల చివరిరోజు కావడంతో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు నామినేషన్ వేశారు.

కన్నీళ్లతో తుల ఉమ



వేములవాడ: వేములవాడ బీజేపీ అభ్యర్థిగా తన పేరును ఖరారు చేసిన తర్వాత అధిష్టానం, చివరి నిమిషంలో తనకు బీ–ఫామ్ ఇవ్వకుండా ఆవేదనకు గురి చేసిందంటూ కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ కన్నీటిపర్యంతమయ్యారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలసి ర్యాలీగా తరలివచ్చి స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

కిషన్‌రెడ్డికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటానన్న దేశ్‌పాండే



సంగారెడ్డి: పదేళ్లపాటు జెండా మోసి పార్టీని కాపాడిన తన టికెట్ ఇవ్వకుండా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి నమ్మించి గొంతు కోశారని ఆ పార్టీ సంగారెడ్డి ఇన్‌చార్జి రాజేశ్వర దేశ్‌పాండే మండిపడ్డారు. పులిమామిడి రాజుకు బీఫారం ఇవ్వడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కసారిగా భావోద్వేగానికి గురై.. రిటర్నింగ్ ఆఫీసు వద్ద రోడ్డుపై కిషన్‌రెడ్డికి ఫోన్ చేసి బోరున విలపించారు. నీ పేరు చెప్పి ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. పక్కనే ఉన్న కార్యకర్తలు ఆయనను ఓదార్చారు. అదే బాధతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. దేశ్‌పాండే భావోద్వేగానికి గురై కంటతడి పెట్టడంతో ఆగ్రహించిన ఆయన అభిమానులు కార్యకర్తలు పార్టీ కార్యాలయంపై దాడి చేశారు ఫ్లెక్సీలు బ్యానర్లను చించివేశారు. కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కాగా నామినేషన్ అనంతరం పులిమామిడి వాహనం రిటర్నింగ్ అధికారి కార్యాలయం ముందు నుంచి వెళ్తుండటంతో దేశ్‌పాండే అభిమానులు ఆయన కారుపై రాళ్లు విసిరారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది.

బీ ఫాం మార్పుపై వివేక్ కుట్ర: కొయ్యల ఏమాజీ ఆరోపణ



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తన అన్న గడ్డం వినోద్ గెలుపు కోసం తనకు బెల్లంపల్లి టికెట్ ఇవ్వకుండా మాజీ ఎంపీ వివేక్ కుట్ర పన్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున బెల్లంపల్లిలో వినోద్ పోటీలో ఉన్నారనే ఆయనను గెలిపించేందుకు తనకన్నా బలహీన అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవికి టికెట్ ఇచ్చారని విమర్శించారు.

బీఎస్పీ అభ్యర్థిగా నీలం మధు

- పటాన్‌చెరు స్థానం నుంచే బరిలోకి
- చివరి నిమిషంలో కాంగ్రెస్ ఆయన అభ్యర్థిత్వం మార్చడంతో బీఎస్పీలో చేరిక



సాక్షి, హైదరాబాద్: బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థులు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం పార్టీ 21 అసెంబ్లీ స్థానాలతో తుది జాబితాను ప్రకటించింది. రాష్ట్రంలో బీఎస్పీ తొలిసారి మొత్తం 119 నియోజకవర్గాల్లో పోటీ చేస్తోంది. కాగా, నాటకీయ పరిణామాల మధ్య పటాన్‌చెరు స్థానం నుంచి నీలం మధు బీఎస్పీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా ఆయన పేరును మొదట ప్రకటించినప్పటికీ, తర్వాత ఆయన అభ్యర్థిత్వాన్ని చివరి నిమిషంలో మార్చడంతో మధు బీఎస్పీలో చేరారు.

అవినీతి, కుటుంబ పాలనకు చరమగీతం: ప్రవీణ్‌కుమార్: తెలంగాణలో అవినీతి, కుటుంబ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహుజనుల రాజ్యాధికార కల సాకారం అయ్యే రోజు దగ్గర్లోనే ఉందని, బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను జనం నమ్మడం లేదని అన్నారు.

తుది జాబితాలో సీట్లు దక్కింది వీరికే

నిర్మల్	డి.జగన్‌మోహన్
బోధన్	ఎ.అమర్‌నాథ్‌బాబు
బాన్సువాడ	నీరడి ఈశ్వర
ఎల్లారెడ్డి	జమున రాథోడ్
సిద్దిపేట	డి. చక్రధర్ గౌడ్
గజ్వేల్	జక్కని సంజయ్
మల్కాజిగిరి	రత్నాకర్ పాండు
ముషీరాబాద్	పోచగిరి నరేందర్
జూబ్లీహిల్స్	కోనేటి సుజాత రాములు
సనత్‌నగర్	ఎండీ సలీం
యాకుత్‌పుర	బంగారి మాణిక్యం
బహదూర్‌పుర	కె. ప్రసన్న కుమారి యాదవ్
సికింద్రాబాద్	రుద్రవరం సునీల్
నాగార్జునసాగర్	రమణ ముదిరాజ్
మిర్యాలగూడ	డా.జాడి రాజు
భువనగిరి	ఉప్పల జహంగీర్
తుంగతుర్తి	బొడ్డు కిరణ్
ఆలేరు	దప్పు వీరస్వామి
జనగాం	తూడి విజయ్ కుమార్
ఇల్లందు	బి.ప్రతాప్ నాయక్
పటాన్‌చెరు	నీలం మధు

ముగిసిన నామినేషన్ల పర్వం

▶ మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గాలవారీగా శుక్రవారంనాటికి నామినేషన్లు వేసిన అభ్యర్థుల జాబితాను శనివారం అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ నెల 3 నుంచి 8 వరకు మొత్తం 1,188 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, 9న 1133 మంది, 10న 2,151మంది నామినేషన్లు వేశారు. దీపావళి పండుగ తర్వాత 13న నామినేషన్ల పరిశీలన నిర్వహించనున్నారు. 15తో ఉపసంహరణకు గడువు ముగియనుంది. ఆదేరోజు అన్ని నియోజకవర్గాల్లో పోటీలో ఉండే అభ్యర్థులెవరో తేలిపోతుంది. నవంబర్ 30న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటాయి.

స్వతంత్ర అభ్యర్థిగా నవ్య నామినేషన్



స్టేషన్‌ఘన్‌పూర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం జానకిపురం గ్రామ సర్పంచ్ కుర్సపల్లి నవ్య స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి శుక్రవారం స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ...తాను ఏ రాజకీయ పార్టీకి, ఏ నాయకుడికి వ్యతిరేకం కాదని, మహిళలు రాజకీయంగా చైతన్యం కావాలనే తను పోటీ చేస్తున్నట్లు తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యపై నవ్య పలు ఆరోపణలు చేసి వార్తల్లోకెక్కిన విషయం తెలిసిందే.

కన్నకూతురిని కత్తులతో నరికి..

- గర్భిణి అని కూడా చూడకుండా ఓ నాన్న ఘాతుకం..
- సహకరించిన సోదరులు
- ఆస్తి కోసం దారుణం
- కత్తులు, గొడ్డలితో కూతురు, అల్లుడిపై దాడి
- పారిపోతున్న కూతురిని వెంబడించి మరీ..
- అక్కడికక్కడే కుమార్తె మృతి, అల్లుడి పరిస్థితి విషమం
- ఖమ్మం జిల్లా తాటిపూడి గ్రామంలో ఘటన



ఉషశ్రీ

వైరా రూరల్: ఆస్తి కోసం కనీస విచక్షణ, మానవత్వం..చివరికి కన్నప్రేమను కూడా మరిచి మృగంలా మారిన ఓ తండ్రి కన్నకూతురును.. పైగా ఐదు నెలల గర్భవతి అని కూడా చూడకుండా వేటకొడవళ్లు, గొడ్డలితో దాడి చేసి చంపేశాడు. ఈ ఘటనలో కుమార్తె అక్కడికక్కడే మృతిచెందగా అల్లుడు చావుబతుకుల మధ్య చికిత్స పొందుతున్నాడు. ఖమ్మం జిల్లా వైరా మండలం తాటిపూడి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ దారుణ ఘటన వివరాలిలా ఉన్నాయి.

తాటిపూడి గ్రామానికి చెందిన పిట్టల రాములు, మంగమ్మ దంపతులకు ముగ్గురు కుమారులతోపాటు కుమార్తె ఉషశ్రీ(35) ఉన్నారు. వీరిలో ఇద్దరు కుమారులు నరేశ్, వెంకటేష్ స్థానికంగానే ఉంటుండగా, మరొకరు దూరంగా నివసిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన రాములు మామ (మంగమ్మ తండ్రి) మన్నెం వెంకయ్య చిన్నతనం నుంచే ఉషశ్రీని పెంచి పెద్దచేసి పదేళ్ల కిందట కొణిజర్ల మండలం గోపారానికి చెందిన పర్సబోయిన రామకృష్ణకు ఇచ్చి వివాహం జరిపించారు. ఈ సమయంలో వెంకయ్య తన రెండు ఎకరాల వ్యవసాయ భూమి, 10కుంటల ఇంటి స్థలాన్ని ఉషశ్రీ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో రామకృష్ణ ఇల్లరికంపై తాటిపూడికి రాగా, అక్కడే భార్యాభర్తలు టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పదేళ్ల క్రితం పెళ్లి కాగా, ఇన్నేళ్లకు ఉషశ్రీ గర్భం దాల్చింది. కాగా, తన మామ వెంకయ్య ఆస్తిని ఉషశ్రీకి రాయడాన్ని జీర్ణించుకోలేని ఆమె తండ్రి రాములు, సోదరులు నరేష్, వెంకటేష్ తరచూ ఘర్షణ పడేవారు. ఈ విషయమై కేసు కూడా కోర్టులో పెండింగ్‌లో ఉంది.

కూతురినీ నరికేశాడు..
శుక్రవారం ఉదయం ఉషశ్రీకి చెందిన ఇంటి స్థలంలో ఉన్న సుబాబుల్ చెట్లను నరికేందుకు పిట్టల రాములు, ఆయన కుమారులు నరేష్, వెంకటేశ్ వేటకొడవళ్లు, గొడ్డలి, గడ్డపలుగులతో వచ్చారు. ఇది చూసి రామకృష్ణ, ఉషశ్రీ అడ్డుకున్నారు. దీంతో వారు గడ్డపలుగు, వేటకొడవళ్లతో వెంటపడ్డారు. ఈ క్రమంలో రామకృష్ణపై దాడి చేస్తుండగా, ఉషశ్రీ తప్పించుకునే ప్రయత్నంలో ఇంకొకరి ఇంట్లోకి వెళ్లడంతో వెంబడించి మరీ నరికారు. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రగాయాలపాలైన రామకృష్ణను స్థానికులు 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మరక్షణ కోసం ఉషశ్రీ, రామకృష్ణ ప్రతిదాడి చేయడంతో రాములు, వెంకటేశ్, నరేశ్‌కు కూడా గాయాలవడంతో ఆస్పత్రిలో చేరారు. వైరా ఏసీపీ ఎం.ఎ రెహమాన్, సీఐ సునావత్ సాగర్, ఎస్సై మేడా ప్రసాద్ ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.



రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జీవీ మణిమారన్.. హైదరాబాద్ వచ్చిన సందర్భంగా సాక్షి కార్యాలయంలో సాక్షి డైరెక్టర్ ఏఎల్ఎన్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

యాదాద్రి కలెక్టరేట్‌లో దంపతుల ఘర్షణ

- భర్తపై కత్తితో దాడి చేసిన భార్య
- భర్తకు తీవ్రగాయాలు...ఆస్పత్రికి తరలింపు



గాయపడిన మనోజ్‌గౌడ్

భువనగిరి క్రైం: కొద్దికాలంగా తనతో సఖ్యతగా ఉండటంలేదన్న కోపంతో భర్తపై కత్తితో దాడి చేసింది ఓ భార్య. శుక్రవారం యాదాద్రి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కలెక్టరేట్‌లో ఆత్మకూర్(ఎం) మండల వ్యవసాయశాఖ అధికారిణిగా పనిచేస్తున్న నక్ర శిల్ప, అదే కార్యాలయంలో తన కిందిస్థాయి ఉద్యోగిగా పనిచేస్తున్న మాటూరి మనోజ్‌గౌడ్‌ను గతేడాది జూన్ 7న ప్రేమ వివాహం చేసుకున్నారు. కాగా 3నెలల క్రితం మనోజ్‌గౌడ్ యాదగిరిగుట్టకు డిప్యూటేషన్‌పై వెళ్లి అనంతరం సెలవుపై వెళ్లాడు. శుక్రవారంతో సెలవులు పూర్తికావడంతో విధులకు హాజరుకావడానికి రిపోర్ట్ చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చాడు. అదేసమయంలో భర్తతో మాట్లాడేందుకు శిల్ప దగ్గరకు వెళ్లింది. గొడవల నేపథ్యంలో వారిద్దరిమధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో శిల్ప కత్తి తీసుకుని మనోజ్‌పై దాడి చేయగా..అతడి వీపు, మెడపై తీవ్రగాయాలయ్యాయి. సహోద్యోగులు వెంటనే వారిని అడ్డుకుని మనోజ్‌ను చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి, అక్కడ్నుంచి హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై శిల్పను వివరణ కోరగా..మనోజ్ కొంతకాలంగా తనతో సఖ్యతగా ఉండటం లేదని ఇదే విషయం మాట్లాడేందుకు రాగా తనపై కత్తితో దాడి దిగాడని చెప్పారు. దీంతో ఆత్మరక్షణార్థం అతడి వద్ద ఉన్న కత్తిని లాక్కుని దాడి చేసినట్లు చెప్పారు. శిల్ప, మనోజ్ తండ్రి ఉపేందర్ వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఘటనపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని భువనగిరి కలెక్టర్ హనుమంతు కె.జడంగే చెప్పారు.

క్లుప్తంగా...

అమెరికా ఎంక్యూ-9 డ్రోన్ పేల్చివేత

సనా: ఇప్పటికే ఇజ్రాయెల్-హమాస్ మధ్య ఘర్షణలతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మరోవైపు యెమెన్‌కు చెందిన హౌతీ మిలిటెంట్లు అమెరికా సైన్యంపై దాడులు చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. అమెరికాకు చెందిన ఎంక్యూ-9 డ్రోన్‌ను హౌతీ మిలిటెంట్లు పేల్చివేశారు. యెమెన్ ప్రాదేశిక జలాల్లో బుధవారం ఈ సంఘటన జరిగిందని అమెరికా సైన్యం వెల్లడించింది. హౌతీ దుశ్చర్య నేపథ్యంలో పశ్చిమాసియాలో అమెరికా సేనలు అప్రమత్తమయ్యాయి. హౌతీకి ఇరాన్ ప్రభుత్వం అండగా ఉండడం గమనార్హం.

తమిళనాడు పిటిషన్‌పై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీస్

న్యూఢిల్లీ: రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లుల ఆమోదంలో గవర్నర్ తాత్సారం చేస్తున్నారంటూ తమిళనాడు ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు స్పందన కోరింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జే/బీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఈ మేరకు నోటీసు జారీ చేసింది. రాజ్యాంగ బద్ధమైన ఒక అధికారం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వ విధులను అడ్డుకుంటోందని తమిళనాడు ప్రభుత్వం పిటిషన్‌లో ఆరోపించింది. జోక్యం చేసుకోవాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన 12 బిల్లులు గవర్నర్ ఆర్ఎన్ రవి వద్ద పెండింగ్‌లో ఉన్నాయని విచారణ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణ ఈ నెల 20న చేపడతామని తెలిపింది.

లష్కరే మాజీ కమాండర్ అక్రమ్ ఖాన్ హతం

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లోని బజౌర్‌లో లష్కరే తోయిబా మాజీ కమాండర్ అక్రమ్ ఖాన్ అలియాస్ అక్రమ్ గాజీ హతమయ్యాడు. గుర్తు తెలియని దుండగులు గురువారం అతడిని కాల్చిచంపారు. 2018-20 సంవత్సరాల మధ్య లష్కరే తోయిబా రిక్రూట్‌మెంట్ విభాగాన్ని నడిపేవాడు. పలు ఉగ్రవాద చర్యల వెనుక ఇతడి ప్రమేయం ఉంది.

కేజ్రీవాల్‌కు ఏదో జరగబోతోంది

ఆప్ నేత సంజయ్ సింగ్ ఆందోళన

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఇరుకున పెట్టేందుకు పెద్ద కుట్ర జరగబోతోందని ఆప్ నేత సంజయ్ సింగ్ అనుమానం వ్యక్తం చేశారు. మనీ ల్యాండరింగ్ కేసులో శుక్రవారం రౌస్ అవెన్యూ కోర్టుకు హాజరైన అనంతరం కోర్టు వెలుపల మీడియాతో మాట్లాడారు. 'కేజ్రీవాల్‌ను ఇరికించేందుకు కుట్ర జరుగుతోంది. ఆయన్ను అరెస్ట్ చేయడం మాత్రమే కాదు. అంతకంటే మించి ఏదో చేయడమే ఆ కుట్ర' అని అన్నారు. మద్యం విధానం కేసులో మనీ ల్యాండరింగ్ ఆరోపణలపై విచారణకు రావాలంటూ ఈడీ పంపిన సమన్లకు కేజ్రీవాల్ స్పందించని విషయం తెలిసిందే. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న సంజయ్ జ్యుడీషియల్ కస్టడీని కోర్టు ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించింది.

కర్ణాటక బీజేపీ చీఫ్‌గా విజయేంద్ర యడియూరప్ప

న్యూఢిల్లీ: బీజేపీ కర్ణాటక అధ్యక్షుడిగా రాష్ట్ర మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప కుమారుడు విజయేంద్ర యడియూరప్ప(47) నియమితులయ్యారు. బీజేపీ అధిష్టానం అనూహ్యంగా తీసుకున్న నిర్ణయం సీనియర్ నేత యడియూరప్ప పలుకుబడిని అంగీకరించినట్లేనని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ ఏడాది మేలో కర్ణాటక అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో విజయేంద్ర ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న నళిన్ కుమార్ కటీల్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు.

నితీశ్ కుర్చీపై కన్నేసి, విషాహారం పెడుతున్నారు

పట్నా: బిహార్ సీఎం నితీశ్ కుమార్ తీసుకునే ఆహారంలో విష పదార్థాలను కలుపుతున్నారని హెచ్ఏఎం చీఫ్, మాజీ సీఎం జితేన్ రామ్ మాంఝీ అనుమానం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ వెలుపల మీడియాతో మాట్లాడారు. 'సీఎం నితీశ్ ఇటీవల అసెంబ్లీలో అసభ్య పదజాలం వాడి ఉభయసభలకు క్షమాపణ చెప్పుకున్నారు. నిన్న మరోసారి నియంత్రణ కోల్పోయి నన్ను అవమానిస్తూ మాట్లాడారు. వయస్సులోనూ అనుభవరీత్యా నేను సీనియర్ అన్న విషయం మర్చిపోయారు. ఆయన మానసిక ఆరోగ్యం దెబ్బతింటోందనడానికి ఇదే గుర్తు'అని మాంఝీ చెప్పారు. 'నితీశ్ కుమార్ తీసుకునే ఆహారంలో విష పదార్థాలు కలుపుతున్నారని నా అనుమానం. అందుకే పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు. ఆయన ఆహారంపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరపాలి. సీఎం కుర్చీపై కన్నేసిన చాలా మంది ఆయన చుట్టూ ఉన్నారు'అని మాంఝీ వ్యాఖ్యానించారు.

మహువాపై స్పీకర్‌కు నివేదిక

న్యూఢిల్లీ: టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా డబ్బులు తీసుకుని పార్లమెంట్‌లో ప్రశ్నలడిగిన ఆరోపణలపై విచారణ పూర్తి చేసిన ఎథిక్స్ కమిటీ నివేదికను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించింది. నివేదికను ఎథిక్స్ కమిటీ చైర్మన్ వినోద్ కుమార్ సోంకార్ శుక్రవారం స్పీకర్ కార్యాలయంలో అందజేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీ నుంచి చట్టవిరుద్ధంగా ప్రతిఫలం స్వీకరించినందుకు మొయిత్రాను సభ నుంచి బహిష్కరించాలంటూ కమిటీ సిఫారసు చేసిన విషయం తెలిసిందే.

బలమైన రక్షణ బంధం

భారత్, అమెరికా నిర్ణయం

ఫలప్రదంగా విదేశాంగ, రక్షణ మంత్రుల చర్చలు

- ముంబై, పఠాన్‌కోట్ ముష్కరులకు శిక్ష పడాల్సిందే
- ఉమ్మడి ప్రకటనలో ఇరు దేశాల స్పష్టీకరణ
- చైనా దూకుడును సంయుక్తంగా అడ్డుకుంటాం: రాజ్‌నాథ్



శుక్రవారం ఢిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమైన అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్

న్యూఢిల్లీ: భారత్, అమెరికా మధ్య అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఇరుదేశాల రక్షణ, విదేశాంగ మంత్రులు శుక్రవారం ఢిల్లీలో విస్తృత స్థాయిలో చర్చలు జరిపారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్, విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ వీటిలో పాలుపంచుకున్నారు. రక్షణ ఉత్పత్తుల తయారీ, అరుదైన ఖనిజాల అన్వేషణ, అత్యున్నత సాంకేతికత వంటి రంగాల్లో కలిసి పని చేయాలని నిర్ణయించారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం, పశ్చిమాసియాలో పరిణామాలు, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా సైనిక దూకుడుకు అడ్డుకట్ట వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, తాజా పరిణామాలపై మంత్రులు చర్చించుకున్నారు. అనంతరం చర్చల వివరాలను వెల్లడిస్తూ మంత్రులు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ముంబైలో 26/11 ఉగ్ర దాడులకు, పఠాన్‌కోట్ దాడులకు పాల్పడ్డ ముష్కరులకు శిక్ష పడి తీరాల్సిందేనని ప్రకటన స్పష్టం చేసింది. ఈ మేరకు పాకిస్థాన్‌కు మంత్రుల భేటీ స్పష్టమైన హెచ్చరికలు చేసిందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపడంతో పాటు ఐసిస్ సహా ఉగ్ర సంస్థలన్నింటినీ నిర్మూలించేందుకు అన్ని దేశాలూ కలసికట్టుగా ప్రయత్నించాలని పిలుపునిచ్చినట్టు వివరించింది.

ఫలప్రదం: జై శంకర్

అమెరికా మంత్రులతో చర్చ లు ఫలప్రదంగా సాగాయని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సంతృప్తి వ్యక్తం చేశారు. రక్షణ సంబంధాలను మెరుగుపర్చుకోవడం, అంతరిక్ష పరిశోధనలు, సాంకేతికత రంగాల్లో పరస్పరం సహకరించుకోవడంతోపాటు రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాలపై చర్చించుకున్నామని తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. అంతకముందు చర్చల ప్రారంభ కార్యక్రమంలో ఎస్.జైశంకర్ మాట్లాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉమ్మడి లక్ష్యాన్ని సాధించడానికి ఈ చర్చలు ఒక అద్భుత అవకాశమని అభివర్ణించారు. భారత్-అమెరికా మరింత సన్నిహితం కావడంతోపాటు ఉమ్మడి నిర్మాణాత్మక గ్లోబల్ అజెండాను రూపొందించుకోవాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ లక్ష్యమని గుర్తుచేశారు. ఇరు దేశాల సంబంధాలు ఇతోధికంగా వృద్ధి చెందుతున్నాయన్నారు. ఇండో-పసిఫిక్‌ను స్వేచ్ఛాయుత, వృద్ధిశీల, భద్రతాయుతమైన ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ప్రాధాన్యమిస్తున్నట్టు బ్లింకెన్ తెలిపారు. అంతేగాక అంతర్జాతీయ శాంతి, భద్రత తదితరాల సాధనకు కూడా ఇరు దేశాలూ కలసికట్టుగా కృషి చేస్తున్నాయన్నారు. భారత్-అమెరికా సంబంధాలకు రక్షణ ఒప్పందాలు మూలస్తంభంగా నిలుస్తున్నాయని రాజ్‌నాథ్ అభిప్రాయపడ్డారు. చైనా దూకుడుకు సంయుక్తంగా అడ్డుకట్ట వేయాలని నిర్ణయించినట్టు చెప్పారు.

సంయుక్తంగా సాయుధ సైనిక వాహనాల తయారీ: ఆస్టిన్

ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న కీలకమైన సాయుధ సైనిక వాహనాల సంయుక్త తయారీ విషయంలో తక్షణం ముందుకు వెళ్లాలని భారత్-అమెరికా నిర్ణయించినట్టు లాయిడ్ ఆస్టిన్ తెలిపారు. ఇరు దేశాల సైనిక దళాల మధ్య సమాచార వ్యవస్థను అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అలాగే ద్వైపాక్షిక రక్షణ పారిశ్రామిక వ్యవస్థల మధ్య సాన్నిహిత్యాన్ని మరింత పెంచేందుకు ఉద్దేశించిన సెక్యూరిటీ ఆఫ్ సప్లై అరేంజ్‌మెంట్ (ఎస్ఓఎస్ఏ) ఒప్పందం ఖరారు తుది దశకు చేరిందని మంత్రి చెప్పారు. జీఈ ఎఫ్-414 జెట్ ఇంజన్లను భారత్‌లో తయారు చేసేలా జనరల్ ఎలక్ట్రిక్ ఏరో స్పేస్, హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు ఊపందుకున్నాయన్నారు. అలాగే భారత్‌కు వీలైనంత త్వరగా అత్యాధునిక ఎంక్యూ-9బి డ్రోన్లను సరఫరా చేయనున్నట్టు వెల్లడించారు. ఇది 300 కోట్ల డాలర్ల ఒప్పందం.

ఆగడాలకు అడ్డుకట్ట పడాల్సిందే: భారత్

కెనడాలో ఖలిస్తానీ శక్తుల ఆగడాలు పెరిగిపోతుండటం ఆందోళనకరమని అమెరికాకు భారత్ స్పష్టం చేసింది. మంత్రుల చర్చల సందర్భంగా ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించినట్టు విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాత్రా మీడియాకు వెల్లడించారు. వాటికి అడ్డుకట్ట పడాల్సిందేనని బ్లింకెన్, లాయిడ్‌లకు రాజ్‌నాథ్ స్పష్టం చేశారన్నారు. ఈ విషయంలో భారత ఆందోళనను అర్థం చేసుకోగలమని వారు చెప్పారన్నారు.

ప్రధానితో మంత్రుల భేటీ

భారత్-అమెరికా ద్వైపాక్షిక బంధం ప్రపంచ శాంతికి, ప్రగతికి అతి పెద్ద చోదక శక్తిగా మారుతోందని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వెలిబుచ్చారు. మంత్రుల స్థాయి భేటీ అనంతరం అమెరికా విదేశాంగ, రక్షణ మంత్రులు బ్లింకెన్, ఆస్టిన్ ఇరువురు శుక్రవారం రాత్రి ఆయనతో సమావేశమయ్యారు. విదేశంగ మంత్రి జై శంకర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కూడా భేటీలో పాల్గొన్నారు. సదస్సు జరిగిన తీరును, తీసుకున్న నిర్ణయాలను వారు మోదీకి వివరించారు. ''ప్రజాస్వామ్యం, బహుళత్వ విలువలపై భారత్, అమెరికాలకున్న ఉమ్మడి విశ్వాసం తిరుగులేనివి. ఇరు దేశాల మధ్య జరిగిన మంత్రుల స్థాయి చర్చలు ఆశించిన ఫలితాలు సాధించినందుకు ఆనందంగా ఉంది'' అంటూ భేటీ అనంతరం మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వా శుక్రవారం మోదీకి ఫోన్ చేశారు. పశ్చిమాసియా ఉద్రిక్తత తదితరాలపై నేతలు ఆందోళన వెలిబుచ్చారు. అక్కడ యుద్ధ మేఘాలు తీవ్ర రూపు దాలుస్తుండటం, ఉగ్రవాదం, మతి లేని హింస భారీ జన నష్టానికి దారి తీస్తుండటం దారుణమన్నారు. బ్రెజిల్ జీ20 సారథ్యం సఫలం కావాలని ఈ సందర్భంగా మోదీ ఆకాంక్షించారు.

ప్రపంచంలోనే తొలిసారిగా కంటిమార్పిడి

న్యూయార్క్: ప్రపంచంలోనే తొలిసారిగా కంటి మార్పిడి శస్త్రచికిత్స అమెరికాలో జరిగింది. న్యూయార్క్‌లోని ఎన్‌వైయూ లాంగాన్ వైద్య సంస్థకు చెందిన వైద్యులు ఈ ఘనత సాధించారు. కరెంట్ షాక్ ప్రమాదంలో ముఖంలో ఎడమ భాగం పూర్తిగా దెబ్బ తిన్న ఆరోన్ జేమ్స్ అనే మాజీ సైనికుడు కంటి మార్పిడి చేయించుకున్న తొలి వ్యక్తిగా రికార్డులకెక్కాడు. ఇందుకోసం వైద్యులు ఏకంగా 21 గంటల పాటు శస్త్రచికిత్స చేశారు. ఇప్పటిదాకా కరోనాను మార్చిన ఉదంతాలున్నాయి గానీ ఇలా పూర్తిగా కంటినే కొత్తగా అమర్చడం మాత్రం ఇదే తొలిసారి. ''మే 21న ఈ ఆపరేషన్ నిర్వహించాం. రోగికి మొత్తం ముఖం ఎడమ భాగమంతటితో పాటు ఎడమ కంటిని కూడా పూర్తిగా కొత్తగా అమర్చాం. మొత్తం ప్రక్రియలో ఏకంగా 140 మంది వైద్య నిపుణుల సేవలు తీసుకున్నాం. అతనికి ఎడమ కంటిలో చూపు రాలేదు. కాకపోతే ఆర్నెల్ల తర్వాత కూడా ఆ కన్ను పూర్తి ఆరోగ్యంతో ఉండటమే ఓ అద్భుతం. రెటీనాకు రక్తప్రసారం బాగా జరుగుతోంది. కంటికి రక్తం తీసుకొచ్చే నాళాల పనితీరు సజావుగా ఉంది. ఇది నిజంగా గొప్ప విషయం. చూపు కూడా ఎంతో కొంత వస్తే ఇంకా అద్భుతంగా ఉండేది'' అని వైద్య బృందం వివరించింది. అయితే, ''ఇది కేవలం కంటిని పూర్తిగా మార్చడం సాధ్యమేనని నిరూపించేందుకు చేసిన సాంకేతిక ఆపరేషన్ మాత్రమే. అయితే దాత తాలూకు మూల కణాలను, బోన్ మారోను దృష్టి నరంలో చొప్పించాం. కనుక చూపు వచ్చే ఆస్కారాన్నీ కొట్టిపారేయలేం'' అని చెప్పింది!

చికున్ గున్యాకు తొలి వ్యాక్సిన్

న్యూఢిల్లీ: చికున్ గున్యాకు తొలిసారిగా వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. ఇక్స్‌చిక్ పేరిట రూపొందిన ఈ వ్యాక్సిన్‌కు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) అనుమతించింది. 18 ఏళ్లు, ఆ పైబడిన వారికి దీన్ని ఇచ్చేందుకు అనుమతిస్తున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొంది. ''చికున్ గున్యా తీవ్ర వ్యాధికి, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. ముఖ్యంగా వృద్ధులకు, అప్పటికే ఆరోగ్య సమస్యలున్న వారికి ప్రాణాంతకంగా కూడా పరిణమిస్తుంది. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన తక్షణావసరాన్ని ఈ వ్యాక్సిన్ తీరుస్తుందని నమ్ముతున్నాం'' అని వివరించింది. ''ఇక్స్‌చిక్ వ్యాక్సిన్‌ను ఇప్పటికే 266 మంది రోగులపై ప్రయోగాత్మకంగా పరీక్షించగా మంచి ఫలితాలొచ్చాయి. ఉత్తర అమెరికాలో 3,500 మందికి వ్యాక్సిన్ ఇవ్వగా చక్కని గుణం కనిపించింది. 1.6 శాతం మందిలో మాత్రం తీవ్రమైన తలనొప్పి తదితర గున్యా తాలూకు లక్షణాలు కనిపించాయి. ఇద్దరిని ఆస్పత్రిలో చేర్చాల్సి వచ్చింది'' అని ఎఫ్‌డీఏ సెంటర్ ఫర్ బయోలాజిక్స్ ఎవాల్యుయేషన్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ పీటర్ మార్క్స్ చెప్పారు. బయోటెక్ కంపెనీ 'వాల్నెవా ఆస్ట్రియా' ఈ వ్యాక్సిన్‌ను తయారు చేసింది.

నిప్పుతో చెలగాటం

పంజాబ్ గవర్నర్ తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం

న్యూఢిల్లీ: పంజాబ్ గవర్నర్‌ను సుప్రీంకోర్టు తీవ్రస్వరంతో మందలించింది. రాష్ట్రానికి నామమాత్రపు అధిపతి అయినందున గవర్నర్ అసెంబ్లీ సమావేశాల చెల్లుబాటుపై సందేహం వ్యక్తం చేయలేడని, సభ ఆమోదించిన బిల్లులను నిరవధికంగా నిలిపివేయలేడని కుండబద్దలు కొట్టింది. మీరు నిప్పుతో చెలగాటమాడుతున్నారని హెచ్చరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు పంపిన బిల్లును ఆయన ఆమోదించడం లేదా నిలిపివేయడం, రాష్ట్రపతి పరిశీలన నిమిత్తం పంపడమో చేయాలని తెలిపింది. ఇంతకుమించి మరో అవకాశం గవర్నర్‌కు లేదని తెలిపింది. అంతేతప్ప, అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను తనవద్దే నిరవధికంగా ఉంచుకోజాలడని స్పష్టం చేసింది. 'మన దేశం కొన్ని సంప్రదాయాలు, ఆచారాల ఆధారంగా నడుస్తోంది. వాటిని మనం అనుసరించాలి'అని విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాల, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం పేర్కొంది. అసెంబ్లీ ఆమోదించిన పలు బిల్లులకు ఆమోదం తెలపకుండా తొక్కిపెడుతున్నారంటూ గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్‌పై పంజాబ్ ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. 'సంప్రదాయాల ప్రకారం 2023 జూన్ 19-20వ తేదీలలో జరిగిన అసెంబ్లీ సెషన్ చెల్లుబాటుపై సందేహాలకు రాజ్యాంగ ప్రాతిపదిక లేదని భావిస్తున్నాం. శాసనసభ సమావేశాలపై సందేహాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం' అని ధర్మాసనం పేర్కొంది. సభ అధికారాల సంరక్షకునిగానూ, శాసనసభకు ప్రాతినిధ్యం వహించే రాజ్యాంగబద్ధంగా గుర్తింపు పొందిన అధికారిగానూ గుర్తింపు పొందిన రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్, సభను వాయిదా వేయడంలో తన అధికార పరిధిలో చక్కగా వ్యవహరిస్తున్నారని పేర్కొంది. అంతేకాకుండా, బడ్జెట్ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేయకుండా పదే పదే వాయిదా వేయడంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయితే, సభా వ్యవహారాల నిర్వహణ, సమావేశాలను వాయిదా వేయడంలో స్పీకర్ నిర్ణయమే అంతిమమంటూ తేల్చి చెప్పింది.



రఫాలో శిథిలాల మధ్య దిగాలుగా కూర్చున్న చిన్నారులు

దిగ్బంధంలో ఆస్పత్రులు

గాజాసిటీలో నాలుగు హాస్పిటళ్ల సమీపంలో భీకర దాడులు | హమాస్ కమాండర్లు సహా 19 మంది మిలిటెంట్లు హతం!

ఖాన్ యూనిస్/టెల్ అవీవ్: దక్షిణ గాజాకు బారులు కట్టిన జనం.. హమాస్ మిలిటెంట్ల స్థావరాలే లక్ష్యంగా ఉత్తర గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు.. వీధుల్లో భూతల పోరాటాలు.. ఆసుపత్రులను చుట్టుముట్టిన ఇజ్రాయెల్ సైనికులు.. గాజా స్ట్రిప్‌లో ప్రస్తుత దృశ్యమిదీ. గాజా సిటీలోని నాలుగు పెద్ద ఆసుపత్రులపై ఇజ్రాయెల్ సైన్యం గురిపెట్టింది. హమాస్ కమాండ్ సెంటర్లు అక్కడే ఉన్నాయని, వాటిని ధ్వంసం చేయక తప్పదని తేల్చిచెప్పింది. శుక్రవారం తెల్లవారుజామునే నాలుగు ఆసుపత్రుల సమీపంలో క్షిపణి దాడులు చేసింది. గాజాలో అతిపెద్దదైన అల్-షిఫా ఆసుపత్రి ప్రాంగణంలో 24 గంటల వ్యవధిలో ఐదుసార్లు క్షిపణులు ప్రయోగించింది. కొన్ని వార్డులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇంట్లో కంటే ఆసుపత్రిలోనే భద్రత ఉంటుందని ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వేలాది మంది జనం తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని క్షణమొక యుగంలా కాలం గడిపారు. అల్-షిఫా హాస్పిటల్ వద్ద జరిగిన దాడుల్లో ఒకరు మరణించారని, మరికొందరు గాయపడ్డారని గాజా ఆరోగ్యశాఖ ప్రకటించింది. కానీ, తమ సైన్యం దాడుల్లో 19 మంది మిలిటెంట్లు హతమయ్యారని, వీరిలో హమాస్ కీలక కమాండర్, ప్లాటూన్ కమాండర్ సైతం ఉన్నారని ఇజ్రాయెల్ వెల్లడించింది. 20 రాకెట్ లాంచర్లు నిల్వ చేసిన హమాస్ షిప్పింగ్ కంటైనర్‌ను ధ్వంసం చేశామని తెలియజేసింది. గాజాసిటీలోని నాలుగు ఆసుపత్రుల చుట్టూ ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు మోహరించాయి. ఇజ్రాయెల్ సేనలు గాజా నగరంలోకి మున్ముందుకు చొచ్చుకొస్తున్నాయి. గాజాసిటీలోని ఓ పాఠశాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేయగా, 20 పాలస్తీనియన్లు మరణించారని స్థానిక అధికారులు చెప్పారు.

మృతులు 11,078.. క్షతగాత్రులు 27,000

ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటివరకు 11,078 మంది మరణించారని, వీరిలో 4,506 మంది చిన్నారులు ఉన్నారని గాజా ఆరోగ్య శాఖ శుక్రవారం ప్రకటించింది. 27,000 మంది గాయపడ్డారని తెలిపింది. మరో 2,650 మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. వారంతా ఇప్పటికే మృతిచెంది ఉండొచ్చని తెలుస్తోంది.

వలస వెళ్తున్నవారిపై వైమానిక దాడులు!

ఉత్తర గాజా నుంచి జనం దక్షిణ గాజాకు చేరుకోవడానికి వీలుగా ఇజ్రాయెల్ సైన్యం ప్రతిరోజూ దాదాపు 4 గంటలపాటు దాడులకు విరామం ఇస్తోంది. ఇకపై నిత్యం విరామం అమల్లో ఉంటుందని ఇజ్రాయెల్ వెల్లడించింది. గత ఐదు రోజుల్లో 1,20,000 మంది దక్షిణ గాజాకు వెళ్లిపోయారు. వారిపైనా వైమానిక దాడులు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఈజిప్టు నుంచి గాజాలోని పాలస్తీనియన్లకు మానవతా సాయం అందుతోంది. ఆహారం, నిత్యావసరాలు, ఔషధాలతో ప్రతిరోజు దాదాపు 100 వాహనాలు గాజాకు చేరుకుంటున్నాయి. మరోవైపు, హమాస్ మిలిటెంట్లపై దాడులు ఆపే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ పునరుద్ఘాటించారు. గాజాలో హమాస్ స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేసేవరకూ అవి కొనసాగుతాయన్నారు.

ఉత్తర గాజా.. భూమిపై నరకం

గాజాపై ఇజ్రాయెల్ సైన్యం నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడుతోంది. మిలిటెంట్ల స్థావరాలతో పాటు సాధారణ జనవాసాలపై బాంబుల వర్షం కురిపిస్తోంది. అక్టోబర్ 7న యుద్ధం ప్రారంభం కాగా, గాజాలో ఇప్పటికే దాదాపు 50 శాతం ఇళ్లు నేలమట్టం అయ్యాయి. శిథిలాలుగా మారిపోయాయి. ప్రధానంగా ఉత్తర గాజాలో పరిస్థితి భీతావహంగా మారింది. ఈ ప్రాంతం మరుభూమిని తలపిస్తోంది. ఐక్యరాజ్యసమితి హ్యూమానిటేరియన్ ఆఫీసు ఉత్తర గాజాను 'భూమిపై నరకం'గా అభివర్ణించిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

పూరీ, హసన్ ఆలయాల్లో తోపులాట

పూరీ/హసన్: ఒడిశాలోని ప్రఖ్యాత పూరీ జగన్నాథుని ఆలయం, కర్ణాటకలో హసన్‌లో ఉన్న హసనాంబ ఆలయాల్లో శుక్రవారం వేకువజాము నుంచి భక్తులు పోటెత్తారు. రద్దీ కారణంగా చోటుచేసుకున్న తోపులాటల్లో 27 మంది వరకు గాయపడ్డారు. కొందరు స్పృహ తప్పి పడిపోయారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేదని అధికారులు వివరించారు. శుక్రవారం వేకువజాము నుంచే ఆలయానికి భక్తుల రాక మొదలైందని శ్రీ జగన్నాథ్ ఆలయ అధికారులు తెలిపారు. మంగళ హారతి సమయంలో గేట్లు తెరవడంతో ఒక్కసారిగా తోపులాట చోటుచేసుకుని 10 మంది భక్తులు సొమ్మసిల్లి పడిపోయారు. వీరిలో ఎక్కువ మంది వృద్ధ మహిళలున్నారని అన్నారు. బాధితులను వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించినట్లు చెప్పారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేదని స్పష్టం చేశారు. గాయపడిన వారిని ప్రాథమిక చికిత్స అనంతరం డిశ్చార్జి చేశారని తెలిపారు. ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువైందే తప్ప తోపులాట జరగలేదని పూరీ ఎస్పీ కేవీ సింగ్ స్పష్టం చేశారు. కర్ణాటక రాష్ట్రం హసన్ జిల్లాలోని హసనాంబ ఆలయంలో క్యూలైన్లలోని వారు విద్యుత్ షాక్‌కు గురై 17 మంది వరకు గాయపడ్డారు. ఇది తోపులాటకు దారితీసింది. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేదని అధికారులు చెప్పారు. బాధితులు చెబుతున్న కరెంట్ షాక్ విషయమై దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు చెప్పారు.

హిందువులు సహనశీలురు

జావెద్ అక్తర్ వ్యాఖ్యలు

ముంబై: ప్రముఖ కవి, గీత రచయిత జావెద్ అక్తర్(78) హిందూ సంస్కృతిపై ప్రశంసలు కురిపించారు. హిందువులు ఎంతో సహనశీలురని, వారి వల్లే మన దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తోందని చెప్పారు. అదే సమయంలో, నేడు దేశంలో వాక్ స్వాతంత్ర్యం తగ్గిపోతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ముంబైలో రాజ్ ఠాక్రే సారథ్యంలోని మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) నిర్వహించిన దీపోత్సవ్‌లో ఆయన పాల్గొన్నారు. 'హిందువులు దయామయులు. విశాల హృదయులు. అసహనం కలిగిన కొందరున్నారు. హిందువులు వారిలా ఉండరు. హిందువులకు మాత్రమే దయ, విశాల హృదయం అనే గొప్ప లక్షణాలుంటాయి. వాటిని కోల్పోవద్దు. లేకుంటే మిగతా వారికీ మీకూ బేధం ఉండదు. హిందువుల జీవన విధానం నుంచి మేం నేర్చుకున్నాం. వాటిని మీరు వదులుకుంటారా?'అని ఆయన ప్రశ్నించారు. ఇంకా ఆయన.. 'శ్రీరాముడు, సీతాదేవిల గడ్డపై పుట్టినందుకు గర్విస్తున్నాను. నేను నాస్తికుడినే అయితే రాముడిని, సీతను ఈ దేశ సంపదగా భావిస్తాను. రామాయణం మన సాంస్కృతిక వారసత్వం'అంటూ జై సియా రాం అని నినదించారు. 'ఇది హిందూ సంస్కృతి, నాగరికత. మనకు ప్రజాస్వామ్య దృక్పథాలను నేర్పింది. ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఉంది. అందుకే మనమే ఒప్పు, అందరిదీ తప్పు అని భావించడం హిందువుల సిద్ధాంతం కాదు. ఇది మీకు ఎవరు నేర్పించినా తప్పే'అని అన్నారు. అయితే, దేశంలో నేడు వాక్ స్వాతంత్ర్యం క్షీణిస్తుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు.

ఆ భారం మాపైకి నెట్టేయకండి

ఢిల్లీలో సరి-బేసి ట్రాఫిక్ విధానంపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కాలుష్యాన్ని నియంత్రించే విషయంలో కోర్టుపైకి భారం నెట్టేసే ప్రయత్నాలు మానుకోవాలని ఢిల్లీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. ఢిల్లీలో మళ్లీ సరి-బేసి ట్రాఫిక్ విధానం తేవడంపై నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిదేనని, తామెలాంటి ఆదేశాలూ ఇవ్వలేదని స్పష్టం చేసింది. సరి-బేసి విధానంతో తమకు ఎటువంటి సంబంధం లేదని, చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి ఢిల్లీలోకి ప్రవేశించే ట్యాక్సీలకు కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని తామెన్నడూ తెలపలేదని పేర్కొంది. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ ధర్మాసనం శుక్రవారం ఈ వ్యాఖ్యలు చేసింది. సరి-బేసి విధానం కాలుష్యాన్ని తగ్గించడంలో అంతగా పనిచేయదని అమికస్ క్యూరీకి చెప్పామని గుర్తు చేసింది. ''మీరేం చేయాలో చెప్పడానికి మేమిక్కడ లేం. ఆ విధానం కొనసాగించొద్దు అని మేం చెప్తే, సుప్రీంకోర్టు ఆదేశించినందువల్లే కాలుష్యం ఎక్కువైందని మీరంటారు'' అని పేర్కొంది. ఢిల్లీలో వాయు నాణ్యత మెరుగు పడినందున సరి-బేసి విధానం అమలు చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

జంగ్ తెలంగాణ

119 నియోజకవర్గాల్లో బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే..

పినపాక: రేగా కాంతారావు, పాయం వెంకటేశ్వర్లు, పొడియం బాలరాజు

ఇల్లెందు: హరిప్రియ, కోరం కనకయ్య, రవీంద్రనాయక్

ఖమ్మం: పువ్వాడ అజయ్, తుమ్మల నాగేశ్వరరావు, రామకృష్ణ, జనసేన

పాలేరు: ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రవికుమార్, తమ్మినేని

మధిర: లింగాల కమల్‌రాజ్, భట్టి విక్రమార్క, విజయరాజు

వైరా: మదన్‌లాల్, రాందాస్ నాయక్, సంపత్, జనసేన

సత్తుపల్లి: వెంకటవీరయ్య, మట్టా రాగమయి, రామలింగేశ్వరరావు

కొత్తగూడెం: వెంకటేశ్వరరావు, కూనంనేని, సురేందర్‌రావు

అశ్వారావుపేట: నాగేశ్వరరావు, ఆదినారాయణ, ఉమాదేవి, జనసేన

భద్రాచలం: తెల్లం వెంకట్రావు, పొదెం వీరయ్య, కుంజా ధర్మా

వరంగల్ పశ్చిమ: వినయ్‌భాస్కర్, నాయిని రాజేందర్, రావు పద్మ

వరంగల్ తూర్పు: నరేందర్, కొండా సురేఖ, ప్రదీప్‌రావు

వర్ధన్నపేట: అరూరి రమేష్, కేఆర్ నాగరాజు, కొండేటి శ్రీధర్

పరకాల: చల్లా ధర్మారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కాళీప్రసాదరావు

పాలకుర్తి: దయాకర్‌రావు, యశస్వినిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి

జనగాం: రాజేశ్వర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, దశమంత రెడ్డి

స్టేషన్ ఘన్‌పూర్: కడియం శ్రీహరి, ఇందిర, విజయ రామారావు

భూపాలపల్లి: వెంకటరమణారెడ్డి, సత్యనారాయణ, చందుపట్ల కీర్తిరెడ్డి

ములుగు: బడే నాగజ్యోతి, ధనసరి సీతక్క, ప్రహ్లాద్ నాయక్

మహబూబాబాద్: శంకర్‌నాయక్, మురళీనాయక్, హుస్సేన్ నాయక్

నర్సంపేట: సుదర్శన్ రెడ్డి, మాధవరెడ్డి, పుల్లారావు

డోర్నకల్: రెడ్యానాయక్, రాంచంద్రునాయక్, భూక్యా సంగీత

మహబూబ్‌నగర్: శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మిథున్‌రెడ్డి

దేవరకద్ర: వెంకటేశ్వర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కొండా ప్రశాంత్‌రెడ్డి

జడ్చర్ల: లక్ష్మారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, చిత్తరంజన్‌దాస్

నాగర్‌కర్నూల్: మర్రి జనార్దన్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, జనసేన

కొల్లాపూర్: హర్షవర్ధన్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎల్లేని సుధాకర్‌రావు

అచ్చంపేట: గువ్వల బాలరాజు, వంశీకృష్ణ, సతీష్ మాదిగ

కల్వకుర్తి: జైపాల్‌యాదవ్, నారాయణరెడ్డి, తల్లోజు ఆచారి

వనపర్తి: నిరంజన్‌రెడ్డి, మేఘారెడ్డి, అనుజ్ఞారెడ్డి

నారాయణపేట: రాజేందర్‌రెడ్డి, చిట్టెం పర్ణికారెడ్డి, రతంగ్‌పాండురెడ్డి

మక్తల్: రామ్మోహన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, జలంధర్‌రెడ్డి

గద్వాల: కృష్ణమోహన్‌రెడ్డి, సరిత, బోయశివారెడ్డి

అలంపూర్: కె.విజయుడు, సంపత్ కుమార్, రాజగోపాల్

ఆదిలాబాద్: జోగు రామన్న, కంది శ్రీనివాసరెడ్డి, పాయల్ శంకర్

బోథ్: అనిల్ జాదవ్, ఆడె గజేందర్, బాపూరావు

సిర్పూర్: కోనేరు కోనప్ప, రావి శ్రీనివాస్, హరీశ్ బాబు, ప్రవీణ్‌కుమార్

ఆసిఫాబాద్: కోవ లక్ష్మి, శ్యాంనాయక్, ఆత్మారామ్

మంచిర్యాల: దివాకర్‌రావు, ప్రేంసాగర్‌రావు, రఘునాథ్

బెల్లంపల్లి: దుర్గం చిన్నయ్య, గడ్డం వినోద్, శ్రీదేవి

చెన్నూర్: బాల్క సుమన్, వివేకానంద్, దుర్గం అశోక్

నిర్మల్: ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీహరిరావు, మహేశ్వర్‌రెడ్డి

ముధోల్: విఠల్‌రెడ్డి, నారాయణరావ్, రామారావు

ఖానాపూర్: జాన్సన్ నాయక్, వెడ్మ బొజ్జు, రాథోడ్ రమేశ్

వేములవాడ: లక్ష్మీనర్సింహరావు, ఆది శ్రీనివాస్, వికాస్‌రావు

ధర్మపురి: కొప్పుల ఈశ్వర్, లక్ష్మణ్‌కుమార్, ఎస్.కుమార్

కరీంనగర్: గంగుల కమలాకర్, శ్రీనివాస్, బండి సంజయ్

జగిత్యాల: డాక్టర్ సంజయ్, జీవన్‌రెడ్డి, భోగ శ్రావణి

చొప్పదండి: రవిశంకర్, సత్యం, బొడిగే శోభ

మంథని: పుట్టమధు, శ్రీధర్‌బాబు, సునీల్‌రెడ్డి

పెద్దపల్లి: మనోహర్‌రెడ్డి, విజయరమణారావు, ప్రదీప్‌కుమార్

కోరుట్ల: డాక్టర్ సంజయ్, నర్సింగరావు, అర్వింద్

హుజూరాబాద్: పాడి కౌశిక్‌రెడ్డి, ప్రణవ్‌బాబు, ఈటల రాజేందర్

రామగుండం: కోరుకంటి చందర్, రాగూర్, సంధ్యారాణి

మానకొండూర్: రసమయి, సత్యనారాయణ, ఆరెపల్లి మోహన్

సిరిసిల్ల: కేటీఆర్, కేకే మహేందర్‌రెడ్డి, రాణీరుద్రమ

సంగారెడ్డి: చింతా ప్రభాకర్, జగ్గారెడ్డి, పులిమామిడి రాజు

పటాన్‌చెరు: మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నందీశ్వర్ గౌడ్, నీలం మధు

నారాయణఖేడ్: భూపాల్ రెడ్డి, సంజీవరెడ్డి, సంగప్ప

అందోల్: క్రాంతి కిరణ్, రాజనర్సింహ, బాబు మోహన్

జహీరాబాద్: మాణిక్ రావు, చంద్రశేఖర్, రామచంద్ర

మెదక్: పద్మాదేవేందర్‌రెడ్డి, రోహిత్‌రావు, విజయ్‌కుమార్

నర్సాపూర్: సునీతారెడ్డి, ఆవుల రాజిరెడ్డి, ఎ.మురళీయాదవ్

గజ్వేల్: కేసీఆర్, నర్సారెడ్డి, ఈటల రాజేందర్

సిద్దిపేట: హరీశ్ రావు, పూజల హరికృష్ణ, శ్రీకాంత్ రెడ్డి

హుస్నాబాద్: సతీష్‌కుమార్, పొన్నం ప్రభాకర్, శ్రీరాంచక్రవర్తి

దుబ్బాక: ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రఘునందన్‌రావు

సూర్యాపేట: జగదీష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు

హుజూర్‌నగర్: సైదిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చల్లా శ్రీలతారెడ్డి

తుంగతుర్తి: గాదరి కిషోర్, మందుల సామేలు, రామచంద్రయ్య

కోదాడ: మల్లయ్య యాదవ్, పద్మావతిరెడ్డి, సతీష్‌రెడ్డి, జనసేన

మునుగోడు: ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి

భువనగిరి: పైళ్ల శేఖర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి

ఆలేరు: గొంగిడి సునీత, బీర్ల ఐలయ్య, పడాల శ్రీనివాస్

నకిరేకల్: చిరుమర్తి లింగయ్య, వేముల వీరేశం, మొగిలయ్య

మిర్యాలగూడ: భాస్కర్‌రావు, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, రంగారెడ్డి

నాగార్జునసాగర్: నోముల భగత్, జయవీర్‌రెడ్డి, నివేదితారెడ్డి

దేవరకొండ: రవీంద్రకుమార్, బాలునాయక్, లాలునాయక్

నల్లగొండ: భూపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

నిజామాబాద్ అర్బన్: బిగాల గణేశ్ గుప్తా, షబ్బీర్ అలీ, సూర్యనారాయణ

నిజామాబాద్ రూరల్: బాజిరెడ్డి గోవర్ధన్, డాక్టర్ భూపతిరెడ్డి, దినేష్‌కుమార్

ఆర్మూర్: జీవన్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి

బాల్కొండ: ప్రశాంత్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, అన్నపూర్ణమ్మ

కామారెడ్డి: కేసీఆర్, రేవంత్‌రెడ్డి, వెంకట రమణారెడ్డి

ఎల్లారెడ్డి: జాజాల సురేందర్, కె మదన్ మోహన్, బి. సుభాష్‌రెడ్డి





బీఆర్‌ఎస్‌లోకి మాజీ మంత్రి సంభాని

- సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లోకి ఖమ్మం నేతలు
- కాంగ్రెస్ నేతలు ఎడవల్లి కృష్ణ, మానవతారాయ్ చేరిక

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ సహా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ ముఖ్య నేతలు శుక్రవారం పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో పార్టీలో చేరిన నేతలకు కేసీఆర్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎడవెల్లి కృష్ణ, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నేత, పీసీసీ ప్రధాన కార్యదర్శి మానవతారాయ్, మడత వెంకట్‌గౌడ్ (ఇల్లందు), రామచంద్ర నాయక్ (వైరా)తో పాటు బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య తదితరులున్నారు. నేతలతో రెండున్నర గంటల పాటు సుదీర్ఘంగా భేటీ అయిన సీఎం అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఆతర్వాత ప్రగతిభవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతోనూ వీరు భేటీ అయ్యారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ పంచతంత్రం

సింధియాకు అగ్నిపరీక్ష

అసెంబ్లీ ఎన్నికలు ఇంకా వారం కూడా లేని వేళ మధ్యప్రదేశ్‌లో కీలకమైన గ్వాలియర్-చంబల్ ప్రాంతం అధికార బీజేపీకి తలనొప్పిగా మారుతోంది. పార్టీలోని పాత నేతలకు, మూడేళ్ల కింద కాంగ్రెస్ నుంచి వచ్చి చేరిన జ్యోతిరాదిత్య సింధియా అనుయాయులకు అస్సలు సరిపడకపోవడం, ఎవరికి వారే అన్నట్టుగా వ్యవహరిస్తుండటం అధిష్టానానికి మింగుడు పడటం లేదు. ఈ ప్రాంతంలో 34 కీలక అసెంబ్లీ స్థానాలున్నాయి. రాష్ట్రంలో అధికారం చేపట్టాలంటే ఇక్కడ మంచి ఫలితాలు సాధించడం కాంగ్రెస్, బీజేపీ రెండింటికీ చాలా కీలకం. అలాంటి ప్రాంతంలో పాత, కొత్త నేతలు సయోధ్యకు ససేమిరా అంటుండటం పార్టీ నాయకత్వంతో పాటు సింధియాకు కూడా ఇబ్బందికరంగానే మారింది. పైగా శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వంపై జనంలో నెలకొన్న వ్యతిరేకత కూడా దీనికి తోడయ్యేలా కన్పిస్తుండటం మరింత గుబులు రేపుతోంది. ఈసారి గ్వాలియర్ ప్రాంతంలో బీజేపీ సాధించబోయే సీట్ల సంఖ్యపై పార్టీలో సింధియా భవితవ్యం కూడా చాలావరకు ఆధారపడి ఉంది. ఈ నేపథ్యంలో ఇక్కడ ఓటర్ల తీర్పు ఎలా ఉండనుందన్నది ఆసక్తికరంగా మారింది...

గ్వాలియర్‌లో 'పాత-కొత్త' కొట్లాటలు

- బీజేపీలో పెరుగుతున్న కుమ్ములాటలు
- భయపెడుతున్న ఓటర్ల నిరాసక్తత
- సింధియా రాజకీయ భవిష్యత్తుకు పరీక్ష



అది గ్వాలియర్‌లోని హజీరా ప్రాంతం. సిట్టింగ్ ఎమ్మెల్యే, రాష్ట్ర ఇంధన మంత్రి ప్రద్యుమ్నసింగ్ తోమర్ ముమ్మరంగా ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. బీజేపీకి ఓటెయ్యాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో మాత్రం కాంగ్రెస్‌కు ఓటెయ్యాల్సిందిగా కోరారాయన! ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచిన అనంతరం యువ నేత జ్యోతిరాదిత్య సింధియా నాయకత్వంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్న 16 మంది ఎమ్మెల్యేల్లో తోమర్ ఒకరు. ఆయన రాకతో కినుక వహించిన స్థానిక బీజేపీ నేతలు ఇప్పుడాయనకు సహాయ నిరాకరణ చేస్తున్నారు. దాంతో ఒకరకంగా ఆయనది ఒంటరి పోరుగానే మారింది. ఆయనకు మాత్రమే కాదు, బీజేపీ టికెటిచ్చిన సింధియా వర్గానికి చెందిన మరో 17 మంది నాయకులకూ దాదాపుగా ఇదే పరిస్థితి ఎదురవుతోంది! అంతేగాక ఓటర్లు కూడా వారిపట్ల నిరాసక్తతే చూపుతున్నారు. ''వారికే పరస్పరం కుదరడం లేదు. అలాంటి వాళ్లకు మా మంచీ చెడూ గురించి ఆలోచించేంత సమయం ఎక్కడుంటుంది?'' అని ప్రశ్నిస్తున్నారు!

బీజేపీ వర్సెస్ సింధియా వర్గం

2020 మార్చిలో 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి సింధియా బీజేపీలో చేరారు. దాంతో కమల్‌నాథ్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలి శివరాజ్ సింగ్ చౌహాన్ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైంది. వారంతా రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలొచ్చాయి. గ్వాలియర్-చంబల్ ప్రాంతంలో ఇలా రాజీనామా చేసిన 16 మందిలో 9 మంది తిరిగి నెగ్గారు. దాంతో అక్కడ బీజేపీ బలం 16కు పెరిగింది. ఈసారి ఆ స్థానాలన్నింటినీ నిలుపుకోవడంతో పాటు మరిన్ని చోట్ల నెగ్గాల్సిన కఠిన పరీక్ష సింధియా ముందుంది. కానీ పరిస్థితులు ఆయనకు అంత సానుకూలంగా కన్పించడం లేదు. ఆ ప్రాంత ప్రజల్లో మెజారిటీ సింధియా నిర్ణయాన్ని తప్పుబడుతుండటం విశేషం. ఆయనసలు కాంగ్రెస్‌ను వీడాల్సిందే కాదన్నది వారి నిశ్చితాభిప్రాయం. దీనికి తోడు సింధియా వర్గానికి చెందిన 18 మందికి బీజేపీ నాయకత్వం టికెట్లివ్వడం కూడా పార్టీలో విభేదాలకు కారణమైంది. పలువురు ఆశావహులు పార్టీలు మారి బరిలో దిగి సవాలు విసురుతున్నారు. మోరెనా అసెంబ్లీ స్థానంలో సింధియా వర్గం ఎమ్మెల్యే రఘురాయ్ కన్సానాకు టికెటివ్వడాన్ని వ్యతిరేకిస్తూ రాకేశ్ రుస్తుం సింగ్ బీజేపీని వీడారు. బీఎస్పీ టికెట్‌పై బరిలో దిగి సవాలు విసురుతున్నారు. బీజేపీ ఓటు బ్యాంకును ఆయన గణనీయంగా చీల్చడం ఖాయమంటున్నారు. పలు ఇతర అసెంబ్లీ స్థానాల్లోనూ ఇదే పరిస్థితి! దీన్ని గమనించే బీజేపీ ట్రబుల్ షూటర్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అక్టోబర్ 30 నుంచి వారంలోపే ఏకంగా రెండుసార్లు గ్వాలియర్-చంబల్ ప్రాంతంలో పర్యటించారు. అసంతృప్త పార్టీ నేతలతో వరుస సమావేశాలు జరిపి బుజ్జగించే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. ''అసలు బీజేపీ నేతల్లోనే చాలామంది సింధియాను వ్యతిరేకిస్తున్నారు. ఇది ఈసారి ఆ పార్టీకి బాగా చేటు చేసేలా కనిపిస్తోంది'' అని రాజకీయ, మీడియా విశ్లేషకులు చెబుతున్నారు. నిజానికి గ్వాలియర్ రాజ వంశీకునిగా సింధియాపై ఈ ప్రాంతవాసులకు చెప్పలేనంత అభిమానముంది. కానీ ఆయన పార్టీ మారిన తీరు వారికి పెద్దగా నచ్చలేదు.

వ్యతిరేక పవనాలు..!

అంతేగాక మధ్యలో ఓ ఏడాదిన్నర మినహా రాష్ట్రంలో 18 ఏళ్లుగా బీజేపీ పాలనే సాగుతుండటంతో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న ప్రభుత్వ వ్యతిరేకత కూడా సింధియాకు ప్రతికూలంగా మారుతోంది. ''నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మాకొచ్చే రోజువారీ కూలీ ఏ మూలకూ చాలడం లేదు. పోయినసారి బీజేపీకి ఓటేశాం. ఈసారి మాత్రం కాంగ్రెస్‌కే వేసి చూద్దామనుకుంటున్నాం'' అన్న మాలతీ కిరార్, ఆమె సోదరుడు యోగేంద్ర మాటలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఇంజనీరింగ్ పూర్తి చేసినా తనకిప్పటికీ ఉద్యోగం దొరకలేదని భగవాన్ దాస్ అనే యువకుడు వాపోయాడు. ''మూడేళ్లుగా ప్రభుత్వోద్యోగాల భర్తీయే లేదు. బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలి?'' అన్న ఆయన ప్రశ్న యువతలో కూడా కమలం పార్టీకి సానుకూలంగా లేదనేందుకు రుజువేనంటున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్


2018 అసెంబ్లీ ఎన్నికల్లో గ్వాలియర్-చంబల్ ప్రాంతంలో పార్టీలవారీగా ఫలితాలు

అసెంబ్లీ స్థానాలు	34
కాంగ్రెస్	26
బీజేపీ	7

రెండో విడత ఎన్నికల బరిలో ఉన్న 253 మంది కోటీశ్వరులు

ఏడీఆర్ నివేదిక వెల్లడి

ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం ఆస్తులు రూ.447 కోట్లు



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి ఈనెల 17న రెండో విడత ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో 253 మంది కోటీశ్వరులు. ఈ జాబితాలో కాంగ్రెస్ సీనియర్ నేత, డిప్యూటీ సీఎం టీఎస్ సింగ్ దేవ్ రూ.447 కోట్లతో మొదటి స్థానంలో నిలిచారు. మొత్తం 958 మందికిగాను 953 మంది అభ్యర్థులు ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో వెల్లడించిన ఆస్తుల వివరాలను విశ్లేషించినట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్)తెలిపింది. అభ్యర్థుల ఆస్తుల సరాసరి రూ.2 కోట్లని తెలిపింది. అత్యంత ధనికులైన ముగ్గురు అభ్యర్థులు కూడా కాంగ్రెస్‌కు చెందిన వారేనని పేర్కొంది. సుర్‌గుజా రాచకుటుంబ వారసుడైన టీఎస్ సింగ్ దేవ్ రూ.447 కోట్ల ఆస్తులతో మొదటి స్థానంలో ఉన్నారు. అంబికాపూర్ నుంచి పోటీ చేస్తున్న ఈయన 2018 ఎన్నికల సమయంలో రూ.500 కోట్ల ఆస్తులున్నట్లు వెల్లడించారు. ఆ తర్వాత మణేంద్రగఢ్ స్థానంలో పోటీ చేస్తున్న రమేశ్ సింగ్ రూ.73 కోట్ల పైచిలుకు ఆస్తులు, రజిమ్‌లో పోటీ చేస్తున్న అమితేశ్ శుక్లా రూ.48 కోట్ల పైచిలుకు ఆస్తులున్నట్లు ప్రకటించారని వెల్లడించింది. కాంగ్రెస్‌కు చెందిన 70 మంది అభ్యర్థుల్లో 60 (86%)మంది, బీజేపీకి చెందిన 70 మంది అభ్యర్థుల్లో 57 (81%)మంది, జనతా కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్ (జే)కి చెందిన 62 మందిలో 26 (42%) మంది, ఆప్‌నకు చెందిన 44 మందిలో 19 (43%) మంది అభ్యర్థులు రూ.1 కోటి కంటే ఎక్కువ ఆస్తులున్నట్లు ప్రకటించారని వివరించింది.

ఆస్తులే లేవన్న ముగ్గురు అభ్యర్థులు

భట్‌గావ్ సీటుకు పోటీ చేస్తున్న కళావతి సార్థి, బెల్టారాలో పోటీ చేస్తున్న గౌతమ్ ప్రసాద్ సాహు అనే స్వతంత్ర అభ్యర్థులు, ఖర్సియాలో పోటీలో ఉన్న జోహార్ ఛత్తీస్‌గఢ్ పార్టీకి చెందిన యశ్వంత్ కుమార్ నిషాద్ తమకు ఎలాంటి ఆస్తులు లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు ఏడీఆర్ తెలిపింది. అదేవిధంగా, రెండో విడత ఎన్నికల బరిలో ఉన్న ముగ్గురు అభ్యర్థులు అతి తక్కువగా ఆస్తులున్నట్లు అఫిడవిట్‌లో వెల్లడించారు. ముంగేలి ఎస్సీ రిజర్వుడు సీటుకు పోటీ చేస్తున్న నేషనల్ యూత్ కాంగ్రెస్ అభ్యర్థి రాజ్‌రత్న ఉయికే తన వద్ద కేవలం రూ.500 ఉన్నట్లు తెలిపారు. రాయ్‌గఢ్‌లో ఆజాద్ జనతా పార్టీ టికెట్‌పై పోటీ చేస్తున్న కాంతి సాహు రూ.1,000 మాత్రమే ఉన్నట్లు వెల్లడించారు. అదే విధంగా, బెల్టారా బరిలో నిలిచిన ఆజాద్ జనతా పార్టీకే చెందిన ముకేశ్ కుమార్ చంద్రాకర్ రూ. 1,500 ఉన్నట్లు వెల్లడించారని ఏడీఆర్ తెలిపింది.

సీఎం బఘేల్‌కు అత్యధిక ఆదాయం

ఆప్ అభ్యర్థి విశాల్ కేల్కర్, కాంగ్రెస్ నేత, సీఎం భూపేశ్ బఘేల్, బీజేపీ నేత ఓపీ చౌధరి తమకు అత్యధిక ఆదాయం వస్తున్నట్లు అఫిడవిట్‌లో వెల్లడించారని ఏడీఆర్ పేర్కొంది. కేల్కర్ తన మొత్తం ఆదాయం రూ.2 కోట్లుగా, సీఎం బఘేల్, చౌధరిలు రూ.కోటికి పైగా ఆదాయం ఉన్నట్లు చెప్పారు.

52 శాతం మంది 12వ తరగతిలోపే

మొత్తం అభ్యర్థుల్లో 499(52 శాతం) మంది తమ విద్యార్హతలను 5 నుంచి 12వ తరగతి మధ్య ఉన్నట్లు తెలపగా మరో 405(42%)మంది గ్రాడ్యుయేషన్ ఆపైన చదువుకున్నట్లు వెల్లడించారని ఏడీఆర్ విశ్లేషించింది. 19 మంది అక్షరాస్యులమని మాత్రమే తెలపగా, ఆరుగురు నిరక్షరాస్యులమని తెలిపారు. ముగ్గురు అభ్యర్థులు విద్యార్హతలను పేర్కొనలేదు.



కుల గణన.. విప్లవాత్మక ముందడుగు

అధికారంలోకి వస్తే కుల గణన నిర్వహిస్తాం

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీ

సాత్నా: కుల గణన అనేది విప్లవాత్మకమైన ముందడుగు అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ అభివర్ణించారు. కుల గణన ప్రజల జీవితాల్లో మార్పు తెస్తుందని అన్నారు. మధ్యప్రదేశ్‌లో తమ పార్టీ అధికారంలోకి వస్తే కులాల వారీగా జనాభా లెక్కల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. ఓబీసీల జనాభా ఎంత ఉందో తేలుస్తామన్నారు. కుల గణన ఎక్స్-రే లాంటిదని చెప్పారు. ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయడానికి, ప్రభుత్వ విధానాల రూపకల్పనకు కుల గణన తోడ్పడుతుందని వివరించారు. కేంద్రంలోనూ అధికారంలోకి వచ్చిన వెంటనే దేశవ్యాప్తంగా కుల గణన చేపడతామని హామీ ఇచ్చారు. శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని సాత్నా, బర్వానీలో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్ గాంధీ ప్రసంగించారు. కేంద్రంలో బీజేపీ పాలన మొదలయ్యాక దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని విమర్శించారు. తాను ఓబీసీనని పదే పదే చెప్పుకొనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కులగణనపై మాత్రం నోరు మెదపడం లేదని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో 53 మంది ఐఏఎస్ అధికారులు ఉండగా, వారిలో ఓబీసీ అధికారి ఒక్కరే ఉన్నారని రాహుల్ ఆక్షేపించారు. రాష్ట్ర బడ్జెట్ 100 రూపాయలు అనుకుంటే.. అందులో కేవలం 33 పైసలు మాత్రమే ఓబీసీ ఐఏఎస్ అధికారి పరిధిలో ఉన్నట్టు అవుతుందని చెప్పారు. మధ్యప్రదేశ్‌లో ప్రజల మద్దతుతో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ధన బలం ప్రయోగించి బీజేపీ కూల్చివేసిందని రాహుల్ గాంధీ మండిపడ్డారు. నలుగురు ఐదుగురు బడా పారిశ్రామికవేత్తలు బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.14 లక్షల కోట్ల రుణాలను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. సామాన్య ప్రజలకు మాత్రం బ్యాంకుల నుంచి రుణాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజస్తాన్ అసెంబ్లీ బరిలో 1,875 మంది

జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీకి ఈనెల 25న జరగనున్న ఎన్నికలకు 1,875 మంది పోటీలో మిగిలారు. నామినేషన్ల ఉపసంహరణకు గురువారం ఆఖరి రోజు. గడువులోగా మొత్తం 490 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారని అధికారులు తెలిపారు. బరిలో 183 మంది మహిళలు, 1,692 మంది పురుష అభ్యర్థులు మిగిలారని వివరించారు. నామినేషన్ పత్రాలను వెనక్కి తీసుకున్న వారిలో బీజేపీ రెబల్ అభ్యర్థి మాజీ మంత్రి రాజ్‌పాల్ సింగ్ కూడా ఉన్నారు. జోత్వారా నియోజకవర్గంలో బీజేపీ తరఫున ఎంపీ రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ పోటీ చేస్తున్నారు. ఈ స్థానంలోనే రెబెల్‌గా రాజ్‌పాల్ సింగ్ నామినేషన్ వేశారు. నామినేషన్లను వెనక్కి తీసుకున్న వారిలో పలువురు బీజేపీ, కాంగ్రెస్ నేతలున్నారు. మొత్తం 2,605 మంది నామినేషన్లు వేయగా అధికారుల పరిశీలించి 240 నామినేషన్లను తిరస్కరించారు. జోత్వారాలో అత్యధికంగా 18 మంది పోటీలో ఉండగా దౌసా జిల్లా లాల్‌సోట్‌లో ముగ్గురే బరిలో నిలిచారు.

సాక్షి హైదరాబాద్

శనివారం। 11। నవంబర్। 2023

సెలబ్రిటీ కామెంట్

పాత బస్తీని హెరిటేజ్ సిటీగా మార్చాలి



సాక్షి, సిటీబ్యూరో: ఇది మన కలల నగరం కావాలంటే రాకెట్ సైన్స్ అవసరం లేదు. ప్రభుత్వ సంకల్పం పౌరుల సహకారం ఉంటే చాలు. పాతబస్తీని పరిశుభ్రంగా మార్చి వారసత్వ నగరంగా పునరుద్ధరించాలి. తద్వారా గొప్ప పర్యాటక ఆకర్షణగా మారుతుంది. ఫుట్‌పాత్‌లు జీబ్రా క్రాసింగ్‌లు వంటివి పెరిగితే పాదచారులు నడవడానికి సిటీ రోడ్లు అనువుగా మారతాయి. తగినన్ని ఉద్యానవనాలు, నీటి వనరులను కూడా అభివృద్ధి చేయాలి. వాక్‌వేలు సరిపడా ఉంటే అవి స్వచ్ఛమైన గాలిని పొందడానికి వీలు కల్పిస్తాయి. మెట్రో స్టేషన్లకు చివరి మైలు కనెక్టివిటీ ఉంటే.. మరింత ఎక్కువ మంది వినియోగించుకుంటారు. చాలా చోట్ల రోడ్ల పక్కన దుర్వాసనతో కూడిన చెత్త కుప్పలు వాహనచోదకులను ఇబ్బంది పెడుతున్నాయి. డివైడర్లు రాత్రిపూట డ్రైవర్లకు కనిపించేలా రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలి. కళ, సంస్కృతి, రంగస్థలం, యాంఫిథియేటర్లు, ఆడిటోరియాలు పెరిగితే అవి నగరాన్ని వైవిధ్యభరిత కార్యక్రమాలతో సందడిగా మారుస్తాయి. అన్నింటికి మించి మహిళలు, చిన్నారులకు తగినంత భద్రత సంపూర్ణంగా లభిస్తే అంతకు మించిన కలల నగరం ఇంకొకటి ఉండదు.

– చందనా చక్రవర్తి, సినీ నటి

మరోసారి.. నమో



నేడు నగరానికి మోదీ

- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో 'విశ్వ రూప మహా సభ'
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న ప్రధాని

సాక్షి, సిటీబ్యూరో: ప్రధాని నరేంద్ర మోదీ శనివారం మళ్లీ నగరానికి రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదికగా మధ్యాహ్నం నిర్వహించనున్న అణగారిన వర్గాల 'విశ్వరూప మహాసభ'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విశిష్ట అతిథిగా పాల్గొననున్నారు. ఇటీవల ఎల్బీస్టేడియం వేదికగా నిర్వహించిన 'బీసీ ఆత్మగౌరవ' సభకు ప్రధాని మోదీ హాజరైన విషయం విదితమే. తాజాగా విశ్వరూప మహా సభకు హాజరు కాబోతుండటంతో దళిత వర్గాలను పెద్ద ఎత్తున ఈ సభకు తరలించేందుకు ఎస్సీ మోర్చా నేతలు ఏర్పాట్లు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ జిల్లాలతో పాటు ఇతర జిల్లాల నుంచి జనాన్ని భారీగా తరలించాలని నిర్ణయించారు. ఈ వేదికగా ప్రధాని ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉంది.

నేటి మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసింది. దీనికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో గ్రౌండ్స్ కేంద్రంగా మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు విధిస్తూ ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ వాహనదారులు బేగంపేట్, పరేడ్‌గ్రౌండ్స్, తాడ్‌బండ్, బోయిన్‌పల్లి, జూబ్లీ బస్‌స్టేషన్, ప్యారడైజ్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, రైల్ నిలయం, మెట్టుగూడ, ఎంజీ రోడ్, ఆర్పీ రోడ్, ఎస్డీ రోడ్, మినిస్టర్స్ రోడ్, ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్లను అనుసరించకపోవడం ఉత్తమం. ఆయా మార్గాల్లో వెళ్లే వారు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. గ్రౌండ్స్‌లోకి ప్రవేశించడానికి వివిధ గేట్లు, ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు కేటాయించారు. వీఐపీలకు సైతం వారు వచ్చే మార్గాల వారీగా ప్రత్యేక పార్కింగ్, ప్రవేశ ద్వారాలు కేటాయించారు.

మళ్లింపులు ఇలా..

ఎస్పీ రోడ్‌లో ఎస్బీహెచ్ చౌరస్తా నుంచి బేగంపేట వైపు వాహనాలను అనుమతించరు. వీటిని ప్యాట్నీ–ఆర్పీ రోడ్, ప్యాట్నీ–ప్యారడైజ్, స్వీకార్ ఉప్‌కార్–టివోలీ–బాలమ్‌రాయ్–సీటీఓ మీదుగా మళ్లిస్తారు. సీటీఓ చౌరస్తా నుంచి పరేడ్ గ్రౌండ్స్ వైపు వాహనాలు అనుమతించరు. వీటిని బాలమ్‌రాయ్–తాడ్‌బండ్–మస్తాన్ కేఫ్–బ్రూక్ బాండ్–టివోలీ–స్వీకార్ ఉప్‌కార్–ఎస్బీహెచ్, ప్యారడైజ్–ఎస్డీ రోడ్–ప్యాట్నీ–క్లాక్ టవర్–సంగీత్ జంక్షన్ మీదుగా పంపిస్తారు. టివోలీ చౌరస్తా నుంచి ప్లాజా వైపు వాహనాలను అనుమతించరు. వీటిని బాలమ్‌రాయ్–సీటీఓ–ఉప్‌కార్–వైఎంసీఏ మీదుగా మళ్లిస్తారు. ప్యారడైజ్ చౌరస్తా నుంచి ప్లాజా వైపు వాహనాలు అనుమతించరు. వీటిని ప్యారడైజ్–ప్యాట్నీ మీదుగా పంపిస్తారు.





జన ప్రవాహం.. 'కూన' ప్రమోదం!

మహిళల కోలాటాలు.. కాషాయ పార్టీ కార్యకర్తల హారతులు.. దారంతా భారీగా జన ప్రవాహం.. శుక్రవారం కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్ నామినేషన్ ర్యాలీ అట్టహాసంగా సాగింది. గాజులరామారం చిత్తారమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కూన శ్రీశైలంగౌడ్ భారీ ర్యాలీగా నామినేషన్ వేసేందుకు తరలి వెళ్లారు. ప్రజలకు ఆయన అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.

– కుత్బుల్లాపూర్

ఒవైసీ బ్రదర్స్.. ఆన్ ఫీల్డ్



చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో శుక్రవారం ఒవైసీ సోదరులు ఎన్నికల ప్రచారం పాల్గొన్నారు. ఎంఐఎం అధినేత ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం అభ్యర్థి ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌లు ఉప్పుగూడ డివిజన్‌లో గాలిపటం గుర్తుకు ఓటు వేసి మజ్లిస్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. – చాంద్రాయణగుట్ట

తలపాగా చుట్టాం.. పాగా వేస్తాం



ఎల్‌బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి శుక్రవారం భారీ ర్యాలీతో తరలివెళ్లి నామినేషన్‌ను దాఖలు చేశారు. బీజేపీ కార్యకర్తలు, అభిమానులతో విజయవాడ జాతీయ రహదారి హయత్‌నగర్ నుంచి కొత్తపేట వరకు జనసంద్రంగా మారింది. చింతలకుంట వద్ద బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ హాజరై కార్యకర్తలు, అభిమానుల్లో హుషారు నింపారు. – మన్సూరాబాద్

ఆలస్యంగా వచ్చానటా!



సమయానికి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకోలేకపోయిన భారత చైతన్య యువజన పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ అభ్యర్థి వి.చంద్రశేఖర్ గౌడ్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల దాటిన తర్వాత కార్యాలయానికి వచ్చారంటూ ఆయనను నామినేషన్ వేయకుండానే వెనక్కు పంపించారు. కాగా.. తాను 11 నుంచి 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోనే ఉన్నానని.. తన ముందు వచ్చిన వారి నామినేషన్లు తీసుకొని తనది పక్కన పెట్టారని చంద్రశేఖర్ గౌడ్ ఆరోపించారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. తాను 3 గంటలకు సమయం ముగుస్తుందనే విషయాన్ని 10 నిమిషాల ముందుగానే అనౌన్స్ చేయించానని రిటర్నింగ్ అధికారి వివరణ ఇచ్చారు. – రాజేంద్రనగర్


కూటి కోసం.. కూలి కోసం..



బడుగు జీవులకు, అడ్డా కూలీలకు ఎన్నికల ప్రచారాలు నిత్యం ఉపాధితో పాటు కడుపు నింపుతున్నాయి. బంజారాహిల్స్‌లోని ఉదయ్‌నగర్‌లో శుక్రవారం ఓ పార్టీ ప్రచారంలో భాగంగా అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. అందరూ ఒకేసారి మీదపడితే తమకు దొరుకుతుందో లేదోనన్న భయంతో కొంత మంది అక్కడికి చేరుకొని ఇలా అల్పాహారాన్ని పట్టుకెళ్లారు. తాము ఇంత తినేసి ఇంట్లో వాళ్లకు కూడా తీసుకెళ్తున్నామంటూ చెప్పారు.

– బంజారాహిల్స్

నాడు బల్దియా.. నేడు అసెంబ్లీ ప్రత్యర్థులు..



ముప్పిడి సీతారాంరెడ్డి (బీఆర్ఎస్)



కొడీ మహేందర్ (బీజేపీ)

గతంలో జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఒకే డివిజన్ నుంచి పోటీ పడిన బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల బరిలోనూ ప్రత్యర్థులుగా దిగారు. 2016 జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని జంగమ్మెట్ డివిజన్ నుంచి అప్పటి టీఆర్ఎస్ తరఫున ముప్పిడి సీతారాంరెడ్డి, బీజేపీ నుంచి కొడి మహేందర్‌లు పోటీ పడి ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో ముప్పిడి సీతారాంరెడ్డికి 5,934 ఓట్లు రాగా.. మహేందర్‌కు 5,359 ఓట్లు పోలయ్యాయి. ఆ ఇద్దరే ప్రస్తుతం చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నుంచి పోటీ పడుతున్నారు. – చాంద్రాయణగుట్ట

'కార్డు' లేనోళ్ల సంగతేంటి?



ఎలక్షన్ ఎజెండా..

బహుళ ప్రయోజనకారి తెల్ల రేషన్ కార్డు

- అధికార బీఆర్ఎస్ మేనిఫెస్టో అమలైతే..
- రేషన్ కార్డుపై సన్నబియ్యం.. రూ.5 లక్షల బీమా
- ఆరోగ్యశ్రీ కింద రూ.15 లక్షల వరకు చికిత్స
- గ్రేటర్‌లో 21.22 లక్షల కుటుంబాలకు ప్రయోజనం
- కార్డులేని మరో 10 లక్షల కుటుంబాల పరిస్థితేంటి?

గ్రేటర్ పరిధిలో రేషన్ కార్డులు ఇలా..

జిల్లా	రేషన్ కార్డులు	యూనిట్లు
హైదరాబాద్	6,39,631	23,64,956
రంగారెడ్డి	5,58,452	18,23,288
మేడ్చల్– మల్కాజిగిరి	5,23,959	17,18,464
వలస కుటుంబాలు	4 లక్షల వరకు (అంచనా)	4 లక్షల వరకు (అంచనా)

సాక్షి, సిటీబ్యూరో: మళ్లీ అధికారమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో తెల్లరేషన్ కార్డులకు మరింత ప్రాధాన్యం పెంచినట్లయింది. కేవలం పీడీఎస్ బియ్యానికే పరిమితం కాకుండా రేషన్ కార్డు బహుళ ప్రయోజనకారిగా తయారు కానుంది. అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధిస్తే కార్డుదారులకు పీడీఎస్ దొడ్డు బియ్యం బదులు సన్న బియ్యం, రైతు బీమా తరహాలో అర్హులైన పేద కుటుంబాలకు రూ.5 లక్షల బీమా హామీ అమలైతే హైదరాబాద్ మహానగర పరిధిలో సుమారు 21.22 లక్షల పేద కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అయితే.. మరో పది లక్షల పేద కుటుంబాలకు రేషన్ కార్డులు లేవు. మూడేళ్లుగా దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్ లాగిన్ కూడా నిలిచిపోయింది. అంతకు ముందు దరఖాస్తుల్లో కేవలం 40 శాతం పెండెన్సీ మాత్రమే క్లియర్ అయింది. మరోవైపు కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పులు, మార్పుల దరఖాస్తులకు అవకాశం ఉన్నప్పటికీ ఆమోద ప్రక్రియ ఆరేడేళ్ల నుంచి పెండింగ్‌లో మగ్గుతోంది. అసెంబ్లీ ఎన్నికలపై దీని ప్రభావం పడే అవకాశాలు లేకపోలేదు.

బీమాతో ధీమాగా..

అధికార బీఆర్ఎస్ ప్రకటించిన హామీతో పేద కుటుంబాలకు బీమా ధీమాగా మారనుంది. బీమా కోసం తెల్ల రేషన్ (ఆహార భద్రత) కార్డు అర్హత కార్డుగా మారనుంది. అర్హత గల కుటుంబాలకు రైతు బీమా తరహాలోనే.. ఎలాంటి మరణం సంభవించిన ఎల్ఐసీ ద్వారానే ద్వారా రూ.5 లక్షల బీమా ఆర్థిక సాయం వర్తింపజేయనుంది. మరణం సంభవించిన పది రోజుల్లో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల సాయం అందనుంది. ప్రభుత్వం అర్హులైన వారి పేరిట ప్రీమియం చెల్లించి బీమా వర్తింపజేసే విధంగా ఎల్ఐసీ ఒప్పందం కుదుర్చుకొనున్నది. ఈ నిబంధనలు పేద కుటుంబ సభ్యులకు బీమా వర్తింపును దూరం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాస్తవంగా బీమా నిబంధనల ప్రకారం 60 ఏళ్లలోపు వారే అర్హులు.

కార్డులు ఇలా

మహానగరంలో రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లో 22 లక్షలు ఉండగా అందులో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి రేషన్ పోర్టబిలిటీతో ఇక్కడే రేషన్ సరుకు డ్రా చేస్తున్న కుటుంబాలు నాలుగు లక్షల వరకు ఉండవచ్చని అంచనా. మొత్తమ్మీద కార్డుల్లో సుమారు 66 లక్షల సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది. బీమా నిబంధనలు అమలైతే తెల్ల రేషన్‌కార్డుదారుల్లో 60 దాటిన వారంతా బీమాకు అనర్హులే. కార్డు హోల్డర్ పేరిట బీమా వర్తింపజేస్తే.. మొత్తం కార్డు దారుల్లో 20 శాతం మంది పైగా అర్హత కోల్పోవడం ఖాయంగా కనిపిస్తోంది.

సన్నబియ్యం పంపిణీ..

బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రేషన్‌ కార్డుదారులకు సన్నబియ్యం అందనుంది. ప్రస్తుతం దొడ్డుబియ్యం పంపిణీ చేస్తున్నారు. కోవిడ్ సష్టించి ఆర్థిక సంక్షోభం కారణంగా గత మూడేళ్లుగా ఉచితంగా పీడీఎస్ బియ్యం పంపిణీ చేస్తున్నారు. కేంద్రం వాటాకు అదనంగా రాష్ట్రం వాటా కలిపి పంపిణీ చేస్తున్నారు. సాధారణంగా ప్రతి కార్డులోని యూనిట్‌కు ఆరుకిలోల చొప్పున కోటా ఉండగా కోవిడ్ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో కోటాను పెంచారు.

ఆరోగ్యశ్రీ వర్తింపు..

ఇప్పటికే ఆరోగ్యశ్రీ – ఆయుష్మాన్ భారత్ పథకం కింద అందించే ఉచిత చికిత్సలకు ఆహార భద్రత కార్డును కూడా చెల్లుబాటు చేస్తూ నిర్ణయం తీసుకోగా, తాజాగా ఆరోగ్యశ్రీ పథకం రూ. 15 లక్షల పెంపు హామీతో మరింత ఉపశమనం కలుగనుంది.

ఆగమేఘాల కమలం

బీజేపీ తుది జాబితాలో మార్పులు చేర్పులు

- ఉదయం జాబితా.. బీ ఫాంల అందజేత
- మధ్యాహ్నం నామినేషన్ల దాఖలుకు పరుగులు
- మేడ్చల్, కంటోన్మెంట్‌లకు మారిన అభ్యర్థులు
- శేరిలింగంపల్లికి రవికుమార్, చాంద్రాయణగుట్టకు మహేందర్
- నాంపల్లి స్థానానికి రాహుల్ చంద్ర..

సాక్షి, సిటీబ్యూరో: అధికార బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటనల నుంచి బీఫాంల జారీ.. నామినేషన్ల దాకా అంతా సజావుగా సాఫీగా సాగగా.. ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీల్లో చివరి క్షణం దాకా జాప్యం.. అభ్యర్థుల పేర్ల మార్పు వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. నామినేషన్ల దాఖలుకు శుక్రవారం చివరి రోజు కాగా గురువారం రాత్రి వరకు గ్రేటర్ పరిధిలో బీజేపీ 5 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. ఆగమేఘాలపై అభ్యర్థులను ఖరారు చేసి వారికి నేరుగా ఫోన్ ద్వారా సమాచారమిచ్చారని పార్టీ నేతలు పేర్కొన్నారు. తమకు ఫోన్లు వచ్చినట్లు పేర్కొన్న కొందరిలో శుక్రవారం ప్రకటించిన అధికారిక జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో కంగుతిన్నారు. మేడ్చల్ నియోజకవర్గానికి మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డిని ఖరారు చేసినట్లు సమాచారమిచ్చి.. ఆయన స్థానంలో అక్కడ ఏనుగు సుదర్శన్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో విక్రమ్‌రెడ్డి రెబెల్‌గా నామినేషన్ దాఖలు చేశారు. కంటోన్మెంట్‌లో తొలుత మాజీ పోలీస్ ఉన్నతాధికారి కృష్ణప్రసాద్ పేరు ఖరారైనట్లు చెప్పి.. తీరా జాబితాలో శ్రీగణేశ్ నారాయణ్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. చాంద్రాయణగుట్ట అభ్యర్థిగా తొలుత ప్రకటించిన సత్యనారాయణ అస్వస్థత దృష్ట్యా తాను పోటీ చేయలేనని తెలపడంతో ఆయన స్థానంలో మహేందర్‌కు టికెట్ కేటాయించారు. ఇక శేరిలింగంపల్లిలో రవికుమార్, నాంపల్లిలో రాహుల్‌చంద్రను అభ్యర్థులుగా ప్రకటించారు. మల్కాజిగిరి స్థానాన్ని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావుకు కేటాయించారు. ఈ నేపథ్యంలో టికెట్లు దక్కనివారు పార్టీ తీరుపై కారాలు మిరియాలు నూరుతుండగా.. టికెట్లు దక్కించుకున్న అభ్యర్థులు సమయం దగ్గరపడుతుండటంతో బీ ఫాంలతో ఆగమేఘాలపై నామినేషన్లు ఉరుకులు పరుగులతో సంబంధిత రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలకు చేరుకున్నారు.

ఎన్నికల పరిశీలకులు వీరే..

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో ఎన్నికల పరిశీలనకు కేంద్ర ఎన్నికల సంఘం 8 మంది ఐఏఎస్ అధికారులను సాధారణ పరిశీలకులుగా నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు.

అధికారులు, వారు పరిశీలించనున్న నియోజకవర్గాలు.. ఫోన్ నంబర్లు ఇలా..

- మలక్‌పేట్ – అంబర్ పేట్: యతీంద్ర ప్రసాద్ (81259 71984)
- చార్మినార్ – చాంద్రాయణ గుట్ట: సమీర్ వర్మ (81259 72478)
- ఖైరతాబాద్ – జూబ్లీహిల్స్: జె.జయకాంతన్ (81259 67488)
- సనత్‌నగర్ – నాంపల్లి : డా.అహ్మద్ ఇక్బాల్ (81259 72156)
- కార్వాన్ – గోషామహల్: కవిత రాము (81259 71991)
- యాకుత్‌పురా – బహదూర్‌పురా: దీపాంకర్ సిన్హా (81259 72009)
- సికింద్రాబాద్ – సికింద్రాబాద్ కంటోన్మెంట్: గాయత్రి కృష్ణన్ (81259 72486)
- ముషీరాబాద్: సచీంద్ర ప్రతాప్ సింగ్ (81259 72490)

సిటీ జామ్

రద్దీ వేళల్లో ఎక్కడిక్కడ ఆగిన ట్రాఫిక్

సాక్షి, సిటీబ్యూరో: దీపావళి ఎఫెక్ట్ నగర రహదారులపై శుక్రవారమే కనిపించింది. దీనికి తోడు 'ఎన్నికల ప్రభావం' కూడా ఉంది. వెరసీ.. నగరంలో ప్రధాన రహదారులపై వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. వీటి వేగం నత్తలతో పోటీ పటడంతో వాహన చోదకులకు నరకం కనిపించింది. అనేక ప్రాంతాల్లో రాత్రి 10 గంటల వరకు ఇదే పరిస్థితి నెలకొంది. దీపావళి నేపథ్యంలో రహదారులపై తాత్కాలిక బాణాసంచా దుకాణాలు వెలిశాయి. వీటితో పాటు ప్రమిదలు తదితరాలు విక్రయించే వారు కూడా ఫుట్‌పాత్‌లపై సరుకులు ఏర్పాటు చేసుకుని అమ్మకాలు చేపట్టారు. ఈ కారణంగా క్యారేజ్‌వేలు దుకాణాలు, చిరు వ్యాపారులతో నిండిపోయాయి. ఖరీదు చేయడానికి వచ్చినవారు అనివార్యంగా తమ వాహనాలను రోడ్లపైనే నిలపాల్సి వచ్చింది. ఈ ప్రభావం రహదారిపై ఉన్న ట్రాఫిక్‌పై పడింది. దీపావళి నేపథ్యంలో స్వీట్లు, డ్రైఫ్రూట్స్ పంచిపెట్టే ఆనవాయితీ ఉంది. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో ఈ పంపకాలన్నీ దాదాపు శుక్రవారమే పూర్తి చేశారు. వీటిని ఖరీదు చేయడానికి ఆయా దుకాణాల వద్ద వినియోగదారులకు బారులు తీరారు. వీరి వాహనాల కారణంగా ఆ రహదారులు ఇరుకై పోయాయి. దీనికి తోడు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అనేక చోట్ల ట్రాఫిక్ ఆగడం, అతి నెమ్మదిగా సాగడం తప్పలేదు. అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు ఆఖరి రోజు కావడంతో భారీ సంఖ్యలో దాఖలయ్యాయి. దీనికోసం రిటర్నింగ్ అధికారులుగా నియమితులైన రెవెన్యూ అధికారుల కార్యాలయాల వద్ద పోలీసులు '100 మీటర్ల' బారికేడింగ్ ఏర్పాటు చేశారు. దీంతో ఆయా రహదారులు కుంచించుకుపోయాయి. ఈ పరిణామాలకు తోడు నామినేషన్లు చేయడానికి వెళ్లే అభ్యర్థులు, వారి వెంట వచ్చే అనుచరులు, వాహనాలు తదితరాల నేపథ్యంలోనే ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. ఇవి చాలవన్నట్లు కొన్ని ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టడంతో భారీగా రద్దీ నెలకొంది.



బంజారాహిల్స్ రోడ్డు నెం-1లో ట్రాఫిక్‌జాం

ప్రచార పర్వం

సతీ సమేతంగా..




ఉప్పల్ నియోజకవర్గంలో సతీమణి రజిత పరమేశ్వర్ రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి – ఉప్పల్

భాయ్ సాబ్.. ఓట్ దో



ఎన్నికల ప్రచారంలో భాగంగా సింగాడికుంట బస్తీలో ముస్లింలను ఓటు అభ్యర్థిస్తున్న ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి – ఖైరతాబాద్

'తీగల' తోడుగా..



ఎల్‌బీనగర్ డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ ఆంజనేయ ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తీగల కృష్ణారెడ్డితో కలిసి రోడ్‌షోలో పాల్గొన్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి – ఎల్‌బీనగర్

ఆగురా భాయ్.. ఆకలైతోంది...



ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ శుక్రవారం ఉదయం ఉదయ్‌నగర్ చేరుకునే సరికి ఓ చోట అల్పాహారం కనిపించడంతో తన ఆకలిని తీర్చుకున్నారు. టిఫిన్ చేస్తూ స్థానికంగా ఉన్న మహిళలు, కార్యకర్తలతో కాసేపు ముచ్చటించారు. – బంజారాహిల్స్

హారతులిచ్చి..స్వాగతం పలికి..



చైతన్యపురి డివిజన్ ఇందిరానగర్‌లో సుధీర్‌రెడ్డికి మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు – చైతన్యపురి

బొట్టు పెట్టి చెబుతున్నా..నీకే ఓటు అన్నా..



ఉప్పల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి బొట్టు పెడుతున్న మహిళ – ఉప్పల్

పథకాలను గుర్తుంచుకోండి



చందానగర్ డివిజన్ శంకర్‌నగర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి గాంధీ – శేరిలింగంపల్లి

గరం..గరం మిర్చీ..



ఎన్నికల ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్‌రెడ్డి బాగ్ అంబర్‌పేట్‌లో బజ్జీలు తీస్తున్న దృశ్యం – అంబర్‌పేట

శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థి రవికుమార్ యాదవ్ ఆస్తులు రూ.151 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: శేరిలింగంపల్లి నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి మారబోయిన రవికుమార్ యాదవ్ స్థిరచరాస్తుల విలువ అక్షరాల రూ.151 కోట్లకు పైమాటే. అప్పు రూ.44 లక్షలు. రవి కుమార్‌కు ఉస్మాన్‌నగర్, వట్టినాగులపల్లిలో రూ.16.54 కోట్ల విలువైన వ్యవసాయ భూములున్నాయి. కొండాపూర్, గోపన్‌పల్లి ప్రాంతాల్లో రూ.94.84 కోట్ల విలువైన వ్యవసాయేతర స్థలాలున్నాయి. వీటితో పాటు కొండాపూర్, గోపన్‌పల్లి, ఉస్మాన్‌నగర్ ప్రాంతాల్లో రూ.40.47 కోట్ల విలువ గల నివాస భవనాలు ఉన్నాయి. పలు బ్యాంకులు, ఆర్థిక సంస్థల ఖాతాల్లో రూ.15 కోట్ల విలువైన చేసే బ్యాంకు ఫిక్స్‌డ్, టర్మ్ డిపాజిట్‌లు, బాండ్లు, షేర్లు, పాలసీలు ఉన్నాయి. యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్‌లో మాస్టర్ ఆఫ్ సైన్స్ (మార్కెటింగ్) పూర్తి చేసిన రవికుమార్‌పై గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌లో మూడు క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

పుష్కరం తర్వాత...

ఒకే కారులో వచ్చిన జంపన, సాద కేశవరెడ్డి



పన్నెండేళ్ల తర్వాత ఒకే కారులో కలిసి వస్తున్న సాద కేశవరెడ్డి, జంపన ప్రతాప్

కంటోన్మెంట్: ఆ ఇద్దరు నేతల మధ్య పుష్కరకాలంగా సత్సంబంధాలు లేవు... అలాగని శత్రువులేమీ కాదు కానీ రాజకీయంగా భిన్న ధ్రువాలుగా కొనసాగుతున్నారు.. పలు అంశాల్లోనూ ఆ ఇద్దరు నేతలు పరస్పర విరుద్ధ నిర్ణయాలు తీసుకున్న సందర్భాలు కోకొల్లలు... ప్రత్యక్షంగా గొడవలు పడిన సందర్భాలు లేకపోయినా.. వారిద్దరికీ పడదు అనే విషయం కంటోన్మెంట్ వాసులందరికీ తెలుసు.. అలాంటి నేతలు ఇద్దరు ఒక్కటయ్యారు.. ఒకే కారులో కలిసి ప్రయాణించారు.. బీజేపీ అభ్యర్థి శ్రీగణేష్ నామినేషన్ సందర్భంగా వారిరువురు కలిసి రావడంతో కంటోన్మెంట్ వాసులు ఆశ్చర్యానికి గురయ్యారు. వారే బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, సాద కేశవరెడ్డి. తొలినాళ్లలో ఒకే పార్టీలో కొనసాగిన వీరు 2010 తర్వాత వేర్వేరు వర్గాలుగా విడిపోయారు. అనూహ్యంగా రెండేళ్ల క్రితం బీజేపీలో చేరినప్పటికీ ఒకే వేదికపై కనిపించిన దాఖలాల్లేవు. ఈ నేపథ్యంలో శనివారం ఇద్దరూ కలిసి ఒకే కారులో రావడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. కేశవరెడ్డి కారు డ్రైవ్ చేస్తుండగా, ముందు సీట్లో ప్రతాప కూర్చుని ఒకే కారులో వెళుతున్న దృశ్యాన్ని పలువురు తమ కెమెరాల్లో బంధించారు.

ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తిచేసినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి హోటల్ తాజ్‌కృష్ణాలో ఎన్నికల కమిషన్ జిల్లాలకు నియమించిన పోలీస్, జనరల్ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు.పోలింగ్ పెరిగేందుకు తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా వివరించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య మాట్లాడుతూ, ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన బందోబస్తు చర్యలు తీసుకున్నామన్నారు.సమావేశంలో పోలీస్, జనరల్ వ్యయ పరిశీలకులు తదితరులు పాల్గొన్నారు

డబుల్ డెక్కర్.. ఫ్రీ రైడ్



- హుస్సేన్‌సాగర్ చుట్టూ డబుల్ డెక్కర్ పరుగులు
- సందర్శకులకు ఉచిత ప్రయాణ సదుపాయం
- ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల వేళ.. డబుల్‌డెక్కర్ రోడ్డెక్కింది. కొద్ది రోజులుగా హుస్సేన్‌సాగర్ చుట్టూ మూడు ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు పరుగులు తీస్తున్నాయి. సందర్శకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఈ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. గతేడాది ఫిబ్రవరిలో నిర్వహించిన అంతర్జాతీయ ఫార్ములా– ఈ పోటీల సందర్భంగా హెచ్ఎండీఏ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ బస్సులను కొనుగోలు చేసింది. ఒక్కో బస్సు రూ.2.5 కోట్ల చొప్పున 3 బస్సులను ప్రవేశపెట్టారు. కానీ చాలాకాలం వరకు ఈ బస్సులు పార్కింగ్‌కే పరిమితమయ్యాయి. నగరంలో వీటిని అందుబాటులోకి తెచ్చేందుకు పలు దఫాలుగా సర్వేలు నిర్వహించినప్పటికీ ఇప్పటి వరకు రూట్‌లను ఖరారు చేయలేదు. దీంతో పార్కింగ్‌కే పరిమితమైన ఈ బస్సులను ప్రస్తుతం సాగర్ చుట్టూ తిప్పుతున్నారు. సెక్రటేరియల్, అంబేడ్కర్ విగ్రహం, అమరుల స్మారకం ఏర్పాటు తర్వాత నెక్లెస్ రోడ్డుకు వచ్చే సందర్శకుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. నగరవాసులే కాకుండా వివిధ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు, విదేశీ పర్యాటకులు సైతం నెక్లెస్‌రోడ్డు, ట్యాంక్‌బండ్, పరిసరాలను సందర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ క్రమంలో సాగర్ చుట్టూ ఉన్న అన్ని ప్రాంతాలను సందర్శించేందుకు ఈ డబుల్ డెక్కర్ బస్సులు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి.

ఇదీ రూట్...

ప్రస్తుతం సాగర్ చుట్టూ మూడు బస్సులు కూడా తిరుగుతున్నాయి. సంజీవయ్యపార్కు, థ్రిల్‌సిటీ, లేక్‌ఫ్రంట్ పార్కు, జలవిహార్, నీరాకేఫ్, పీపుల్స్‌ప్లాజా, ఇందిరాగాంధీ, పీవీల విగ్రహాలు, అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం తదితర ప్రాంతాలను సందర్శించిన అనంతరం సెక్రటేరియట్‌కు వెళ్లవచ్చు. అక్కడి బస్సు దిగి కొద్ది సేపు అమరుల స్మారకాన్ని సందర్శించి తిరిగి బస్సుల్లోనే ట్యాంక్‌బండ్ వైపు వెళ్లవచ్చు. అనంతరం ఈ డబుల్ డెక్కర్ బస్సులు ట్యాంక్‌బండ్ మీదుగా తిరిగి సంజీవయ్య పార్కు వరకు చేరుకొంటాయి. బస్సు మొదటి అంతస్తులో కూర్చొని ఈ రూట్‌లో ప్రయాణం చేయడం గొప్ప అనుభూతినిస్తుంది.

ఇవీ వేళలు..

ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు డబుల్ డెక్కర్ బస్సుల్లో సాగర్ చుట్టూ విహరించవచ్చు. సాయంత్రం 5 గంటల నుంచే ఎక్కువ మంది ప్రయాణికులు డబుల్ డెక్కర్ సేవలను వినియోగించుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మరోవైపు శని, ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లోనూ డబుల్ డెక్కర్‌లకు డిమాండ్ కనిపిస్తోంది.


ప్రజా చైతన్యంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

పంజగుట్ట: తెలంగాణలో ప్రజాస్వామ్య జరిగిందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. పౌరులు చైతన్యమైనప్పుడే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో భారత్ బచావో ఆధ్వర్యంలో రూపొందించిన భూస్వామ్య అహంకారంతో ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలన కొనసాగిస్తున్న బిఆర్ఎస్, దానికి వెన్నుదన్నుగా నిలబడుతున్న ఫాసిస్టు బిజేపీ, రహస్య మిత్రుడైన ఎంఐఎంల కూటమిని ఓడిద్దాం పేరుతో రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారత్ బచావో జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్‌తో కలిసి మాట్లాడుతూ .. రెండుసార్లు సెంటిమెంట్‌తో గెలిచిన బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆగిపోతాయని ప్రచారం చేస్తుందన్నారు. ప్రజలు దానిని నమ్మరాదని, అంతకన్నా ఎక్కువ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్, ఎంఐఎం మూడు ఒక్కటే అని, ముగ్గురూ కలిసి నాటకం ఆడుతున్నారన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న జేఏసీలు రాష్ట్రం రాగానే నిశ్శబ్దమయ్యాయని దాంతో రాష్ట్రం వచ్చిన 10 సంవత్సరాల్లో పూర్తి విధ్వంసం జరిగిందన్నారు. పౌరహక్కుల సంఘం నేతలకు అపాయింట్‌మెంట్ ఇవ్వని ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. పదేళ్లలో ప్రజా సంఘాలను కలవకుండా ఇంట్లో ఉండి పాలన సాగించారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం ఉంటుందో ఉండదో కూడా తెలియడం లేదన్నారు. భారత్ బచావో తరపున ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు, భావితరాలకు మెరుగైన సమాజం అందించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో సోమయ్య, ముత్తయ్య, సత్యనారాయణ, రాంబాబు, రమేష్ బాబు, మచ్చర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భారీగా హెరాయిన్ పట్టివేత



- ఇద్దరు నిందితుల అరెస్టు..
- రూ.50 లక్షల విలువైన సరుకు స్వాధీనం

నాగోలు: రాజస్థాన్ నుంచి అక్రమంగా హెరాయిన్ తీసుకువచ్చి నగరంలో సరఫరా చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్లను నాగోలు పోలీసులు, ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ. 50 లక్షల విలువైన 70 గ్రాముల హెరాయిన్, రూ.1, 570 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుజరాత్‌కు చెందిన ట్యాంక్ పంకజ్ భాయ్ నగరంలోని అంబర్‌పేటలో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. రాజస్థాన్‌కు చెందిన ప్రజాపతి ముఖేష్ లక్ష్మణ్ జీ బాయ్ అలియస్ ముఖేష్ ప్రజపతి నగరంలోని అంబర్‌పేటలో నివాసం ఉంటూ మొబైల్ షాప్‌లో పనిచేస్తున్నాడు. వారిరువు బంధువులు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వీరు దేశంలోని వివిధ ప్రాంతాలను నుంచి వాటిని సేకరించి వినియోగించేవారు. ఈ నేపథ్యంలో తాము వినియోగించడమేగాక ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా వారు రాజస్థాన్‌కు వెళ్లి అక్కడ హెరాయిన్ సరఫరాదారుడిని సంప్రదించారు. అక్కడి నుంచి హెరాయిన్ తీసుకువచ్చి నగరంలో అవసరమైన వారికి విక్రయించేవారు. శుక్రవారం మధ్యాహ్నం వారు హెరాయిన్ సరఫరా చేసేందుకు వెళుతుండగా సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు, నాగోలు పోలీసులతో కలిసి నాగోలు చౌరస్తాలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 70 గ్రాముల హెరాయిన్, నగదు, సెల్‌ఫోన్లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అడుగడుగునా నిఘా


ఉదయ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని పరిశీలిస్తున్న స్టాటటిక్ సర్వైలెన్స్ అధికారి

బంజారాహిల్స్: ఎన్నికల వేళ మద్యం, నగదు పంపిణీని అరికట్టేందుకు ఎక్కడికక్కడ ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు పని చేస్తుండగా మరో వైపు స్టాటస్టిక్ సర్వైలెన్స్ టీమ్‌లు అభ్యర్థుల ప్రచారాన్ని అడుగడుగునా నిఘా పెడుతున్నాయి. పాదయాత్రలకు ఎంత మంది జనం వస్తున్నారు. ఎన్ని జెండాలు వాడుతున్నారు. ఎంత మందికి అల్పాహారం పెడుతున్నారు... ఎంత మందికి భోజనాలు పెడుతున్నారు. ఎన్ని మైక్‌సెట్లు వినియోగిస్తున్నారు అనే ప్రతి విషయాన్ని నమోదు చేస్తూ ఎప్పటికప్పుడు వ్యయ పరిశీలకులకు పంపిస్తున్నారు.

రాజ్యాధికారమే లక్ష్యం

హిమాయత్‌నగర్: తెలంగాణలో రాజ్యాధికారమే లక్ష్యంగా అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)గా ఏర్పడి 119 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసి చరిత్ర సృష్టించ బోతున్నామని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్ ప్రకటించారు. శుక్రవారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ అమర వీరుల ఆత్మ గౌరవం కోసం నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముస్లిం ఐక్యవేదిక జాతీయ గౌరవాధ్యక్షుడు మునీర్ అహ్మద్ షరీఫ్, నవరంగ్ పార్టీ తెలంగాణ ఇంచార్జి బాబర్ షేక్, వివిధ నియోజకవర్గాల అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్‌కాలనీవాసుల మద్దతు మరువలేనిది: మాగంటి

వెంగళరావునగర్: ప్రతి ఎన్నికల్లో తనను గెలిపించడానికి కాలనీవాసులు తెలియజేస్తున్న మద్దతు మరువలేనిదని బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ అన్నారు. మధురానగర్‌కాలనీలో శుక్రవారం కాలనీవాసులతో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో మాగంటి మాట్లాడుతూ కాలనీల్లోని ప్రతి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. తనను గెలిపిస్తే మరింతా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మరోసారి కూడా తనకు విజయం చేకూరుస్తారననే నమ్మకం తనకు ఏర్పడిందని చెప్పారు. కార్పొరేటర్ దేదీప్య విజయ్, కాలనీ నేతలు కోడె సాంబశివరావు, ఎన్.మనోహర్‌రావు, కమలాకర్‌రావు, సదాశివరెడ్డి, శ్యాంరావు, దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, సత్యనారాయణరాజు, గంగారెడ్డి, చిలకల వెంకటేశ్వరరావు, పవన్ ముదిరాజ్, ఆంజనేయులు యాదవ్, కట్టా లక్ష్మి, నర్సింగరావు, విజయ తదితరులు పాల్గొన్నారు.


కాలనీవాసులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

ఖైరతాబాద్‌లో భారీగా నామినేషన్లు


ఖైరతాబాద్ బీఎస్పీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న మిద్దె కృష్ణ

బంజారాహిల్స్: ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి శుక్రవారం ఆఖరు రోజు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. బీఎస్పీ అభ్యర్థిగా మిద్దె కృష్ణ, ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా సుశీల్ లాల్ రాజ్ ప్రసాద్, గన సురక్షాపార్టీ అభ్యర్థిగా డాక్టర్ అమన్‌ప్రీత్ సింగ్ అలగ్, రాష్ట్రీయ జనమోర్చా పార్టీ అభ్యర్థిగా తాజుద్దీన్, యుగతులసి పార్టీ అభ్యర్థిగా డి.నాగరాజు, నేషనలిస్టు జనశక్తి పార్టీ అభ్యర్థిగా సుంకోజు కొత్తపల్లి ఆనంద్ చక్రపాణి చారి, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా దుగ్గిరాల నాగేశ్వర్ రావు, స్వతంత్ర్య అభ్యర్థులుగా మహ్మద్ మాజిద్, పురం వెంకటేశం, అక్షయ్ రఘురామ్, పాశం మధుకర్ యాదవ్, కొడిమెల రమేష్, డి.నాగరాజు, గౌలికార్ అమృతరాజ్, కాటేపల్లి భూదేవి, అబ్దుల్ హమీద్, స్వర్ణకుమారి, సయ్యద్ ఫౌజియా బేగం తదితరులు నామినేషన్ దాఖలు చేశారు.

అభివృద్ధి దానంతోనే సాధ్యం


మసీదు వద్ద ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సంగీత

పంజగుట్ట: ప్రభుత్వ సంక్షేమ పథకాలు యధావిధిగా కొనసాగాలంటే తిరిగి దానం నాగేందర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం బీఎస్ మక్తాలోని సుభానీ మసీదు, హరిగేట్ మసీదు వద్ద ప్రార్థనలకు వచ్చే ముస్లిలకు బీఆర్ఎస్ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేసి దానం నాగేందర్‌కు ఓటు వేయాలని కోరారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక


దానం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

పంజగుట్ట: తాము చేసిన అభివృద్ధిని చూసే యువకులు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఖైరతాబాద్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ప్రేమ్‌నగర్ నుంచి పెద్ద ఎత్తున యువత దానం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఖైరతాబాద్ ప్రజలకు మరోమారు సేవచేసుకునే అవకాశం కల్పించాలని దానం విజ్ఞప్తి చేశారు.

జేహెచ్‌పీఎస్‌లో సందడిగా దీపావళి



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం దీపావళి పర్వదిన వేడుకలను విద్యార్థులు కనుల పండువగా నిర్వహించారు. దీపావళి విశేషాలను తెలియజేసే పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. తమ ఆట, పాటలతో పండుగ ప్రాశస్త్యాన్ని, పండుగ జరుపుకునే విధానాన్ని కళ్లకు కట్టారు. దీపావళి రోజున పటాకులు కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా నాటికల ద్వారా తెలియజేశారు. స్కూల్ చైర్మన్ ఎ.శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ... బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, సురక్షితమైన, పర్యావరణ దీపావళి జరుపుకోవాలన్నారు. స్కూల్ సీనియర్ ప్రిన్సిపాల్ ఎం. వరలక్ష్మి, ప్రిన్సిపాల్ కాంచనవల్లి పాల్గొన్నారు.







బంజారాహిల్స్ రోడ్ నెం. 11 ఉదయ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారంలో ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

దానం ప్రచారం.. అభివృద్ధి మంత్రం

- ఓటర్లను ఆకట్టుకునేలా నాగేందర్ ప్రసంగాలు
- అభివృద్ధిని వివరిస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే
- తనను గెలిపిస్తే అభివృద్ధిని మరింత పరుగులు పట్టిస్తానని హామీ

బంజారాహిల్స్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ శుక్రవారం శుక్రవారం బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్ బస్తీ, ఉదయ్‌నగర్‌లో, వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని దేవరకొండ బస్తీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత బస్తీల్లో చేసిన అభివృద్ధి పనులను గుర్తుచేస్తూ బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రతి ఒక్కరికీ అందజేశారు. వచ్చే నెల 5 తర్వాత సంక్షేమ పథకాల పంపిణీ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకం కింద వేలాది చెక్కులు తన వద్ద సిద్ధంగా ఉన్నాయని ఎన్నికల కోడ్ వల్ల ఇవ్వలేకపోతున్నానని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల కేటాయింపు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, మాజీ కార్పొరేటర్ బి. భారతి నాయక్, డివిజన్ అధ్యక్షుడు సి. రాములు చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్ అభ్యర్థి


దేవరకొండ బస్తీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ భారతి నాయక్

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు...

ఫిలింనగర్‌కు చెందిన మానిక్ చౌదరి ఆధ్వర్యంలో వందలాది మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు వేసిన అనంతరం మాట్లాడుతూ... ఫిలింనగర్ బస్తీల్లో కోట్లాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. ఒకప్పుడు ఏ వీధి చూసినా మురుగుతో ఇబ్బందులు ఉండేవని ఇప్పుడు ఆ సమస్య తీరిందని సీసీ రోడ్లు కూడా చక్కగా వేశామన్నారు. ఎన్నికలు అనగానే రకరకాల పార్టీలు జెండాలు పట్టుకొని వస్తుంటాయని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని లేకపోతే మనల్ని మనమే మోసం చేసుకున్నట్లు అవుతుందన్నారు. బీఆర్ఎస్ నేత మామిడి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.


జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న ఫిలింనగర్ నేతులు

దీపావళి సంబరాల్లో నటి మంచు లక్ష్మి



బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో సినీ నటి, టీచ్‌ఫర్ ఛేంజ్ ఎన్జీవో సహ వ్యవస్థాపకులు లక్ష్మీ మంచు దీపావళి వేడుకలను ఫిలింనగర్‌లోని తన నివాసంలో ఘనంగా జరుపుకొన్నారు. దీపావళి థీమ్‌తో ఇంటిని సుందరంగా అలంకరించారు. ఇందులో భాగంగానే తెలంగాణ జిల్లాల్లోని నిరుపేద పిల్లలను ఆమె తన ఇంటికి తీసుకొచ్చి ఈ వేడుకలను జరిపారు. వారితో కలిసి ఆడిపాడారు. సహపంక్తి భోజనం చేసిన అనంతరం ఆమె విద్యార్థులకు దీపావళి బహుమతులను పంచిపెట్టారు.

బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం ఖాయం


పార్టీలో చేరిన మహిళలతో కార్పొరేటర్

హిమాయత్‌నగర్: ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్ గౌడ్ స్పష్టం చేశారు. గాంధీ కుటీర్ బస్తీకి చెందిన కాంగ్రెస్ నాయకురాలు ఆర్.స్వరూప నేతృత్వంలో పలువురు మహిళలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం నారాయణగూడలోని క్యాంప్ కార్యాలయంలో మహాలక్ష్మి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సీత, అంజమ్మ, శాంత, లక్ష్మి, సుశీల, మాధవి, లక్ష్మీబాయి, కల్యాణి, అనురాధ, పింకి, వనజ, దుర్గ ఉన్నారు. బీఆర్ఎస్ నాయకులు జి.రామన్ గౌడ్, అనీష్, జక్కి, జైస్వాల్, మల్లేశ్ పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు మంచి బుద్ధిని ప్రసాదించాలి: దానం


కల్యాణోత్సవంలో పాల్గొన్న ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం

వెంకటేశ్వరకాలనీ: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి కొలువుదీరాలని ముఖ్యమంత్రి కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయాలని, ప్రతిపక్షాలకు దేవుడు మంచి బుద్ధిని ప్రసాదించాలని ఖైరతాబాద్‌లో తాను మరోసారి ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ బంజారాహిల్స్‌లోని తన నివాసంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అత్యంత వైభవంగా జరిగిన ఈ క్రతువును అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు.

బీఆర్ఎస్‌కే మద్దతు: ముదిరాజ్ విద్యావంతుల వేదిక

పంజగుట్ట: ఒక కులం అభివృద్ధి చెందాలంటే రాజకీయ ప్రాతినిధ్యం ఒక్కటే సరిపోదని, అభివృద్ధి, సంక్షేమం ఎంతో ముఖ్యమని తెలంగాణ వచ్చిన 10 సంవత్సరాల్లో ముదిరాజ్ కులస్థుల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని తెలంగాణ ముదిరాజ్ మహాసభ విద్యావంతుల వేదిక చైర్మన్ ప్రొఫెసర్ సి.హెచ్.దినేష్ కుమార్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో ముదిరాజ్ విద్యావంతుల వేదిక బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్, యువజన విభాగం ప్రధానకార్యదర్శి అల్లుడు జగన్ ముదిరాజ్‌లతో కలిసి మాట్లాడారు. ఎల్లవేళాలా బీఆర్ఎస్ ముదిరాజ్‌లకు అండగానే ఉందన్నారు. సమావేశంలో న్యాయవాది చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టీటీడీ ఎల్ఏసీ సభ్యుడిగా మోహన్



సాక్షి, సిటీ బ్యూరో: జూబ్లీహిల్స్, కరీంనగర్, హిమాయత్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయాల లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా మోహన్ ముళ్లపూడి నియమితులయ్యారు. ఆయన పలు సినిమాలకు నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా, ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ గౌరవ సెక్రటరీగా వ్యవహరించారు. జూబ్లీహిల్స్, హిమాయత్‌నగర్‌లోని టీటీడీ దేవాలయాల అభివృద్ధితో పాటు కరీంనగర్ లో నిర్మిస్తున్న నూతన ఆలయానికి సంబంధించిన పనులలో లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా మోహన్ బాధ్యతలను నిర్వహిస్తారు.

జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థిగా దీపక్‌రెడ్డి నామినేషన్


బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న దీపక్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్‌రెడ్డి భారీ ర్యాలీతో శుక్రవారం షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో తన నామినేషన్‌ను దాఖలు చేశారు. జనసేన నేత రాధారం రాజలింగం, బీజేపీ నేతలు అట్లూరి రామకృష్ణ, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ పాల్గొన్నారు.

ఎంఐఎం అభ్యర్థిగా రషీద్ ఫరాజుద్దీన్...

జూబ్లీహిల్స్ ఎంఐఎం అభ్యర్థిగా మహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్ నామినేషన్ దాఖలు చేశారు.

◆ ఇండియన్ ప్రజా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభ్యర్థిగా శుక్రవారం షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో తన నామినేషన్‌ను దాఖలు చేశారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న ఎంఐఎం అభ్యర్థి రషీద్ ఫరాజుద్దీన్


ఐపీసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

అన్ని రంగాల్లో విఫలమైన బీఆర్ఎస్

- పీజేఆర్ బిడ్డగా అందరూ ఆదరిస్తున్నారు
- ఎన్నికల్లో విజయం తథ్యం
- ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి

బంజారాహిల్స్: రైతుబంధును బీఆర్ఎస్ బంధుగా మార్చుకుని కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులకే ఇచ్చుకుంటున్నారని ఖైరతాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి వెంకటేశ్వరాకాలనీ డివిజన్‌లోని బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 10, సింగాడాబస్తీలో ప్రచారం నిర్వహించారు. స్థానికులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ... అధికారంలోకి రాగానే దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానన్న ప్రభుత్వం పేదల అసైన్డ్ భూములు లాక్కున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలు ఇళ్లు కట్టుకునేందుకు రూ. ఆరు లక్షలు ఇస్తానని హామీ ఇచ్చి ఒక్కరికి కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ఇప్పుడు ప్రజలను మోసం చేసేందుకు మరోమారు వస్తున్నారని వారిని నమ్మరాదని పిలుపునిచ్చారు. పేదలకు న్యాయం జరగాలంటే అది కేవలం కాంగ్రెస్ వల్లే అవుతుందన్నారు. పీజేఆర్ బిడ్డగా అందరూ ఎంతో అక్కున చేర్చుకుంటున్నారని, ఆయన పేరును నిలబెడతానని, నిత్యం ప్రజల్లోనే ఉండి ప్రజా సేవ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరుగ్యారెంటీల కరపత్రాన్ని ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలు డివిజన్ల అధ్యక్షులు కాంగ్రెస్ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

విజయారెడ్డికి మద్దతుగా ప్రచారం

బంజారాహిల్స్: ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డికి మద్దతుగా జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ నేత పి.మోహన్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ జరిగింది. విజయారెడ్డి ఘన విజయాన్ని ఆకాంక్షిస్తూ కార్యకర్తలు, నేతలు ఉత్సాహంగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ నుంచి ఈ ర్యాలీ ప్రారంభమైంది. దారి పొడవునా యువకులు పెద్ద సంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. పీజేఆర్ జిందాబాద్ నినాదాలతో ర్యాలీ దద్దరిల్లింది.


ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నేత మోహన్‌యాదవ్







సింగాడాకుంట బస్తీలో ప్రచారం నిర్వహిస్తున్న ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి

అందుబాటులోకి పంజగుట్ట వైకుంఠ మహాప్రస్థానం సేవలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 3లో ఫినిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన పంజగుట్ట వైకుంఠ మహాప్రస్థానం శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ శ్మశాన వాటికలో దహన సంస్కారాల నిమిత్తం స్నానపు గదులు, అస్థికలు భద్రపరిచేందుకు లాకర్లు, వాహన సదుపాయాలు అందుబాటులో ఉంచారు. అలాగే అంత్యక్రియలను దూర ప్రాంతాల్లో ఉండే బంధువులు మిత్రులు తిలకించేందుకు వీలుగా ప్రత్యక్ష ప్రసార (లైవ్ స్ట్రీమింగ్) సదుపాయాన్ని కూడా కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు ఫోన్: 98525 55555.

విషాహారం తిని నాలుగు పిల్లికూనల మృతి

బంజారాహిల్స్: మూడు రోజుల వ్యవధిలో విషాహారం తిని నాలుగు పిల్లి పిల్లలు మృతి చెందాయి. అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌పై సందేహాలు వ్యక్తం చేస్తూ ఓ వ్యక్తి జూబ్లీహిల్స్ పోలీసులు ఫిర్యాదు చేశారు. శ్రీనగర్‌కాలనీలోని స్టీల్ అండ్ మైన్స్ కాంప్లెక్స్‌లో నివసించే లలిత్ చిలుకూరి సినీ పరిశ్రమలో దర్శకుడిగా పనిచేస్తున్నారు. కాంప్లెక్స్‌లో ఈ నెల 5 నుంచి 8వ తేదీల మధ్య ఐదు పిల్లి పిల్లలు తీవ్రంగా అనారోగ్యం పాలయ్యాయి. నాలుగు పిల్లి పిల్లలు మృతి చెందగా ఒకటి ప్రాణాలతో బయటపడింది. కాంప్లెక్స్‌లో పనిచేసే వాచ్‌మెన్, సూపర్ వైజర్ పిల్లి పిల్లలకు విషం కలిపిన ఆహారం ఇచ్చి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ ఆయన జూబ్లీహిల్స్ పోలీసులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఐపీసీ 429 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

అంబులెన్సుల్లో బీఆర్ఎస్ డబ్బు, మద్యం తరలింపు

ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి అజయ్ ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: ఈ ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ కోసం బీఆర్ఎస్ నేతలు అంబులెన్సులను ఉపయోగిస్తున్నారని, రోగులు లేకుండానే అంబులెన్సులు సైరన్లు వేసుకుంటూ వెళ్తున్నాయని ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి అజయ్‌కుమార్ ఆరోపించారు. ఇంతకంటే అక్రమం ఇంకోటి లేదని దుయ్యబట్టారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ములుగు, తాండూరు, కొడంగల్‌లో రాత్రి సమయాల్లో అంబులెన్సులను అక్రమంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. అక్రమంగా సంపాదించిన డబ్బులతో ఓట్లు కొనుగోలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీని అక్రమాలు, అవినీతి పార్టీగా పేరు మార్చుకుంటే మంచిదని ఎద్దేవాచేశారు. పేద ప్రజలకు వైద్య సదుపాయాల కోసం ఉపయోగించాల్సిన అంబులెన్సులను కూడా అక్రమాలకు వినియోగించుకోవడం దురదృష్టకరమని, వెంటనే ఎన్నికల కమిషన్ ఈ విషయంపై దృష్టి సారించాలని అజయ్‌కుమార్ కోరారు.

అబద్ధాలాడటంలో కేసీఆర్ సిద్ధహస్తుడు: కాంగ్రెస్



సాక్షి, హైదరాబాద్: అబద్ధాలాడటంలో సీఎం కేసీఆర్ సిద్ధహస్తుడని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. నాడు చంద్రబాబు మంత్రి పదవి ఇవ్వలేదనే అక్కసుతో సెంటిమెంట్ వర్కవుట్ అవుతుందని తెలంగాణ పార్టీ పెట్టుకున్న దిక్కుమాలిన చరిత్ర ఆయనదని, ఆయన చెబు తున్న అబద్ధాలను నమ్మడానికి ప్రజలు అవివేకులు కాదని ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను వక్రీకరిస్తూ కేసీఆర్ మాట్లాడుతున్నారని, ఆయన దొంగ నాటకాలు ఆడినా ప్రజలు ఇక నమ్మబోరనే విషయాన్ని గ్రహించాలన్నారు.

ఇలాంటి సీఎం ఎక్కడా లేరు!

కేసీఆర్‌పై ఎక్స్ వేదికగా షర్మిల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సీఎం కేసీఆర్ అఫిడవిట్‌ను వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తప్పుపట్టారు. కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నట్టుగా సెంటు భూమి, సొంత కారు కూడా లేని ఇలాంటి సీఎం బహుశా దేశంలో ఎక్కడా లేరని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఎక్స్(ట్విట్టర్) వేదికగా ఆమె 'కేసీఆర్ హామీలు మోసం.. ఈ అఫిడవిట్ మెగా మోసం'అని మండిపడ్డారు. పదేళ్లుగా అందినకాడికి దోచుకున్న కేసీఆర్ అండ్ కో.. అఫిడవిట్‌లో చూపిస్తున్న ఆస్తులు చూసి జనం ముక్కు న వేలేసుకుంటున్నారని అన్నారు.

దళితద్రోహి అవార్డివ్వాలి

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దళితద్రోహి అవార్డును ప్రకటించాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కె.పుష్పలీల అన్నారు. దళితుల గురించి మాట్లాడే హక్కు కేసీఆర్‌కు లేదన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు.

ఎన్నో ట్విస్టులు.. ఎంతో కసరత్తు

ఎట్టకేలకు 118 స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు

- పొత్తులో భాగంగా ఒక సీటు సీపీఐకి
- మొత్తం నాలుగు జాబితాలు విడుదల చేసిన అధిష్టానం
- నాలుగైదు చోట్ల చివరి నిమిషంలో మార్పులు
- రెండు చోట్ల పోటీ చేస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్
- బీసీలకు 23 టికెట్లు.. అగ్రవర్ణాలకు 58



సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులు ఖరారయ్యారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను పొత్తులో భాగంగా కొత్తగూడెం స్థానాన్ని సీపీఐకి కేటాయించగా, మిగిలిన 118 స్థానాలకు నాలుగు జాబితాల్లో పార్టీ అధిష్టానం అభ్యర్థులను ప్రకటించింది. గత నెల 15వ తేదీన మొదటి జాబితాను ప్రకటించగా, దాదాపు 25 రోజుల కసరత్తు తర్వాత ఈనెల 9వ తేదీన నాలుగో జాబితాను ప్రకటించింది. పలు మార్పులు చేర్పులు, ట్విస్టులు, తర్జనభర్జనల తర్వాత అభ్యర్థుల ఎంపికను పూర్తి చేసింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కొడంగల్‌తో పాటు కామారెడ్డిలో పోటీ చేస్తున్నారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత జరుగుతున్న మూడో ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడు రెండుచోట్ల పోటీ చేయడం ఇదే తొలిసారి. మొదటి మూడు జాబితాలకు గాను నాలుగు సీట్లలో (వనపర్తి, బోథ్, పటాన్‌చెరు, నారాయణఖేడ్) అభ్యర్థులను మార్పు చేయగా, ఒకచోట (చేవెళ్ల) మాత్రం కొంత ఉత్కంఠ, తర్జనభర్జన తర్వాత తొలుత ప్రకటించిన అభ్యర్థికే బీ ఫాం మంజూరు చేసింది.

34 ఇస్తామని.. 23

ఈసారి బీసీ వర్గాలకు పెద్ద పీట వేస్తామని, 34 అసెంబ్లీ స్థానాలకు తగ్గకుండా టికెట్లు ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. తర్వాత 34 ఇవ్వడం సాధ్యం కావడం లేదని, 25 ఇస్తామని, సర్దుకోవాలని సూచించింది. బీఆర్ఎస్ నుంచి బీసీలకు 23 టికెట్లు ఇచ్చారని, ఆ పార్టీ కంటే ఒకటో, రెండో ఎక్కువే ఇస్తామని పేర్కొంది. కానీ చివరకు 23 టికెట్లతోనే సరిపెట్టింది. చివరి నిమిషంలో ఇద్దరు బీసీలను మార్చినా మళ్లీ బీసీలకే అవకాశమిచ్చింది. పటాన్‌చెరులో నీలం మధు ముదిరాజ్ స్థానంలో కాట శ్రీనివాస్‌గౌడ్, నారాయణఖేడ్‌లో సురేశ్ షెట్కార్ స్థానంలో సంజీవరెడ్డి (బీసీ)లకు చివరి క్షణంలో బీఫామ్‌లు ఇచ్చింది. ఇక అగ్రవర్ణాలకు అత్యధికంగా 58 చోట్ల టికెట్లు కేటాయించింది. ఇందులో రెడ్డి సామాజికవర్గానికి ఏకంగా 43, వెలమ కులస్తులకు 09, కమ్మ, బ్రాహ్మణ సామాజికవర్గాలకు మూడు చొప్పున అవకాశం కల్పించింది.

అనుబంధ సంఘాలకు ఒక్కటే

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 10కి మించి అనుబంధ సంఘాలున్నాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, విద్యార్థి, యువజన, మత్స్యకార, మహిళా విభాగాలు ఇందులో క్రియాశీలంగా పనిచేస్తున్నాయి. ఈ అనుబంధ సంఘాలకు రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న చాలామంది నేతలు ఈసారి టికెట్లు ఆశించారు. కానీ కేవలం మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా ముదిరాజ్‌కు మాత్రమే టికెట్ ఇచ్చారు. మరోవైపు ఒకరిద్దరు మినహాయించి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు కూడా పార్టీ మొండి చేయి చూపింది.

118 టికెట్లలో సామాజిక వర్గాల వారీ కేటాయింపులిలా..

ఓసీ: 58 (రెడ్డి-43, వెలమ-09, కమ్మ-03, బ్రాహ్మణ-03)
బీసీ 23: (మున్నూరుకాపు-05, యాదవ-04, గౌడ-04, ముదిరాజ్-03, ఆర్య మరాఠా, బొందిలి, చిట్టెపు రెడ్డి, వాల్మీకి, మేరు, పద్మశాలి, రజకులకు ఒక్కొక్కటి.)
ఎస్సీ: 19 (మాదిగ-10, మాల-09)
ఎస్టీ: 12 (లంబాడా-07, కోయ-04, గోండు-1)
ముస్లిం మైనార్టీ: 06

ఎవరి కోటా వారిదే..

టికెట్ల కేటాయింపులో రాష్ట్ర కాంగ్రెస్‌లోని అగ్రనేతలు తమ మార్కు చూపెట్టారు. చర్చోపచర్చలు, తీవ్ర కసరత్తుల అనంతరం పూర్తి చేసిన అభ్యర్థుల ఖరారు ప్రక్రియలో తమ సన్నిహితులు, అనుచరులకు టికెట్లు రాబట్టుకోవడంలో సఫలీకృతమయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తాండూరు, మెదక్, మల్కాజ్‌గిరి, అంబర్‌పేటలతో పాటు తెలుగుదేశం పార్టీ నుంచి తనతో కలిసి నడుస్తున్న మరో 10 మంది వరకు నాయకులకు టికెట్లు ఇప్పించుకోగలిగారు. ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోటాలో సూర్యాపేట, సికింద్రాబాద్, భువనగిరి, కోదాడ స్థానాల్లో టికెట్లు రాగా, మరో ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి జడ్చర్ల, జనగామ, మునుగోడు స్థానాల్లో, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క వైరా, మహేశ్వరం, రాజేంద్రనగర్, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ ఉడుంపట్టుపట్టి మరీ పటాన్‌చెరు, నారాయణఖేడ్‌లలో తమ వారికి టికెట్లు ఇప్పించుకున్నారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

రిజర్వుడు స్థానాల్లో సామాజిక కూర్పు

ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేసిన 31 (19 ఎస్సీ, 12 ఎస్టీ) నియోజకవర్గాలకు టికెట్లలో మాత్రం కాంగ్రెస్ పార్టీ పకడ్బందీగా సామాజిక కూర్పును చేసింది. 19 ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల్లో 10 చోట్ల మాదిగ సామాజిక వర్గానికి చెందిన నేతలకు, మరో 9 చోట్ల మాల వర్గానికి టికెట్లు కేటాయించింది. ఎస్టీ కోటాలో ఏడుగురు లంబాడాలకు, నలుగురు కోయ నేతలకు, ఒక గోండు సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి టికెట్లిచ్చింది.

కేసీఆర్‌ను ఫాంహౌస్‌కు పరిమితం చేద్దాం

కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్



కోదాడ: పదేళ్లుగా సచివాలయానికి రాకుండా ఫాంహౌస్ నుంచే పాలన సాగించిన సీఎం కె.చంద్రశేఖర్‌రావును డిసెంబర్ తరువాత శాశ్వతంగా ఫాంహౌస్‌కే పరిమితం చేద్దామని కర్ణాటక రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కోదాడలో నిర్వహించిన రోడ్ షో, రంగా థియేటర్ సెంటర్‌లో జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని చెప్పారు. దేశంలో అత్యంత అవినీతి ప్రభుత్వంగా పేరున్న కేసీఆర్ సర్కారును ఇంటికి పంపడానికి ప్రజలు నవంబర్ 30వ తేదీ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. 'డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ జన్మదినం. ఆ రోజు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఆమెకు పుట్టినరోజు కానుకగా ఇవ్వబోతున్నాం'అని పేర్కొన్నారు. 60 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు నేటికీ చెక్కు చెదరలేదని, సాగర్ ఆయకట్టు ప్రాంతంగా ఉన్న కోదాడకు రావడం, ఇక్కడ రైతులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారంటీలను టీఆర్ఎస్ నాయకులు వచ్చి చూడాలని సూచించారు. రూ.లక్షన్నర కోట్ల అప్పులు చేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజ్ మూడేళ్లకే కూలిపోవడానికి సిద్ధంగా ఉందన్నారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ కోట్లాది రూపాయలు దోచుకున్నారని శివకుమార్ ఆరోపించారు. జాతీయస్థాయిలో పేరున్న ఉత్తమ్‌ను హుజూర్‌నగర్‌లో, ఆయన సతీమణి పద్మావతిని కోదాడలో గెలిపించుకుంటే ఈ ప్రాంతం అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏపీ కాంగ్రెస్ నేతలు రఘువీరారెడ్డి, రుద్రరాజు, సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి, కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీది ఫెవికాల్ బంధం

కలిసి ఐటీ దాడులు చేయిస్తున్నాయి.. ప్రజలు కాంగ్రెస్‌కు గెలుపును గిఫ్ట్‌గా ఇవ్వనున్నారు: పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సాక్షిప్రతినిధి, ఖమ్మం: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ మధ్య ఫెవికాల్ బంధం ఉందని.. ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని తేలిపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐటీ దాడులకు దిగాయని మాజీ ఎంపీ, కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఖమ్మంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...తన పైనా, కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషుల ఇళ్లు, కంపెనీలపై 400 మంది ఐటీ సిబ్బంది దాడులు నిర్వహించారన్నారు. శుక్రవారం కూడా సోదాలు చేసినా వారికేమీ దొరకలేదని తెలిపారు. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్లకు ఫిర్యాదు చేశామని ఆయన చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రక్షిస్తున్నాయా అని అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణలోని కాంగ్రెస్ అభ్యర్థులు, శ్రేణులు, సానుభూతిపరుల ఇళ్లలోనే తనిఖీలు జరగడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోందన్నారు. తన అల్లుడిని ఇబ్బంది పెట్టి అరెస్ట్ చేస్తామని బెదిరించడమేకాక, ఖమ్మం రాఘవ కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలోని అకౌంటెంట్ జయప్రకాష్‌పై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, ఒంటి కాలిపై చైర్‌లో నిలబెట్టారని పొంగులేటి ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలు కాంగ్రెస్‌కు, ఇండియా కూటమికి మెయిన్ గిఫ్ట్ ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పొంగులేటి ఇంట్లో ముగిసిన ఐటీ సోదాలు

పలు కీలకపత్రాలు స్వాధీనం!

సాక్షి, హైదరాబాద్: ఖమ్మం జిల్లా పాలేరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇల్లు, కార్యాలయాల్లో ఆదాయపన్ను శాఖ అధికారుల సోదాలు శుక్రవారం ముగిశాయి. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లోని రాఘవ ప్రైడ్, బేగంపేటలోని కార్యాలయంతోపాటు జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-17లోని పొంగులేటి ఇల్లు, నందగిరి హిల్స్ వంశీరామ్‌జ్యోతి హిల్ రిడ్జ్‌లోని ఫ్లాట్, ఖమ్మంలోని ఇంట్లో గురువారం తెల్లవారుజాము నుంచి ఐటీ సోదాలు జరిగిన సంగతి తెలిసిందే. శుక్రవారం మధ్యాహ్నం వరకు సోదాలు నిర్వహించిన ఐటీ అధికారులు పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. సోదాల కోసం జూబ్లీహిల్స్‌లోని పొంగులేటి నివాసానికి చేరుకున్న ఐటీ అధికారులు ఓ గది తాళాల కోసం పలుమార్లు ఆయన కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. సెర్చ్ వారెంటు ఉన్నప్పటికీ స్పందించకపోవడంతో ఓ బెడ్‌రూం తాళాలు పగులగొట్టి కుటుంబసభ్యులు, పనిమనుషుల సమక్షంలో తనిఖీలు చేసినట్టు సమాచారం. ఆ గదిలో ఉన్న పలు కీలకపత్రాలను సైతం ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. రెండురోజుల సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఇతర వస్తువులను ఐటీ అధికారులు తీసుకెళ్లినట్టు సమాచారం.

కాంగ్రెస్ డిక్లరేషన్లన్నీ చిత్తు కాగితాలే

▶ మొదటి పేజీ తరువాయి

భావజాలానికి అనుగుణంగా, బీజేపీ కార్యాలయంలో కాంగ్రెస్ మైనారిటీ డిక్లరేషన్ తయారైందని, ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తి టీపీసీసీ అధ్యక్షుడిగా ఉండటం వల్లే ఈ తరహా ప్రతిపాదన వచ్చిందని పేర్కొన్నారు.

తెలంగాణలో అతి ఎక్కువ బడ్జెట్ కేటాయింపులు

మైనార్టీ సంక్షేమం విషయంలో దేశంలోనే అతి ఎక్కువ బడ్జెట్ కేటాయింపులు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని కేటీఆర్ తెలిపారు. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ పదేళ్ల కాలంలో మైనార్టీ సంక్షేమానికి చేసిన కేటాయింపులతో పోలిస్తే, తాము తొమ్మిదేళ్ల కాలంలోనే అంతకు 11 రెట్లు వెచ్చించామని చెప్పారు. తెలంగాణలో మైనార్టీ సంక్షేమానికి కేటాయింపులు రాబోయే రోజుల్లో రూ.5 వేల కోట్లకు చేరనుండగా, కాంగ్రెస్ డిక్లరేషన్‌లో రూ.4 వేల కోట్లే ఇస్తామనడం విడ్డూరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటికే ఇమామ్‌లు, మౌజంలకు రాబోయే రోజుల్లో రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్, గోషా మహల్, హుజూరాబాద్‌లో గెలిచి తీరుతామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో కాంగ్రెస్ బలహీన అభ్యర్థులను బరిలోకి దింపి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిందని ఆరోపించారు. బీఆర్ఎస్ వంద సీట్లు గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లో ఆర్థిక తీవ్రవాదం

కాంగ్రెస్ పార్టీలో అరాచక రాజకీయం, ఆర్థిక తీవ్రవాదం నడుస్తోందని, టికెట్లు అమ్ముకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత సంగిశెట్టి జగదీశ్ బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో ఇప్పటికే జరి గిన అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తామని, తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత మరిన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. మునుగోడు కాంగ్రెస్ నేత నక్క రవీందర్, నకిరేకల్ నాయకులు ప్రసన్నతోపాటు ముషీరాబాద్, జూబ్లీహిల్స్ నియోజక వర్గాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్య క్రమంలో మహమూద్ అలీ, ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి, దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను విమర్శించే హక్కు సిద్ధరామయ్యకు లేదు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నిజామాబాద్ నాగారం: తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్ది, న సీఎం కేసీఆర్‌ను విమర్శించే హక్కు కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం రాత్రి నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేసిన చరిత్ర కేసీఆర్‌ది అని, మేనిఫెస్టోలో చేర్చని హామీలను కూడా అమలు చేసి చూపించారని తెలిపారు. తెలంగాణ వంటి రాష్ట్రాలకు వచ్చే ముందు ఇక్కడి స్థితిగతులన్నింటినీ తెలుసుకొని రావాలని సిద్ధరామయ్యకు కవిత సూచించారు. బీసీలకు ఒక్క సీటు కేటాయించని నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవాచేశారు. ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేశారని కవిత విమర్శించారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్

బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ హామీ..

- ప్రత్యేకంగా సబ్‌ప్లాన్.. ఎంబీసీ మంత్రిత్వ శాఖ
- విద్యార్థులకు ర్యాంకుతో సంబంధం లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్
- ప్రతి మండలంలో వృత్తి బజార్ పేరుతో 50 దుకాణాల షాపింగ్ కాంప్లెక్స్
- బీసీ ఏ గ్రూప్‌లోకి ముదిరాజ్, ముత్రాసు, తెనుగోళ్లు
- జగిత్యాల, నారాయణపేట, భువనగిరిలలో మెగా పవర్‌లూం క్లస్టర్లు

సాక్షి, కామారెడ్డి: కులగణన, బీసీ కమిషన్ నివేదికల ఆధారంగా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ రిజర్వేషన్లను ప్రస్తుతమున్న 23శాతం నుంచి 42శాతానికి పెంచడం ద్వారా పంచాయతీలు, మున్సిపాలిటీలలో కొత్తగా 23,973 మంది బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తుందని తెలిపింది. శుక్రవారం కామారెడ్డిలో నిర్వహించిన సభలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ 'బీసీ డిక్లరేషన్'ను ప్రకటించగా.. ముఖ్య అతిథిగా హాజరైన కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అందులోని అంశాలను వివరించారు. డిక్లరేషన్‌లోని అంశాలివీ..

- ➤ మహాత్మా జ్యోతిరావు పూలే పేరిట బీసీ సబ్‌ప్లాన్‌కు అసెంబ్లీ తొలిసెషన్‌లోనే చట్టబద్ధత కల్పిస్తాం. బీసీ సంక్షేమానికి ఏటా రూ.20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు కేటాయిస్తాం.
- ➤ ఎంబీసీ కులాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఎంబీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు. అన్ని బీసీ కులాల సమగ్రాభివృద్ధి కోసం కార్పొరేషన్లు. బీసీ యువత ఉన్నత చదువుల కోసం, చిరు వ్యాపారాలు చేసుకునేందుకు రూ.10 లక్షల వరకు పూచీకత్తు లేని, వడ్డీలేని రుణాలు.
- ➤ అన్ని జిల్లా కేంద్రాల్లో రూ.50 కోట్లతో ఓ కన్వెన్షన్ హాల్, ప్రెస్ క్లబ్, స్టడీ సర్కిల్, లైబ్రరీ, క్యాంటీన్‌లతో కూడిన ప్రొఫెసర్ జయశంకర్ బీసీ ఐక్యతా భవనాల నిర్మాణం. బీసీ ఐక్యతా భవన్‌లోనే జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయం ఏర్పాటు.
- ➤ ప్రతి మండలంలో నవోదయ విద్యాలయాలతో సమానంగా బీసీలకు ఒక కొత్త గురుకులం. ప్రతి జిల్లాలో ఒక కొత్త డిగ్రీ కాలేజీ. రూ.3 లక్షల కంటే తక్కువ వార్షికాదాయం ఉన్న బీసీ విద్యార్థులకు ర్యాంకుతో సంబంధం లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్.
- ➤ వృత్తి బజార్ పేరుతో ప్రతి మండలంలో 50దుకాణాల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం. అందులో మంగలి, వడ్రంగి, చాకలి, కమ్మరి, స్వర్ణకారుల వంటి చేతివృత్తుల వారికి ఉచితంగా షాపులు పెట్టుకునే స్థలం.
- ➤ గీత కార్మికులు, చేనేతలకు ఉన్నట్టుగా 50ఏళ్ల వృద్ధాప్య పింఛన్ వయోపరిమితి అన్ని చేతివృత్తుల వారికి వర్తింపు. బీసీ కార్పొరేషన్లు, ఫెడరేషన్ల కింద నమోదైన ప్రతి సొసైటీకి ఎన్నికల నిర్వహణ, రూ.10 లక్షల ఆర్థిక సాయం.

కులాల వారీగా ప్రత్యేక పథకాలు, హామీలు

- ➤ జీవో నం.19/02/2009ను పునరుద్ధరించి.. ముదిరాజ్, ముత్రాసు, తెనుగోళ్లు తదితర కులా లను బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూపులోకి మార్చడం.
- ➤ గంగపుత్రులకు సంబంధించి మత్స్యకార హక్కులకు.. ఇతర మత్స్యకార సామాజిక వర్గాల మధ్య పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం. ఇందుకోసం తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డు ఏర్పాటు. ఆక్వాకల్చర్‌కు ప్రోత్సాహం. క్యాప్టివ్ సీడ్, నర్సరీలు, మార్కెటింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి ఏర్పాట్లు.
- ➤ గొల్లకురుమలకు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రెండో దశ గొర్రెల పంపిణీ.
- ➤ గౌడ్ కులస్తులకు ఈతచెట్ల పెంపకం కోసం ప్రతి గ్రామంలో ఐదెకరాల భూమి. ఈత మొక్కలు, బిందు సేద్యం, కాంపౌండ్ వాల్ నిర్మాణాలపై 90శాతం సబ్సిడీ. మద్యం దుకాణాల లైసెన్సుల్లో గౌడ్‌లకు ప్రస్తుతమున్న రిజర్వేషన్ 15శాతం నుంచి 25శాతానికి పెంపు. జనగామ జిల్లాకు సర్వాయి పాపన్నగౌడ్ జనగాం జిల్లాగా పేరు మార్పు.
- ➤ మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు సబ్సిడీ రుణాలు.
- ➤ పద్మశాలీలకు జగిత్యాల, నారాయణపేట, భువనగిరిలలో మెగా పవర్‌లూం క్లస్టర్ల ఏర్పాటు. పవర్‌లూమ్స్, పరికరాలపై 90 శాతం సబ్సిడీ.
- ➤ విశ్వకర్మలకు 90శాతం సబ్సిడీతో టూల్‌కిట్లు. పట్టణ ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు భూమి కేటాయింపు.
- ➤ రజక యువతకు పట్టణాల్లో లాండ్రోమెట్స్ ఏర్పాటు కోసం రూ.10 లక్షల ఆర్థిక సాయం. రాష్ట్రవ్యాప్తంగా ధోబీఘాట్ల ఆధునీకరణ కోసం ప్రతి జిల్లాకు రూ.10 కోట్లు కేటాయింపు.

అమలు 'గ్యారంటీ'

▶ మొదటి పేజీ తరువాయి

బహిరంగ సభ నిర్వహించి పార్టీ తరపున బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా సిద్ధరామయ్య, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ మిత్రపక్షాలు టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, నేత చాడ వెంకటరెడ్డి తదితరులు మాట్లాడారు. సభలో సిద్ధరామయ్య ప్రసంగం ఆయన మాటల్లోనే..

''కర్ణాటకలో మేం ఇచ్చిన ఐదు గ్యారంటీల్లో 4 గ్యారంటీలు 2 నెలలుగా అమలవుతూనే ఉన్నాయి. యువనిధి పథకాన్ని జనవరిలో మొదలుపెడుతున్నాం. మేం ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అన్ని పథకాలను అమలు చేస్తుంటే ఇక్కడి సీఎం అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. మేం అమలు చేస్తున్న పథకాలు నిజమో కాదో తెలుసుకునేందుకు రమ్మని పిలిస్తే ముఖం చాటేస్తున్నారు.

కేసీఆర్‌కు గుణపాఠం తప్పదు

తెలంగాణలో కేసీఆర్ గొప్పలు చెప్పడం తప్ప చేసిందేమీలేదు. బీసీలకు 34శాతంగా ఉన్న రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించిన ఘనత కేసీఆర్‌కే దక్కింది. సీఎం కేసీఆర్‌కు అవినీతి డబ్బులతో ఎన్నికలకు వెళ్లడం అలవాటు. ఈసారి ఆయన ప్రయత్నాలు ఫలించవు. ప్రజలు ఆయనకు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. కామారెడ్డిలో ప్రజల స్పందన చూస్తుంటే కేసీఆర్ ఓడిపోవడం ఖాయమని తేలిపోతోంది. ప్రజలు 30వ తేదీ కోసం ఎదురుచూస్తున్నారు.

మోదీ ప్రచారం చేసినా బీజేపీ ఓడింది

తెలంగాణలో బీజేపీ నాలుగైదు సీట్లు గెలిస్తే ఎక్కువ. మెజారిటీ స్థానాల్లో డిపాజిట్లు కూడా రావు. కర్ణాటకలో ప్రధాని మోదీ 48 రోడ్‌షోలు, సభల్లో పాల్గొన్నారు. ఆయన సభలు జరిపిన చోటల్లా కాంగ్రెస్ ఎక్కువ మెజారిటీతో గెలిచింది. మోదీకి అక్కడి ఓటర్లు బుద్ధి చెప్పారు. తెలంగాణ ప్రజల చెవుల్లో పూలు పెట్టడానికి ప్రయత్నిస్తున్న మోదీకి ఇక్కడి ప్రజలు కూడా బుద్ధి చెప్తారు. బీజేపీ, బీఆర్ఎస్ వేరు కాదు. బీజేపీకి బీఆర్ఎస్ బీ టీంగా పని చేస్తోంది. దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే. తెలంగాణలో బీసీ డిక్లరేషన్ కచ్చితంగా అమలు చేసి తీరుతాం. కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలి..'' అని సిద్ధరామయ్య పిలుపునిచ్చారు.



కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ సభకు హాజరైన జనం

ద్రోహులను పక్కన పెట్టుకుని నీతులా?: రేవంత్

ఎమ్మెల్యేల కొనుగోళ్ల మీద కేసీఆర్ మాట్లాడటమంటే వంద ఎలుకలను తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయినట్టుందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దివంగత సీఎం వైఎస్సార్‌తోపాటు మరెందరో సీఎంలు రోజూ ప్రజల సమస్యలు వినేందుకు దర్బార్ నిర్వహించేవారని, సీఎం కేసీఆర్ పదేళ్లలో ఒక్కనాడూ ప్రజల కష్టాలు విన్న పాపాన పోలేదని మండిపడ్డారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఆ వివరాలు రేవంత్ మాటల్లోనే..

''ఎమ్మెల్యేను యాభై లక్షలకు కొంటూ రేవంత్ దొరికిండని అంటున్న కేసీఆరే తెలంగాణను కొనుగోళ్లు, అమ్మకాలకు కేంద్రంగా మార్చారు. 40 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, 12 మంది ఎమ్మెల్సీలు, వందలాది మంది ఎంపీపీలు, జెడ్పీటీసీలను కొనుగోలు చేసిండు. ఎమ్మెల్యేల కొనుగోళ్ల మీద సీబీఐ విచారణకు నేను సిద్ధం.. నువ్వు సిద్ధమా? సిద్ధమైతే 24 గంటల్లో సీబీఐకి లేఖ రాయాలి.

అమ్మ పుట్టిన ప్రాంతమని గుర్తుకు రాలేదా?

కామారెడ్డి ప్రాంతానికి చెందిన రైతు లింబయ్య 2017లో తన కష్టాన్ని చెప్పుకోవాలని వచ్చి, సీఎం అవకాశం ఇవ్వలేదన్న ఆవేదనతో సెక్రటేరియట్ ఎదురుగా ఉరివేసుకుని చనిపోయినపుడు.. ఇదే ప్రాంతానికి చెందిన బీరయ్య అనే రైతు వడ్ల కుప్ప మీద చనిపోయినపుడు.. సీఎం కేసీఆర్‌కు కామారెడ్డి తన తల్లి పుట్టిన ప్రాంతమని గుర్తుకురాలేదా? ఇప్పుడు గజ్వేల్ ప్రజలు నమ్మే స్థితిలో లేక కామారెడ్డికి వచ్చి పోటీ చేస్తున్నప్పుడు గుర్తుకువచ్చిందా? కామారెడ్డి ప్రజలు తెలంగాణ భవిష్యత్తును నిర్ణయించబోతున్నారు. మీ తీర్పు కోసం దేశ, విదేశాల్లో ఎదురు చూస్తున్నారు. కేసీఆర్‌ను ఓడించేందుకే నేను కామారెడ్డి వచ్చా.

భూములు కొల్లగొట్టేందుకు వస్తున్నారు

కామారెడ్డిని బంగారు తునక జేస్తనంటున్న కేసీఆర్ గజ్వేల్‌కు ఏం చేశారు. అక్కడి ప్రజలను ముంచి, రోడ్డున పడేసి ఇప్పుడు కామారెడ్డి మీద కన్నేశారు. ఈ ప్రాంతంలో వేల ఎకరాల భూములను కొల్లగొట్టేందుకు వస్తున్నారు. మాస్టర్ ప్లాన్ పేరుతో కుట్ర చేశారు. రైతులు తిరగబడటంతో మాస్టర్ ప్లాన్ రద్దు చేసినట్టు ఆయన కొడుకు కేటీఆర్ చెప్తున్నారు. వారి మాటలు నమ్మవద్దు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. రూ.2 లక్షల దాకా రైతుల రుణాలు మాఫీ చేస్తాం. ఆరు గ్యారంటీలను, బీసీ డిక్లరేషన్‌ను పక్కాగా అమలు చేస్తాం.'' అని రేవంత్ ప్రకటించారు. కాగా తెలంగాణలో కాంగ్రెస్ గాలిని జూసి సీఎం కేసీఆర్‌కు భయం పట్టుకుందని సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు.

రేవంత్‌కు 'కోనాపూర్'నామినేషన్ డబ్బులు

కామారెడ్డి నుంచి పోటీచేస్తున్న రేవంత్‌రెడ్డి నామినేషన్ కోసం కేసీఆర్ పూర్వీకుల గ్రామమైన కోనాపూర్ వాసులు డబ్బును అందజేశారు. కేసీఆర్‌కు పదేళ్లుగా కోనాపూర్ గుర్తుకురాలేదని, ఇప్పుడు ఓట్ల కోసం తమ ఊరి పేరు వాడుకుంటున్నారని వారు విమర్శించారు. కాగా సభలో కర్నాటక సీఎం సిద్ధరామయ్య కన్నడ భాషలో ప్రసంగించగా.. కాంగ్రెస్ నేతలు తెలుగులోకి అనువాదం చేశారు. ఇది చాలా నిదానంగా సాగడంతో సభకు హాజరైనవారిలో నిరాశ కనిపించింది. సభలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, సీనియర్ నేతలు పొన్నం ప్రభాకర్, షబ్బీర్ అలీ, మధుయాష్కీగౌడ్, సుదర్శన్‌రెడ్డి, మదన్‌మోహన్, ఆది శ్రీనివాస్, అరికెల నర్సారెడ్డి, వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు గుణపాఠం తప్పదు: నారాయణ

తెలంగాణ ప్రజలను అనేక రకాలుగా మోసగించిన సీఎం కేసీఆర్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. కేసీఆర్ తెలంగాణ ద్రోహులు, వ్యతిరేకులను చంకనెత్తుకుని ఊరేగుతున్నారని మండిపడ్డారు. కాగా.. ఉమ్మడి రాష్ట్రంలో సీఎం వైఎస్సార్ ప్రజల సమస్యలు వినేందుకు రోజూ ప్రజా దర్బార్ నిర్వహించేవారని.. ఈ పదేళ్లలో ఒక్కరోజు కూడా ప్రజలు సీఎంను కలిసే అవకాశం దొరకలేదని సీపీఐ నాయకుడు చాడ వెంకటరెడ్డి విమర్శించారు.

ప్రశ్నించే గొంతులను నొక్కేశారు: కోదండరాం

ఎన్నెన్నో పోరాటాలు, ప్రాణత్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని, ప్రశ్నించేవారి గొంతులను నొక్కేస్తున్నారని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాల భర్తీ లేదని, పరీక్షలు కూడా సరిగ్గా నిర్వహించలేకపోయారని ఆరోపించారు. ఈ అన్యాయాలు చూస్తుంటే గుండెలు మండుతున్నాయన్నారు. కామారెడ్డి ప్రజలు ఓటుతో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

బంతి ప్రకృతి బహుమతి

వేడుక వచ్చిందంటే చాలు బంతిపూల తోరణాలతో ఇళ్లూ వాకిళ్లు కళకళలాడుతూ ఉంటాయి. బంతిపూలకు మాత్రమే ఈ ప్రత్యేకత ఉంది. అందానికి, ఆరోగ్యానికి మేలు చేసే బంతిని మనకు ప్రకృతి ఇచ్చిన బహుమతిగా చెప్పచ్చు.

తెల్లవారుజామున సూర్యుడు ఉదయించగానే భూమిలోని చీకట్లు తొలగి వెలుగు రేకలు అంతటా వ్యాపిస్తాయి. అదేవిధంగా, బంతిపువ్వును చూడగానే, మన మనస్సు తన బాధలను మరచిపోయి సంతోషిస్తుంది. ఈ సారూప్యత వల్ల బంతిపువ్వును సూర్యభగవానుడికి చిహ్నంగా చెప్పుకోవచ్చు. గణేష్ చతుర్థి, నవరాత్రుల నుండి దీపావళి వరకు ఈ పూలకు చాలా డిమాండ్ ఉంది. మ్యారిగోల్డ్ శాస్త్రీయ నామం టాగెట్స్. భారతదేశానికి 350 సంవత్సరాల క్రితం పోర్చుగీసు వారి రాకతో మెక్సికో నుండి చేరుకుంది బంతి. చాలా అందంగా కనిపించే పసుపు, కుంకుమ రంగులో ఉండే ఈ పువ్వులను అందరూ ఇష్టపడతారు.

విస్తారంగా సాగు..

మన దేశంలో బంతిపూల సాగు పెద్ద ఎత్తున చేస్తుంటారు రైతులు, ఇది మతపరమైన ఆచారాలతో పాటు, అనేక ఉత్పత్తుల తయారీలలో కూడా ఉపయోగపడుతుంది. సీజన్‌ను బట్టి బంతి పువ్వులను సాగు చేస్తారు. ఇది ఏప్రిల్, మే నెలల్లో సాగును ప్రారంభిస్తే ఆగస్టు–సెప్టెంబర్‌లలో చలికాలం ప్రారంభమవడానికి ముందు పంట చేతికొస్తుంది.

ఈ రాష్ట్రాల్లో ఎక్కువ

ప్రపంచవ్యాప్తంగా 50 రకాల బంతి పువ్వులు ఉన్నాయి, వాటిలో మూడు జాతులు వాణిజ్య, వ్యవసాయం కోసం పెరుగుతాయి. ఉత్తరప్రదేశ్, హర్యానా, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల పొలాలు బంతి పువ్వులతో వెలిగిపోతుంటాయి.

త్యాగానికి పేరు

బంతి పువ్వు బృహస్పతికి ఇష్టమైనదిగా జ్యోతిష్యులు చెబుతుంటారు. దేవతల గురువు బృహస్పతిని బంతి పువ్వులతో పూజిస్తే జ్ఞానం పెంపొందుతుందని నమ్మకం. పసుపు–కుంకుమపువ్వును కలిపినట్టుగా ఉండే ఈ రంగు త్యాగానికి ప్రసిద్ధి చెందింది, మరోవైపు ఇది అగ్ని వంటి ఉగ్రమైన వ్యక్తిత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది.

ప్రజల మొదటి ఎంపిక

ప్రజలు తమ ఇళ్లను బంతి పువ్వులతో అలంకరిస్తారు. కోల్‌కతా నుంచి వచ్చే బంతిపూలలో ఒకటి ఎరుపు, మరొకటి పసుపు. ఈ రంగు పువ్వులను బసంతి మేరిగోల్డ్ అంటారు. ఇదే అన్ని చోట్ల జనం మొదటి ఎంపికగా ఎంచుకుంటున్నారు.

మేలుబంతి

బొబ్బలు, కాలిన గాయాలు, దురదలు, చర్మవ్యాధుల నివారణలో బంతి పువ్వులను ఉపయోగిస్తారని ఆయుర్వేదంలో ఉంది. ఇందులో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు రక్తకణాలను ఉత్పత్తి చేసి చర్మాన్ని మృదువుగా, ఆరోగ్యంగా మార్చగలవు. బంతి పువ్వులు వాపునే కాదు అలసటను తగ్గించడానికి కషాయంలా కూడా ఉపయోగిస్తారు. బంతి పువ్వు పొడి ముడతలు పడిన చర్మాన్ని మృదువుగా చేయడంలో కూడా సహాయపడుతుంది. బంతి పువ్వులు సహజ యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి కాలుష్యం నుండి చర్మాన్ని కాపాడతాయి.

అందమైన ప్రయోజనాలు

బంతిపూలు యాంటీ బయోటిక్, యాంటీ ఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. మేరిగోల్డ్ ఫేస్‌ప్యాక్ ముఖ చర్మాన్ని బిగుతుగా చేయడంతో పాటు చర్మ కాంతిని పెంచడంలో ప్రభావవంతంగా పని చేస్తుంది. మొటిమలు, ముఖంపై మచ్చలు ఉన్న వారు బంతి పువ్వు ఫేస్ ప్యాక్‌ని ఉపయోగించవచ్చు. అందుకే, సౌందర్య ఉత్పత్తులు, మసాజ్ నూనెలు, లోషన్లు, సబ్బులు.. మొదలైన ఉత్పత్తులలో బంతిపువ్వులను ఉపయోగిస్తారు. దీని ఉపయోగం శరీరానికి చల్లదనాన్ని అందిస్తుంది. దీన్ని నొప్పి, వాపును తగ్గించడానికి, పేగు, కడుపు రుగ్మతల నుండి ఉపశమనానికి, అల్సర్లను నయం చేయడానికి కూడా ఉపయోగిస్తారు.

ఫస్ట్ టైమ్





అనూష షా...

విల్ పవర్ ఉన్న సివిల్ ఇంజనీర్

'నా వృత్తిలో నేను రాణిస్తే చాలు. అదే పదివేలు' అని సంతృప్తి పడి, సర్దుకుపోయేవాళ్లే ఎక్కువ మంది కనిపిస్తారు.

'నా వృత్తి వల్ల పర్యావరణానికి ఏ మేరకు హాని జరుగుతోంది?' అని ఆలోచించేవాళ్లు అరుదుగా కనిపిస్తారు.

అలాంటి అరుదైన వ్యక్తి... అనూష షా.

పచ్చటి ప్రకృతి ప్రపంచంలో పుట్టి పెరిగిన అనూషకు పర్యావరణ విలువ తెలుసు.

సివిల్ ఇంజనీర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్న అనూష వృత్తి విజయాలను చూసి పొంగిపోవడం కంటే వృత్తికి సామాజిక బాధ్యతను జోడించడానికే అధిక ప్రాధాన్యత ఇచ్చింది. తన వంతుగా వివిధ వేదికలపై పర్యావరణ హిత ప్రచారాన్ని విస్తృతం చేసింది.

తాజాగా...

బ్రిటన్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ (ఐసీయి)కి అధ్యక్షురాలిగా ఎంపికైంది అనూష షా. రెండు శతాబ్దాల చరిత్ర ఉన్న ప్రతిష్ఠాత్మకమైన 'ఐసీయి' అధ్యక్షత బాధ్యతలు స్వీకరించిన తొలి భారతీయురాలిగా అనూష షా చరిత్ర సృష్టించింది...

'వాటర్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్'లో అనూష షాకు రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. డిజైనింగ్, మేనేజింగ్‌లో, ప్రాజెక్ట్స్– ప్రోగ్రామ్‌లను లీడ్ చేయడంలో అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది.

'నిర్మాణం వల్ల నిర్మాణం మాత్రమే జరగడం లేదు. ప్రకృతికి ఎంతో కొంత నష్టం జరుగుతుంది' అనేది ఒక సామాజిక సత్యం. దీన్ని దృష్టిలో పెట్టుకొని వృత్తికి సామాజిక బాధ్యత కూడా జోడించి ముందుకు వెళుతోంది అనూష.

'నా వృత్తి వల్ల నాకు ఆర్థికంగా మేలు జరగడం మాట ఎలా ఉన్నా, చేటు మాత్రం జరగవద్దు' అంటోంది అనూష. అందుకే తన వృత్తిలో పర్యావరణ హిత విధానాలను అనుసరిస్తోంది.

'సివిల్ ఇంజనీరింగ్‌ను పీపుల్–పాజిటివ్ ప్రొఫెషన్‌గా చూడాలనేది నా కల. మౌలిక వసతులు, ప్రకృతికి మధ్య ఉండే అంతఃసంబంధాన్ని అర్థం చేసుకోవడంలో మొదట్లో మేము విఫలమయ్యాం. ఆ తరువాత మాత్రం ప్రకృతికి హాని జరగని విధానాలను అనుసరించాం' అంటుంది అనూష. అందమైన కశ్మీర్‌లో పుట్టి పెరిగిన అనూషకు ప్రకృతి విలువ తెలుసు.

కశ్మీర్‌లోని దాల్ సరస్సు సంరక్షణ కోసం దిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ఒక సంస్థ కోసం ఇరవై మూడు సంవత్సరాల వయసులో కన్సల్టింగ్ ప్రాజెక్ట్ ఇంజనీర్‌గా పనిచేసింది. ఆ తరువాత కామన్‌వెల్త్ స్కాలర్‌షిప్‌తో బ్రిటన్ వెళ్లి 'వాటర్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్'లో ఎంఎస్‌సీ చేసింది. 'ప్లాన్ ఫర్ ఎర్త్' అనే క్లైమెట్ ఛేంజ్ కన్సెల్టెన్సీని మొదలు పెట్టి పర్యావరణ సంరక్షణకు సంబంధించిన ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. వివిధ పరిశ్రమలకు సంబంధించిన 'నెట్‌జీరో అండ్ క్లైమెట్ ఛేంజ్' బృందాలతో సమావేశమై విలువైన సూచనలు ఇచ్చింది.

చర్చాకార్యక్రమాల్లో పాల్గొన్నా, వ్యాసాలు రాసినా, టీవీలో ఇంటర్వ్యూ ఇచ్చినా, సమావేశాల్లో ఉపన్యాసం ఇచ్చినా...ప్రతి అవకాశాన్ని పర్యావరణ హిత ప్రచారానికి ఉపయోగించుకుంది.

'మన గురించి మాత్రమే కాదు భవిష్యత్ తరాల గురించి కూడా ఆలోచించాలి. ఉన్నతమైన విలువలతో ప్రయాణించినప్పుడే మన గమ్యస్థానం చేరుకోగలం' అంటుంది అనూష. 'క్లైమెట్ ఛేంజ్ ఇన్ ఇంజనీరింగ్' అంశానికి సంబంధించి అనూష చేపట్టిన అవగాహన కార్యక్రమాలకుగానూ 'యూనివర్శిటీ ఆఫ్ ఈస్ట్ లండన్' నుంచి గౌరవ డాక్టరేట్ స్వీకరించింది.

కొన్ని సంవత్సరాల క్రితం బ్రిటన్ నుంచి ముంబైకి వచ్చింది అనూష. ఆ సమయంలో తన స్వస్థలం కశ్మీర్‌ను వరదలు ముంచెత్తాయి. ఎంతో మంది చనిపోయారు. ఎంతోమంది నిరాశ్రయులయ్యారు. ఇది అనూషను బాగా కదిలించింది. 'విషాదం నుంచి కూడా నేర్చుకోదగినవి చాలా ఉంటాయి. ఇది అలాంటి విషాదమే' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటుంది అనూష.

'ముందుచూపు, ముందు జాగ్రత్త ఉన్న వాళ్ల వైపే అదృష్టం మొగ్గు చూపుతుంది' అనేది అనూష షాకు బాగా ఇష్టమైన మాట.

'మన వల్ల ఏమవుతుంది అనే భావన కంటే ఔట్ ఆఫ్ బాక్స్‌లో ఆలోచించి, ధైర్యంగా ముందుకు వెళ్లడం వల్లే ఎక్కువ మేలు జరుగుతుంది. సంకల్పబలం ఉన్న చోట అద్భుతమైన ఫలితాలు వస్తాయి' అనేది ఆమె బలంగా చెప్పే మాట.

న్యూస్‌మేకర్



మోదీపై పీహెచ్‌డీ

నరేంద్ర మోదీ గుజరాత్ సి.ఎం. అయ్యాక, ప్రధాని పదవి చేపట్టాక ఆయనపై పీహెచ్‌డీలు చేసిన వారు చాలామంది ఉన్నారు. కాని వారిలో ముస్లిం స్కాలర్లు... అందునా మహిళా ముస్లిం స్కాలర్లు దాదాపుగా లేరు. ఆ విధంగా చూస్తే మోదీపై పీహెచ్‌డీ చేసిన మొదటి మహిళా స్కాలర్‌గా వారణాసికి చెందిన నజ్మా పర్వీన్ గుర్తింపు పొందింది.

చేనేత కుటుంబంలో పుట్టి

నజ్మా పర్వీన్‌ది వారణాసి దాపున ఉన్న లల్లాపుర. తల్లిదండ్రులు చేనేత కార్మికులు. కాని వారు ఆమె చిన్నప్పుడే మరణించారు. అయినా తన చదువుకు ఆటంకం కలిగించకుండా కొనసాగించింది పర్వీన్. బెనారస్ హిందూ యూనివర్సిటీ (బి.హెచ్.యు.)లో పొలిటికల్ సైన్స్ చదివి 2014లో పీహెచ్‌డీ సీటు తెచ్చుకుంది. ఆ సమయంలో ఆమె ఎంచుకున్న అంశం 'నరేంద్రమోడీస్ పొలిటికల్ లీడర్‌షిప్: యాన్ అనలిటికల్ స్టడీ'.

నజ్మా పర్వీన్ తన పీహెచ్‌డీకి ఈ అంశం తీసుకున్నాక 'నాక్కూడా భవిష్యత్తులో రాజకీయ నేత కావాలని ఉంది. అందుకే నేను భారతీయ ఆవామ్ పార్టీనీ స్థాపించాను కూడా. ఆ పార్టీని ఎలా రూపుదిద్దాలి అనుకున్నప్పుడు నాకు నరేంద్ర మోదీ నాయకత్వం మీద దృష్టి మళ్లింది. ఆయన రాజకీయాలలో ధ్రువతార వంటి వారు. 2014 నుంచి దేశంలో ఆయన సమర్థ నాయకత్వం కొనసాగింది. ట్రిపుల్ తలాక్ మీద ఆయన తెచ్చిన చట్టాన్ని సమర్థిస్తూ నేను మొదటగా శుభాకాంక్షలు తెలియచేశాను' అని తెలిపింది నజ్మా.

పేదరికంలో ఉన్న నజ్మా పర్వీన్ చదువుకు 'విశాల్ భారత్ సంస్థాన్' స్థాపించిన ప్రొఫెసర్ రాజీవ్ శ్రీవాస్తవ సహకరిస్తే బి.హెచ్.యు. ప్రొఫెసర్ సంజయ్ శ్రీవాస్తవ గైడ్‌గా వ్యవహరించారు. 8 ఏళ్ల సమయం తీసుకుని 20 హిందీ, 79 ఇంగ్లిష్ గ్రంథాలు అధ్యయనం చేసి నజ్మా ఈ పీహెచ్‌డీని పూర్తి చేసింది.

ఇంటిప్



అరకప్పు వంటసోడాలో నీళ్లు పోసి పేస్టులా కలపాలి. ఈ పేస్టుని అవెన్‌లో లోపలి భాగంలో రాయాలి. హీటింగ్ కాయిల్స్, ఫ్యాన్ బ్లేడ్స్, లైట్స్ మీద రాయకూడదు. కింద, సైడు గోడలకు రాసి రాత్రంతా ఉంచేయాలి. ఉదయాన్నే కాటన్ వస్త్రంతో వంటసోడాని తుడిచేయాలి. సోడా పూర్తిగా పోయిన తరువాత నీటిలో కలిపిన వెనిగర్‌తో మరోసారి తుడవాలి. ఇలా చేస్తే అవెన్‌లో పేరుకుపోయిన మురికి, అవెన్ గోడలకు పడ్డ మచ్చలూ పోయి కొత్త దానిలా మెరుస్తుంది.

ఇంటికి దీపావళి కళ

దీపావళి అంటే దీపాల పండుగే కాదు. ఇళ్లువాకిళ్లను శుభ్రం చేసి, ఇంటిని చక్కగా సర్దుకోవడం కూడా. ఇంటిని సర్దే క్రమంలో అందంగా అలంకరించుకోవడం కూడా ఈ పండగ సమయంలో చేసే ముఖ్యమైన పని. ఎంత అనుకున్నా ఇప్పుడున్న బిజీ లైఫ్‌లో ఇంటిని డెకరేట్ చేయడం కొంచెం కష్టంగానే ఉంటుంది. అయినా ఏం పర్లేదు.. చిన్న చిన్న ఐడియాలు, చిట్కాలతో మీ ఇంటిని క్షణాల్లో అందంగా డెకరేట్ చేసుకోవచ్చు. మరి ఆ చిట్కాలు ఏంటో చూడండి.



* గాజు, రాగి, ఇత్తడి వెడల్పాటి పాత్రలో నీళ్లుపోసి తాజాపువ్వులతో నింపేయాలి. పూల మధ్యలో దీపాలను వెలిగించాలి. ఈ పాత్రను గుమ్మానికి ఎదురుగా, డోర్ పక్కన పెడితే చాలా అందంగా ఉంటుంది.

* * *

* ఇంటి గుమ్మం పెద్దగా ఉన్నట్లయితే సంప్రదాయబద్ధంగా అలంకరించాలి. గుమ్మం ముందు రంగురంగుల ముగ్గులను పూలతో అలకరించి మధ్యలో దీపాలు పెట్టాలి. ఈ రంగవల్లుల పైన వేలాడే ల్యాంప్స్‌ను వెలిగిస్తే ఇంటి గుమ్మం కళకళలాడిపోతుంది.

* * *

* వివిధ రంగులతో మెరిసిపోయే చీరలు చున్నీలను గ్లాస్ విండో, డోర్‌లకు కర్టెన్స్‌లా పెట్టాలి. ఈ చీరలపైన సన్నని లైటింగ్ దండలను వేలాడదీయాలి. గది మధ్యలో సువాసనలు వెదజల్లే దీపాలను వెలిగిస్తే ఇల్లు మరింత కాంతిమంతంగా మారుతుంది.

* * *

* గుమ్మం ముందు, హాల్లో వేసే ముగ్గుని రెండు మూడు రకాల పువ్వులతో వేయాలి. ఈ ముగ్గు మధ్యలో మట్టిప్రమిదలు, సువాసనలు వెదజల్లే క్యాండిల్స్ పెట్టి వెలిగించాలి.

* * *

* ఇంటిముందు పెద్దగా స్థలం లేనప్పుడు డోర్ పక్కనే ఉన్న గోడ మూల నుంచి దీపాలు పెట్టాలి. వీటిచుట్టూ పూలతో అలంకరించాలి. ఇవి ఇంటిని మరింత అందంగా చూపిస్తాయి.

* * *

* మార్కెట్లో దొరికే వివిధ రకాల వేలాడే దీపాలను వెలిగిస్తే చీకట్లో సైతం ఇల్లు కాంతులీని, పండుగ వాతావరణం కనిపిస్తుంది.

* * *

* గోడలకు వేలాడదీసే రంగురంగుల డెకరేషన్ వస్తువులు మార్కెట్లో చాలా కనిపిస్తాయి. కలర్‌ఫుల్ పూసలు, దారాలు, రంగురంగుల మెరిసే క్లాత్‌తో చేసిన, గంటలతో వచ్చే అలంకరణ వస్తువులను గోడకు వేలాడదీసి, కింద మట్టి దీపాలతో అలంకరిస్తే ఇల్లు కళకళలాడిపోతుంది.

* వీటిలో ఏదీ చేసే సమయం లేకపోతే మార్కెట్‌లో దొరికే చెక్క, యాక్రాలిక్ ల్యాంప్స్ కొనుక్కొని... కిటికీలు, గ్యాలరీలో వేలాడదీస్తే మీ ఇంటి దీపావళికి కళ వస్తుంది.

* * *

ఇంకెందుకాలస్యం మీ ఇంటికి నప్పే విధంగా సింపుల్ డెకరేషన్ ప్రయత్నాలు మొదలు పెట్టండి.

వ్యాపారాన్ని ఫైల్ చేసింది!



• పూనమ్ గుప్తా

సాధారణంగా చదువు అయిపోగానే వెంటనే ఉద్యోగ వేటలో పడతారు చాలామంది. మంచి ఉద్యోగం కోసం వెతికి వెతికి చివరికి చిన్నపాటి జాబ్ దొరికినా చేరిపోతారు. కొంతమంది మాత్రం తాము కోరుకున్న దానికోసం ఎంత సమయం అయినా ప్రయత్నిస్తూనే ఉంటారు. వీరందరిలాగే ప్రయత్నించింది పూనమ్ గుప్తా. కానీ ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. దీంతో తనే ఒక వ్యాపారాన్ని ప్రారంభించి వందలమందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదిగింది. సమస్య ఏదైనా నిశితంగా ఆలోచిస్తే ఇట్టే పరిష్కారం దొరుకుతుందనడానికి పూనమ్ గుప్తానే ఉదాహరణగా నిలుస్తోంది.

ఢిల్లీకి చెందిన ఓ వ్యాపార కుటుంబంలో పుట్టింది పూనమ్ గుప్తా. లేడీ శ్రీరామ్ కాలేజీలో ఎకనమిక్స్‌తో డిగ్రీ పూర్తి చేసిన పూనమ్.. తరువాత ఎమ్‌బీఏ చేసింది. చదువు అయిన వెంటనే ఉద్యోగాన్వేషణ ప్రారంభించింది. ఎంత ప్రయత్నించినా ఎక్కడా ఉద్యోగం రాలేదు. ఇలా జాబ్ ప్రయత్నాల్లో ఉండగానే... 2002లో పునీత్ గుప్తాతో వివాహం జరిగింది. పునీత్ స్కాట్‌లాండ్‌లో స్థిరపడడంతో పూనమ్ కూడా భర్తతో అక్కడికే వెళ్లింది. పెళ్లి అయినా.. దేశం మారినా పూనమ్ మాత్రం ఉద్యోగ ప్రయత్నాన్ని మానుకోలేదు. ఎలాగైనా జాబ్ చేయాలన్న కోరికతో అక్కడ కూడా ఉద్యోగం కోసం కాళ్లు అరిగేలా తిరిగింది. అనుభవం లేదని ఒక్కరూ ఉద్యోగం ఇవ్వలేదు. స్కాట్‌లాండ్‌లో అయినా జాబ్ దొరుకుతుందనుకున్న ఆశ నిరాశగా మారింది.



• భర్తతో...

అలా వచ్చిన ఆలోచనే...

ఉద్యోగం కోసం వివిధ ఆఫీసులకు వెళ్లిన పూనమ్‌కు.. అక్కడ కట్టలు కట్టలుగా పేర్చిన ఫైళ్లు కనిపించేవి. ఉద్యోగం దొరకక సొంతంగా ఏదైనా చేయాలనుకున్నప్పుడు ఆ ఫైళ్లను రీసైక్లింగ్ చేయవచ్చు గదా. అన్న ఐడియా వచ్చింది. పేపర్‌ను రీసైక్లింగ్ ఎలా చేయాలి, ఈ వ్యాపారంలో ఎదురయ్యే సవాళ్లను క్షుణ్ణంగా తెలుసుకుని కంపెనీ పెట్టాలని నిర్ణయించుకుంది. స్కాటిష్ ప్రభుత్వం ఓ పథకం కింద ఇచ్చిన లక్షరూపాయల రుణంతో 2003లో 'పీజీ పేపర్ కంపెనీ లిమిటెడ్' కంపెనీని పెట్టింది. ప్రారంభంలో యూరప్, అమెరికాల నుంచి పేపర్ వ్యర్థాలను కొని రీసైక్లింగ్ చేసేది. రీసైక్లింగ్ అయిన తరువాత నాణ్యమైన పేపర్‌ను తయారు చేసి విక్రయించడమే పూనమ్ వ్యాపారం. ఏడాదికేడాది టర్నోవర్‌ను పెంచుకుంటూ కంపెనీ విలువ ఎనిమిది వందల కోట్లకు పైకి చేరింది. ప్రస్తుతం అరవై దేశాల్లో పీజీ పేపర్స్ వ్యాపారాన్ని విస్తరించింది. అమెరికా, చైనా, ఇండియా, ఈజిప్ట, స్వీడన్‌లలో సొంతకార్యాలయాలు ఉన్నాయి.

> **అందరూ ఆదర్శమే...**
>
> "నాకు చాలామంది రోల్ మోడల్స్ ఉన్నారు. ఒక్కొక్కరి నుంచి ఒక్కో విషయాన్ని నేర్చుకుని ఈ స్థాయికి ఎదిగాను. నాన్న, మామయ్య, టీచర్స్ నన్ను చాలా ప్రభావితం చేశారు. పెద్దయ్యాక మదర్ థెరిసా, ఇందిరా గాంధీ వంటి వారు మహిళలు ఏదైనా చేయగలరని నిరూపించి చూపించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ధైర్యంగా ముందుకెళ్తూ విజయాలు సాధిస్తున్నాను".
>
> – పూనమ్ గుప్తా

పూనమ్‌కు అండగా...

పీజీ పేపర్స్‌ని పూనమ్ ప్రారంభించిన రెండేళ్లకు భర్త పునీత్ గుప్తా కూడా ఎనభై లక్షల జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలేసి కంపెనీలో చేరారు. భార్యాభర్తలు ఇద్దరు కలిసి వ్యాపారాభివృద్ధికి కృషిచేశారు. దీంతో అనతి కాలంలోనే పీజీ పేపర్స్ ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపుని తెచ్చుకుంది. పేపర్ ట్రేడింగ్ కంపెనీతోపాటు డెంటల్ హెల్త్ వంటి వ్యాపారాల్లోనూ పూనమ్ రాణిస్తోంది.



ఆరోగ్య ధన ప్రాప్తిరస్తు!

ఇవాళ ధనత్రయోదశి. దీనినే ధన్ తేరస్ అని కూడా అంటారు. ఈ పర్వదినాన సాధారణంగా అందరికీ బంగారం, వెండి, గృహోపకరణాలు, వస్తు వాహనాల వంటి వాటి మీదికే దృష్టి మళ్లుతుంది. ఆరోగ్య ప్రదాత అయిన ధన్వంతరి జయంతి కూడా ఇదే రోజు అని గుర్తు రాదు. అయితే ఆరోగ్యం కూడా ధనమే కాబట్టి ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ఏం చేయాలో తెలుసుకుని అందుకు తగినట్లు నడుచుకుంటే ఆరోగ్య ధనం, ఆరోగ్య మహాభాగ్యం సమకూరుతుంది. ధన త్రయోదశి సందర్భంగా ఆరోగ్య సంపదను ఏవిధంగా పెంపొందించుకోవాలో చూద్దాం...

సంపూర్ణ ఆరోగ్యానికి ఆహార విహారాలు ఎంత అవసరమో, నిత్యం నడక, వ్యాయామం, యోగా కూడా అంతే అవసరం. ప్రధానంగా ఇవి అనేక రుగ్మతలకు దివ్య ఔషధాలు. అజీర్తి నుంచి ఆర్థరైటిస్ వరకు.. బీపీ నుంచి హార్ట్ఎటాక్ వరకు, మధుమేహం నుంచి మానసిక సమస్య వరకు ఏదైనా నయం కావాలంటే రోజూ వ్యాయామం, యోగా చేస్తుండాలి.

■ సమయానికి తగు...



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ పౌష్టికాహారాన్ని తీసుకోవడం ఎంత అవసరమో ఆ ఆహారాన్ని తగిన సమయానికి తీసుకోవడం కూడా అంతే అవసరం. వేళ తప్పి భోజనం చేస్తే అది మన ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. అందువల్ల ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సరైన సమయాలకు భోజనం చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

■ బ్రేక్ ఫాస్ట్ తప్పనిసరి

రోజూ ఉదయాన్నే టిఫిన్ చేయడం వల్ల ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండగలుగుతారు. కొందరికి అలా బ్రేక్ ఫాస్ట్ చేయడం అలవాటు ఉండదు. అలాంటి వారు అల్పాహారంగా నానబెట్టిన బాదం, ఎండు ద్రాక్ష, వాల్నట్స్, మొలకెత్తిన గింజలు, అవిసెలు, తాజాపండ్లు, కూరగాయల ముక్కలు లాంటివి అయినా తప్పనిసరిగా తీసుకోవాలి.



■ లంచ్‌గా ఇవి...

మధ్యాహ్నపు భోజనంగా సగం కంచంలో తాజా కూరగాయలు, మిగతా సగంలో పిండిపదార్థాలు, మాంసకృత్తులు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండేలా చూసుకోవాలి.



రక్తంలో చక్కెర నిల్వల్ని అదుపులో ఉంచుకోవడానికి, లో గ్లైసిమిక్ ఇండెక్స్ కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు లాంటి చిరు ధాన్యాన్ని ప్రయత్నించవచ్చు.

ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత మేరకు తగ్గించాలి. ఎందుకంటే, మనం వాడే ప్లాస్టిక్ వస్తువుల నుండి, రోజుకి కొన్ని లక్షల సూక్ష్మరేణువులు విడుదలవుతాయి. వాటిలో ఉండే రసాయనం హార్మోన్ల సమతౌల్యాన్ని దెబ్బ తీస్తుంది.

■ మానసిక దృఢత్వం

మానసిక ఆరోగ్యం బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు. ఇందుకోసం నిత్యం నడక, వ్యాయామం, యోగా తప్పనిసరి. ప్రధానంగా ఇవి అనేక రుగ్మతలకు దివ్య ఔషధాలు.

■ కంటినిండా నిద్ర

కడుపు నిండా తిని కంటి నిండా నిద్ర పోతే ఏ జబ్బూ ఉండదని పెద్దవాళ్లనేవారు. వేళకు తగినంత రాత్రి నిద్ర ఉంటే పొద్దున లేవగానే ఉత్సాహంగా ఉంటుంది. లేదంటే నిస్సత్తువగా... ఏదో పోగొట్టుకున్నట్లుగా అనిపిస్తుంది. నిద్ర లేమి వల్ల రకరకాల ఇతర జబ్బులు వస్తాయి. అందువల్ల వీలయినంత వరకు వయసును బట్టి, చేసే శారీరక శ్రమను అనుసరించి తగినంత నిద్ర పోవడం ప్రతి ఒక్కరికీ అవసరం.



ఈ ధన త్రయోదశి నాడు అందరూ ఆరోగ్య ధనాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తారని, వేయాలనీ ఆశిద్దాం.

మంచి కొవ్వు మంచిదే!



లావవుతామనే భయంతో చాలామంది కొవ్వు పదార్థాలు ఉండే ఆహారాలను తినడం మానేస్తున్నారు. కొందరైతే నెయ్యి తినడం ఎప్పుడో మానేశారు. అయితే శరీరంలోని ఎ, డి, ఇ, కె విటమిన్లు కొవ్వులో మాత్రమే కరుగుతాయి. కాబట్టి తగిన పరిమాణంలో మంచి కొలెస్ట్రాల్ ఎంతో అవసరం. అలాగని అన్నిరకాల కొవ్వులూ ఆరోగ్యం కాదు. ఇంతకూ ఆరోగ్యకరమైన కొవ్వు లభించాలంటే ఎలాంటి ఆహారాలు తీసుకోవాలో తెలుసుకుందామా?

మీరు ఆరోగ్యం పట్ల చాలా కాన్షియస్‌గా ఉండి..అధిక పరిమాణంలో కొలెస్ట్రాల్ ఉన్న ఆహారాలకు దూరంగా ఉంటే తప్పకుండా ఈ అవకాడోను ఆహారంలో చేర్చుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఉండే మోనోశాచురేటెడ్ కొవ్వు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

ఆలివ్ ఆయిల్: వేపుళ్లకు దూరంగా ఉండేవారు తప్పకుండా ఆహారాల్లో ఆలివ్ ఆయిల్‌ను తప్పకుండా వినియోగించాల్సి ఉంటుంది. ఇందులో ఉండే పోషకాలు, మోనోశాచురేటెడ్ కొవ్వులు గుండెను ఆరోగ్యంగా చేసేందుకు సహాయపడతాయి. అంతేకాకుండా శరీర బరువును నియంత్రించేందుకు కూడా సహాయపడతాయి.

పెరుగు: బరువు తగ్గడానికి ఆరోగ్యకరమైన ఆహారాలు తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా తీసుకుంటే శరీరంలోని కొవ్వును సమతుల్యంగా చేస్తుంది. కాబట్టి శరీరం ఆరోగ్యంగా ఉండడానికి తప్పకుండా కొవ్వు పాలతో చేసిన పెరుగు తినడం చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇందులో ఉండే గుణాలు ప్రేగును కూడా ఆరోగ్యంగా ఉంచుతాయి.

కొబ్బరి: కొబ్బరి లేదా కొబ్బరి నూనె తీసుకోవడం వల్ల శరీరానికి అనేక రకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో జీర్ణక్రియను మెరుగుపరిచే చాలా రకాల పోషకాలు దొరుకుతాయి. దీనివల్ల ట్రైగ్లిజరైడ్ ఫుడ్ సులభంగా జీర్ణమవుతుంది. అంతేకాకుండా మలబద్ధకం, ఇతర పొట్ట సమస్యల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.

చేపలు: చేపలలో మంచి కొలెస్టరాల్‌ను పెంపొందించే లక్షణాలున్నాయి. అందుకే ఇతర విధాలైన మాంసాహారాలకు దూరంగా ఉండమని హెచ్చరించే వైద్యులు సైతం పరిమితంగా అయినా చేపలు తీసుకోవచ్చునని చెబుతారు.

బాదం పప్పు, జీడిపప్పు: వీటిని తీసుకోవడం వల్ల కొవ్వు పెరుగుతుందని అనుకుంటాం. అయితే వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు మాత్రమే ఉంటాయి. అందువల్ల బాదం, జీడిపప్పు తీసుకోవడం మంచిది. బాదం పప్పును నీటిలో నానబెట్టి, పైన పొట్టు తీసి తినడం మంచిది. జీడిపప్పును అయితే వేయించకుండా నేరుగా తీసుకోవడం వల్ల మంచి కొలెస్టరాల్ పెంపొందుతుంది.

నెయ్యి: ఇదివరకటిలో ఆహారంలో నేతిని బాగా ఉపయోగించేవారు. అరిసెలు, గారెలు వంటి వాటిని నేతితోనే చేసేవారు. అయితే రానురానూ నెయ్యి తినడం ఆరోగ్యానికి మంచిది కాదనే అభిప్రాయం స్థిరపడిపోయింది. నిజానికి నేతిలో శరీరానికి అవసరమైన పోషకాలెన్నో ఉన్నాయి. అలాగని ముద్ద ముద్దకీ నెయ్యి వేసుకోవడం, నేతితోనే చేసిన డీప్ ఫ్రైలు విపరీతంగా తీసుకోవడం మాత్రం అంత మంచిది కాదు. గేదె నెయ్యి కన్నా ఆవు నెయ్యి మంచిది.

మరకలను మాయం చెయ్యండి ఇలా...



బట్టలపై మరకలు పడ్డప్పుడు డ్రై క్లీనింగ్‌కి ఇద్దామంటే ఆ ధరకు కొత్తదే వస్తుందమే అనిపిస్తుంది. అయితే మరకలను తొలగించుకునేందుకు కొన్ని చిట్కాలున్నాయి. అవేమిటో చూద్దాం.

మీ దుస్తులు మెరిసేలా చేయాలంటే ఆస్పిరిన్ మాత్రలు బాగా ఉపయోగపడతాయి. ఆస్పిరిన్‌లో ఉండే ఎసిటైల్‌సాలిసిలిక్ ఆమ్లం బట్టలపై పడిన మరకలను తొలగించేందుకు సాయం చేస్తుంది. తెల్లని దుస్తులను నాలుగైదు ఆస్పిరిన్ టాబ్లెట్లు వేసిన నీళ్ల బకెట్‌లో బాగా నానబెట్టండి. తరవాత బట్టల సబ్బుతో ఉతకడమో లేదా వాషింగ్ మెషీన్‌లో వేసి మామూలుగా ఉతికి జాడించి ఆరేస్తే సరి!

రక్తపు మరకలను తొలగించడానికి.. ఆస్పిరిన్‌ను చల్లటి నీటిలో కరిగించి బట్టలను నానబెట్టండి. వేడినీటితో రక్తపు మరకలను తొలగించడానికి ప్రయత్నించవద్దు. ఇది ప్రొటీన్లు గడ్డకట్టడానికి కారణమవుతుంది. ఆ తరువాత మరకను తొలగించడం కష్టం అవుతుంది. చేస్తుంది.

నూనె, గ్రీజు మరకలకు

ఒక నిమ్మకాయను రెండు ముక్కలుగా కోయాలి. ఒక ముక్క మీద ఉప్పు వేసి మరకపై రుద్దాలి. ఇది నిమిషాల్లో బట్టలపై ఉన్న మరకలను తొలగిస్తుంది.

వక్కపొడి, పాన్ మసాలా మరకలు

పెరుగు లేదా మజ్జిగను మరక పడ్డ చోట ఉంచి పది నిమిషాలు అలాగే ఉంచండి. తర్వాత శుభ్రమైన నీటితో వస్త్రాన్ని కడగాలి. ఇది బట్టలపై ఉన్న మరకలను తొలగిస్తుంది.

టీ–కాఫీ మరకలు

టీ–కాఫీ మరకలు పడ్డప్పుడు ముందుగా గోరువెచ్చటి నీటిలో ఆ వస్త్రాన్ని పదిహేను నిమిషాలు ఉంచిన తర్వాత లిక్విడ్ డిటర్జెంట్లో నానబెట్టాలి. తర్వాత మరక పడ్డ చోట చేతితో రుద్దితే మరకలు తొలగుతాయి.

టర్కీ టవళ్లు, దుప్పట్ల వంటి వాటిని బట్టలుతికే సోడా కలిపిన నీటిలో నానబెట్టి ఉతికితే త్వరగా శుభ్ర పడతాయి.

సినిమా

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ



● బెల్లం దుర్గ, దేవినేని అవినాష్, ఘట్టమనేని బాబీ, కమల్‌హాసన్

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీఓ పార్కులో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 'భారతీయుడు 2' చిత్రం షూటింగ్ కోసం విజయవాడలో ఉన్న కమల్‌హాసన్.. కృష్ణ–మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆహ్వానం మేరకు కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది'' అన్నారు కమల్‌హాసన్. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొన్న విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ– ''కళామతల్లికి తనదైన శైలిలో సేవలందించి, ప్రేక్షకుల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు కృష్ణగారు. తండ్రి గౌరవాన్ని మహేశ్‌బాబుగారు నిలబెడుతున్నారు'' అన్నారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణ కేవలం పదిరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు సహకరించిన సీఎం జగన్ మోహన్ రెడ్డిగారికి కృతజ్ఞతలు'' అని కృష్ణ అభిమానుల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమంలో విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కృష్ణ కుటుంబ సభ్యుడు ఘట్టమనేని బాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా పద్మావతి, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

గర్వంగా ఉంది: హీరో మహేశ్‌బాబు ''నాన్నగారి విగ్రహాన్ని ఆవిష్కరించిన కమల్ హాసన్‌గారికి కృతజ్ఞతలు. నాన్నగారు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, వారసత్వానికి ఇదొక నివాళి. నాన్న విగ్రహం ఏర్పాటుకు కారణమైన అందరికీ, ఈ వేడుక ఘనంగా నిర్వహించిన అభిమానులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేశారు మహేశ్ బాబు.

ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్



● ధనుష్, ఇళయరాజా

సంగీత జ్ఞాని ఇళయరాజా జీవితం వెండితెరపైకి రానుంది. ఇందులో ధనుష్ ఓ ప్రధాన పాత్రలో నటించనున్నారు. మెర్క్యూరీ గ్రూప్, కనెక్ట్ మీడియా సంస్థలు ఈ బయోపిక్‌ను నిర్మించనున్నాయి. వచ్చే ఏడాది అక్టోబరులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించి, 2025 ఏడాది మధ్యలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా మెర్క్యూరీ గ్రూప్ సీఈవో, ఎండీ శ్రీరామ్ భక్తి శరణ్ మాట్లాడుతూ –''ప్రాంతీయ కథలతో సినిమాలు తీస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. అందుకే లోకల్, ప్రాంతీయ కథలను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కించాలనుకుంటున్నాం'' అన్నారు. ''రాబోయే రెండు దశాబ్దాల్లో భారతీయ వినోద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ వినోద పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన మెర్క్యూరి సంస్థతో మెగా బడ్జెట్ సినిమాలను నిర్మించడానికి వారితో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉంది'' అని కనెక్ట్ మీడియా ప్రతినిధి వరుణ్ మాథుర్ అన్నారు.

వేటాడే సత్యభామ



● కాజల్

'సత్యా.. ఈ కేసు నీ చేతుల్లో లేదు (ప్రకాశ్‌రాజ్).. కానీ ఆ ప్రాణం నా చేతుల్లోనే పోయింది సార్ (కాజల్ అగర్వాల్)' అనే డైలాగ్స్‌తో మొదలవుతుంది 'సత్యభామ' టీజర్. పోలీసాఫీసర్ సత్యభామ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం ఇది. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందించారు. శుక్రవారం 'సత్యభామ' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'సార్.. ఆ గిల్ట్ నన్ను వెంటాడుతూనే ఉంది. వేటాడాలి (కాజల్ అగర్వాల్)', 'ఆ అమ్మాయి చావుకు మీరే కారణం అంటున్నారు. ఈ కేసును మీరు వదిలేసినట్లేనా? (విలేకర్లు).. నెవర్ (కాజల్)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల.

కొత్తవాళ్లతో సినిమా పెద్ద బాధ్యత - నిహారిక

''మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో ఇప్పటివరకు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలింస్ చేశాం. తొలిసారి ఫీచర్ ఫిల్మ్ ప్రారంభించాం. ఇంతమంది కొత్తవాళ్లతో సినిమా చేయటం పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను'' అన్నారు నిహారిక కొణిదెల. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు నాగబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో వరుణ్ తేజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. యదు వంశీ మాట్లాడుతూ– ''ఈ సినిమా ద్వారా 11 మందిని హీరోలుగా, నలుగురిని హీరోయిన్లుగా పరిచయం చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంతో నేను, నా సతీమణి జయలక్ష్మి నిర్మాతలుగా పరిచయమవుతున్నాం'' అన్నారు శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ అధినేత ఫణి. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎదురోలు, సంగీతం: అనుదీప్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్.



● యూనిట్‌కి స్క్రిప్ట్ అందిస్తున్న అల్లు అరవింద్

లింగి లింగిడి..!



● రాహుల్, శివానీ, మిథున్, తేజా మార్ని, 'బన్నీ' వాసు, విద్య

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల అవుతోంది. రంజిన్ రాజ్, మిథున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగిడి..' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేయగా, 30 మిలియన్ వ్యూస్‌ను పూర్తి చేసుకుంది. ''ఈ పాటలానే మా చిత్రానికి ప్రేక్షకులు విజయం అందిస్తారనే నమ్మకం ఉంది'' అని హైదరాబాద్‌లో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో 'బన్నీ' వాసు అన్నారు.

ప్రేమలో గీతాశంకరం



● ప్రియాంక, ముఖేష్ గౌడ

ముఖేష్ గౌడ, ప్రియాంకా శర్మ జంటగా కె.దేవానంద్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రం 'గీతా శంకరం'. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ మాట్లాడుతూ– ''సీరియల్స్‌లో పేరు సంపాదించుకున్నట్లే ఈ సినిమాతో వెండితెరపై కూడా మంచి పేరు తెచ్చుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. ''నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర లభించడం నా లక్‌గా భావిస్తున్నా'' అన్నారు ప్రియాంకా శర్మ. ''ఇరవై కథలు విన్నాం. కానీ రుద్ర చెప్పిన ఈ కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ నెల 14న కొత్త షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు దేవానంద్. ''ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు రుద్ర. ఈ చిత్రానికి సంగీతం: అబు, కెమెరా: ఉదయ్ ఆకుల.

రెండు హృదయాల కల



● జాన్వీ కపూర్

'రూహి' చిత్రం తర్వాత రాజ్ కుమార్ రావు, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. 'నో డ్రీమ్ ఈజ్ ఎవర్ చేజ్డ్ ఎలోన్!' అనేది క్యాప్షన్. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్‌కు శరణ్‌శర్మ దర్శకత్వం వహించగా, కరణ్ జోహార్ నిర్మించారు. ''ఒకే కల కోసం రెండు హృదయాలు ఎదురు చుస్తున్నాయి'' అంటూ ఈ మూవీని ఏప్రిల్ 19న రిలీజ్ చేయనున్నట్లుగా జాన్వీ కపూర్ అండ్ టీమ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

మాస్ రింగు..



● సోహైల్

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్– కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'రింగు రింగు బిళ్ల..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి దేవ్ పవార్ సాహిత్యం అందించగా, భోలే షావలి, రఘురామ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''ఫుల్ మాస్‌గా 'రింగు రింగు బిళ్ల..' సాంగ్ ఉంటుంది. సోహైల్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు మేకర్స్.

సరికొత్త ట్రయల్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది ట్రయల్'. స్మృతీ సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ''ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని కంప్లీట్ ఇంటరాగేటివ్ కథతో, సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఈ సినిమా కథనం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహనిర్మాత: సుదర్శన్ రెడ్డి.



● 'ది ట్రయల్' పోస్టర్

మంచి సినిమా అంటున్నారు - నిర్మాత సాయి సుధాకర్

''అలా నిన్ను చేరి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి ఎక్కువగా స్పందన వస్తోంది. వారంతా ఫస్ట్ హాఫ్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు'' అని కొమ్మాలపాటి సాయి సుధాకర్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ–''మా సినిమా చూసిన చాలామంది తమ జీవితాన్ని చూసుకున్నట్టుగా ఉందనడం సంతోషం. 'అలా నిన్ను చేరి' నిర్మాతగా మొదటి సినిమా అయినా కథకి అవసరం మేరకు ఖర్చు పెట్టా. సినిమా చూసిన మా నాన్నగారు బాగా తీశారని మెచ్చుకున్నారు. నా తర్వాతి సినిమా కోసం ప్రస్తుతం థ్రిల్లర్ జానర్‌లో ఓ కథ విన్నాను'' అన్నారు.



ఆరోగ్యానికి ప్రాధాన్యం

సాక్షి, హైదరాబాద్: నేటి యువతరం ఇల్లు కొనేటప్పుడు చుట్టుపక్కల ఆరోగ్య సౌకర్యాలు ఎలా ఉన్నాయనేది ప్రధానంగా చూస్తున్నారు. అత్యవసరంలో ఎంత సమయంలో ఆసుపత్రికి చేరుకోవచ్చు? ఇంట్లో పిల్లలు, పెద్దల ఆరోగ్య అవసరాల రీత్యా వీటికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

- ఇల్లు విశాలంగా ఉండటమే కాదు కమ్యూనిటీలో సకల సౌకర్యాలు ఉండాలనేది నేటి గృహ కొనుగోలుదారుల మాట. పిల్లల కోసం క్రీడా సదుపాయాలు, పెద్దలకు క్లబ్ హౌస్, జిమ్, స్విమ్మింగ్ పూల్ వంటి సదుపాయాలు ఉండాలని భావిస్తున్నారు. ఎక్కువ ఖాళీ స్థలం వదిలి, పచ్చదనం ఇష్టపడుతున్నారు.
- చిన్న కుటుంబాల నేపథ్యంలో పిల్లల ఆలనా పాలనా చూసే డే కేర్ సౌకర్యాలు ఉండాలని గృహ కొనుగోలుదారులు చూస్తున్నారు. భార్యాభర్తలిద్దరూ కార్యాలయాలకు వెళితే పిల్లలను చూసుకోవడం కష్టం అవుతుంది. వర్క్ ఫ్రం హోమ్ ఉన్నా పిల్లలపై శ్రద్ధ పెట్టలేని పరిస్థితి. కాబట్టి కమ్యూనిటీలో డే కేర్ సదుపాయాలు ఉండాలని కోరుకుంటున్నారు.

విలాసం..!

- రూ. 4 కోట్ల కంటే ఖరీదైన ప్రాపర్టీ విక్రయాల్లో వృద్ధి
- బెంగళూరు కంటే హైదరాబాద్‌లోనే అత్యధికం
- దేశంలోనే మూడో స్థానంలో నిలిచిన భాగ్యనగరం
- నగరంలో 1,660 ఇళ్ల అమ్మకం; 18 శాతం వృద్ధి



సాక్షి, హైదరాబాద్: ఖరీదైన గృహాలకు రెక్కలొచ్చాయి... ధరలోనే కాదు విక్రయాల్లో కూడా! గృహ రుణ వడ్డీ రేట్లలో స్థిరత్వం, డెవలపర్ల రాయితీలు, పండుగల సీజన్ వెరసి విలాసవంతమైన ఇళ్లకు డిమాండ్ ఏర్పడింది. బెంగళూరులో కంటే హైదరాబాద్‌లో లగ్జరీ ఇళ్ల కొనుగోళ్లు పెరిగాయి. గతేడాది జనవరి–సెప్టెంబర్‌లో బెంగళూరులో 196 యూనిట్లు అమ్ముడుపోగా.. హైదరాబాద్‌లో 138 ఫ్లాట్లకు పరిమితమయ్యాయి. అయితే ఈ ఏడాది ఇదే సమయంలో ఖరీదైన గృహ విక్రయాలలో హైదరాబాద్ బెంగళూరు, కోల్‌కతా నగరాలను వెనక్కి నెట్టేసింది. ఈసారి భాగ్యనగరంలో ఏకంగా 1,660 నివాసాలు విక్రయమయ్యాయి.

ఈ మూడు నగరాల్లోనే ఎక్కువ..

దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ఈ ఏడాది జనవరి–సెప్టెంబర్ మధ్యకాలంలో రూ.4 కోట్ల కంటే ఎక్కువ ధర ఉన్న 9,246 లగ్జరీ ప్రాపర్టీలు విక్రయమయ్యాయి. గతేడాది ఇదే కాలంలో 4,689 గృహాలు అమ్ముడుపోయాయి. ఏడాది కాలంలో ఏకంగా 97 శాతం వృద్ధి నమోదయిందని సీబీఆర్ఈ నివేదిక వెల్లడించింది. అత్యధికంగా ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో 3,409 ఇళ్లు, ముంబైలో 3,252 యూనిట్లు, హైదరాబాద్‌లో 1,660 ఖరీదైన నివాసాలు అమ్ముడుపోయాయి.

రికార్డు స్థాయిలో విక్రయాలు..

గత మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది రికార్డు స్థాయిలో గృహ విక్రయాలు జరిగాయి. 2021 ద్వితీయార్ధంలో 1.14 లక్షల గృహాలు అమ్ముడుపోగా.. 2022 హెచ్2 నాటికి 1.47 లక్షలకు పెరిగాయి. ఈ ఏడాది హెచ్2 నాటికి ఏకంగా 1.50లకు వృద్ధి చెందాయి. ఖరీదైన గృహ విక్రయాలలో తొలి మూడు నగరాలైన ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబై, హైదరాబాద్ వాటానే 90 శాతంగా ఉంది. 9 నెలల కాలంలో ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో 37 శాతం, ముంబైలో 35 శాతం, హైదరాబాద్‌లో 18 శాతం, పుణేలో 4 శాతం వృద్ధి నమోదయింది.

నగరాల వారీగా విక్రయాలు

నగరం	జనవరి సెప్టెంబర్ 2023	జనవరి సెప్టెంబర్ 2022
ఢిల్లీ–ఎన్‌సీఆర్	3,409	1,511
ముంబై	3,252	2,398
హైదరాబాద్	1,660	138
పుణే	332	82
కోల్‌కతా	235	256
బెంగళూరు	229	196
చెన్నై	129	108

నిర్మాణంలో ఆఫీసు భవనాలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో ఆఫీసు భవనాల నిర్మాణం జోరందుకున్నాయి. బహుళజాతి కంపెనీలతో పాటు స్థానిక సంస్థలు విస్తరణ దశలో ఉండటంతో కొత్త నిర్మాణాలకు డిమాండ్ ఏర్పడింది. ప్రధానంగా గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, రాయదుర్గం వంటి పశ్చిమ హైదరాబాద్‌లోని కార్యాలయ భవనాలకు గిరాకీ ఎక్కువగా ఉంది. ప్రస్తుతం నగరంలో సుమారు 40 లక్షల చ.అ. విస్తీర్ణంలో వివిధ దశలలో ఆఫీసు భవనాలు నిర్మాణంలో ఉన్నాయని వెస్టియాన్ నివేదిక వెల్లడించింది. ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ఆఫీసు మార్కెట్ కరోనా తర్వాత వేగంగా పుంజుకుంది. మెరుగైన మౌలిక వసతులు, తక్కువ అద్దెలు, కాస్మోపాలిటన్ కల్చర్ వంటి కారణంగా బెంగళూరు, పుణే వంటి ఐటీ నగరాలకు హైదరాబాద్ గట్టి పోటీని ఇస్తుంది. ఐటీ, ఎలక్ట్రానిక్స్, బయో టెక్నాలజీ, రక్షణ పరిశోధనలకు కేంద్రమైన హైదరాబాద్‌లో గ్రేడ్ ఏ కార్యాలయాల అద్దెలు క్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. నగరంలో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ (సీబీడీ)లలో సగటు చదరపు అడుగు అద్దె ధర రూ.50కి చేరింది. ఐటీ సంస్థలకు కేంద్రమైన మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, మణికొండ, హైటెక్ సిటీ వంటి ప్రాంతాలలో ధర రూ.75కి చేరింది.






క్రెడాయ్ నూతన కార్యవర్గం

ప్రెసిడెంట్‌గా రాజశేఖర్ రెడ్డి ఎన్నిక

సాక్షి, హైదరాబాద్: కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) హైదరాబాద్ చాప్టర్‌కు నూతన కార్యవర్గం ఎన్నికైంది. ప్రెసిడెంట్‌గా వీ రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా బీ జగన్నాథరావు, ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా ఎస్ జైదీప్‌రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్లుగా బీ ప్రదీప్‌రెడ్డి, సీజీ మురళీ మోహన్, కొత్తపల్లి రాంబాబు, ఎం శ్రీకాంత్‌లు, ట్రెజరర్‌గా మనోజ్ కుమార్ అగర్వాల్, జాయింట్ సెక్రటరీలు జీ నితీష్ రెడ్డి, క్రాంతికిరణ్‌రెడ్డిలు ఎంపికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఏ వెంకట్ రెడ్డి, బీ జైపాల్ రెడ్డి, సంజయ్ కుమార్ బన్సల్, సీ అమరేందర్‌రెడ్డి, సుశీష్ కుమార్ జైన్, మోరిశెట్టి శ్రీనివాస్, శ్రీరామ్, ఎన్ వంశీధర్‌రెడ్డిలు వ్యవహరిస్తారు. 2023–25 సంవత్సరాలకు ఈ పదవిలో కొనసాగుతారు.

ఈ గోడలను జరపొచ్చు!

- ఘ్రూకలు, ప్యానెల్స్‌తో వాల్స్ నిర్మాణం
- ఇంటి లోపల గదులు వీటితోనే
- తక్కువ మందం, ఎక్కువ మన్నిక వీటి సొంతం
- లివింగ్ రూమ్, పిల్లల గదులలో ఎక్కువ వినియోగం



సాక్షి, హైదరాబాద్: ఇంట్లోని గదులలో ఎక్కువగా సమయం గడిపేది లివింగ్ రూమ్‌లోనే. అందుకే చాలా మంది ఈ గదికి ఎక్కువ విస్తీర్ణాన్ని కేటాయిస్తుంటారు. అయితే కరోనా తర్వాతి నుంచి ఇంటి స్వరూపం మారిపోయింది. కొనుగోలుదారుల అభిరుచులలో మార్పులు వచ్చాయి. దీంతో లివింగ్ రూమ్ విస్తీర్ణానికి కోత పెట్టి మాస్టర్ బెడ్ రూమ్, పిల్లల గదులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే బంధువులెవరైనా వచ్చినప్పుడు లివింగ్ రూమ్ చిన్నగా అనిపిస్తుందనే భావన నివాసితులకు కలుగుతుంది. అసలు లివింగ్ రూమ్‌లోని గోడలను అవసరం ఉన్నప్పుడు అటుఇటుగా కదిలించుకునే సౌలభ్యం ఉంటే ఎంత బాగుంటుంది కదూ. విదేశాల్లో ప్రాచుర్యం పొందిన ఈ తరహా సాంకేతికత ఇప్పుడిప్పుడే మన దేశంలోకి ప్రవేశిస్తుంది. హోటళ్లు, కన్వెన్షన్ హాళ్లలో కనిపించే ఈ కదిలే గోడలు క్రమంగా గృహాల్లోకి వచ్చేశాయి.

- రోజురోజుకు ఇళ్ల ధరలు పెరిగిపోతుండటంతో రూ.80 లక్షలకు పైగా వెచ్చిస్తే తప్ప 3 బీహెచ్‌కే ఫ్లాట్ దొరకని పరిస్థితి. ఇంటిలో ఉన్న విస్తీర్ణాన్ని అవసరానికి తగ్గట్టుగా సద్వినియోగం చేసుకునేలా నిర్మాణదారులు సరికొత్త సాంకేతిక ఆలోచనలు చేస్తున్నారు. గోడలు అనగానే ఇటుకలు, సిమెంట్ బ్లాక్స్‌తో కట్టేవే గుర్తుకొస్తాయి. ఇంటి లోపల ఇవే ఎక్కువ స్థలాన్ని ఆక్రమిస్తుంటాయి. వీటి స్థానంలో బిల్డర్లు ప్యానల్స్ వంటి ప్రత్యామ్నాయాలను ఉపయోగిస్తున్నారు. ఇవి తక్కువ మందం ఉండటంతో పాటు పటిష్టంగా, ఎక్కువ కాలం మన్నికతో ఉంటాయి.
- ఇంటి లోపల అంతర్గత గోడల కోసం ఈ ప్యానెల్స్‌ను ఎక్కువగా వినియోగిస్తుంటారు. అయితే గతంలో వీటిని కదిలించడానికి వీలు లేకుండా ఘ్రూకలతో బిగించేవారు. ఎలాగూ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నప్పుడు స్థిరంగా ఉండే బదులు కదిలేలా ఉంటే ఇంట్లో స్థలాన్ని ఎక్కువగా ఉపయోగించుకోవచ్చు. ఇంటీరియర్ డిజైనింగ్‌లోనూ ఈ కదిలే గోడలను వినియోగిస్తున్నారు.
- చిన్న పిల్లల గదిని పగటిపూట తగ్గించుకొని హాల్‌ను పెంచుకునేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇవి ఇంటీరియర్స్‌లో కలిసిపోయి ఉంటాయి కాబట్టి నివాసితులు చెబితే తప్ప ఎవరూ ఇవి కదిలే గోడలని గుర్తించలేరు. స్టూడియో అపార్ట్‌మెంట్స్‌లో స్థలం తక్కువగా ఉంటుంది కాబట్టి ఈ కదిలే గోడలనే ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఉదయం సమయంలో బెడ్‌ను కాస్త గోడకు నిలబెట్టేస్తే అదొక డిజైన్ మాదిరి కనిపిస్తుంటుంది. అయితే సంప్రదాయ గోడల కంటే వీటి నిర్మాణానికి వ్యయం ఎక్కువ అవుతుంది. చదరపు అడుగు వాల్ ప్యానెల్స్ రూ.75–80 నుంచి ప్రారంభమవుతాయి. బహిరంగ మార్కెట్‌తో పాటు ఆన్‌లైన్‌లోనూ వివిధ రకాల డిజైన్లు లభ్యమవుతాయి.

నేడు రాష్ట్రానికి మోదీ

▶ మొదటి పేజీ తరువాయి


క్రమంలో జరుగుతున్న బహిరంగసభకు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను 9 లేదా 10 శాతానికి పెంచే విషయంపైనా మోదీ ఏదైనా ప్రకటన చేయవచ్చునని ఊహాగానాలు సాగుతున్నాయి. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలు బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారిన నేపథ్యంలో రాష్ట్ర జనాభాలో బీసీలు, ఎస్సీ, ఎస్టీలు కలిపి 80 శాతానికి పైగానే ఉండటంతో వీరి మద్దతును కూడగట్టే దిశలో పార్టీ జాతీయ నాయకత్వం ప్రణాళికలు రచిస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగా.. శనివారం సాయంత్రం 5 గంటలకు ఎమ్మార్పీఎస్ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభ'లో ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2.35 నిముషాలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి సాయంత్రం 4.45కు ఆయన బేగంపేట ఎయిర్‌పోర్టులో దిగుతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన పరేడ్‌గ్రాండ్స్‌కు చేరుకుని సాయంత్రం 5 నుంచి 5.40 వరకు బహిరంగ సభలో పాల్గొంటారని పార్టీనేతల సమాచారం. సాయంత్రం 6 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ఆయన ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు. అదేవిధంగా ఈ నెల 26న నిర్మల్‌లో నిర్వహించే ఎన్నికల ప్రచారంలో కూడా మోదీ పాల్గొననున్నట్టు పార్టీనేతల సమాచారం. దీంతో పాటు రాష్ట్రపార్టీ ఎన్నికల ప్రచార పర్వం ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే సభకు సైతం మోదీ హాజరవుతారని పార్టీవర్గాలు వెల్లడించాయి.

కాంగ్రెస్‌లో మునుగోడు బీఆర్‌ఎస్ నేతల చేరిక

మునుగోడు: నల్లగొండ జిల్లా మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గంలో ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసిన అసంతృప్త నేతలు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మునుగోడు, నారాయణపురం, నాంపల్లి, చౌటుప్పల్ మండలాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులకు రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబపాలనను అంతమొందించడమే ఏకైక లక్ష్యమని పేర్కొన్నారు. అందుకు బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు ఆ పార్టీకి రాజీనామా చేసి తనకు అండగా నిలుస్తున్నందుకు ఆనందంగా ఉందని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ గూటికి చేరినవారిలో నాంపల్లి, మునుగోడు జెడ్పీటీసీ సభ్యులు ఏలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి, నారబోయిన స్వరూపరాణిరవి, నారాయణపురం ఎంపీపీ గుత్తా ఉమాప్రేమ్‌చందర్‌రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మునుగోడు కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీక్, మునుగోడు, నాంపల్లి వైస్ ఎంపీపీలు అనంత వీణలింగస్వామి, పానుగంటి రజితవెంకన్న, సోలిపురం సర్పంచ్ నకిరేకంటి పద్మయాదయ్య, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, పలువురు వార్డుసభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

ఏపీ కేబినెట్ కళ్లుగప్పి ఖజానాకు కన్నం

యథేచ్ఛగా ఇసుక లూటీ సాగించిన చంద్రబాబు



- మెమో, జీవోలు మంత్రివర్గం ఆమోదం లేకుండానే జారీ
- ఒకపక్క ఉచితమంటూనే మరోపక్క జరిమానాలు.. కావాల్సిన వారికి సంతర్పణకే
- ఇప్పుడు పారదర్శకంగా తవ్వకాలతో ఖజానాకు రూ.770 కోట్ల ఆదాయం
- నాడు రూ.వేల కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన బాబు.. అడ్డుకున్న అధికారులపై దాడులకు తెగబడ్డ పచ్చ ముఠాలు
- కరకట్ట నివాసం పక్కనే కొల్లగొడుతున్నా మొద్దునిద్రను ఆక్షేపించిన ఎన్జీటీ

సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో ఇసుక దోపిడీకి బరి తెగించిన మాజీ సీఎం చంద్రబాబు ఉచిత విధానం ముసుగులో నిర్భీతిగా అన్ని విధి విధానాలను ఉల్లంఘించారు. ఒకపక్క ఇసుక ఉచితమంటూనే మరోపక్క అక్రమ తవ్వకాలకు భారీ జరిమానాలంటూ మెలిక పెట్టారు. కేంద్ర ప్రభుత్వ చట్టం, గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను తుంగలో తొక్కడంతోపాటు కేబినెట్‌ను చీకట్లో ఉంచి మరీ దోపిడీకి తెరతీశారు. కేబినెట్ ఆమోదం లేకుండా మొదట ఓ మెమో.. తరువాత జీవో ద్వారా ఇసుక దందాకు తెగబడ్డారు. ఇప్పుడు పారదర్శకంగా ఇసుక తవ్వకాలను నిర్వహిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రెండేళ్లలో దాదాపు రూ.770 కోట్ల మేర ఆదాయం సమకూరింది. అంటే గత సర్కారు హయాంలో దాదాపు రూ.వెయ్యి కోట్ల ఆదాయానికి ఖజానాకు చంద్రబాబు గండి కొట్టినట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వానికి రావాల్సిన ఆ ఆదాయం అంతా పచ్చ ముఠాలకు చేరిపోయింది. అంతేకాకుండా ఉచితం ముసుగులో టీడీపీ నేతలు విచ్చలవిడిగా దోపిడీ పర్వం సాగించారు. వీటిని అడ్డుకున్నందుకు ఎమ్మార్వో వనజాక్షిపై నాటి టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విచక్షణా రహితంగా దాడులకు బరి తెగించారు. స్వయంగా నాటి సీఎం చంద్రబాబు కరకట్ట నివాసం పక్కనే ఇష్టారాజ్యంగా ఇసుక లూటీ జరుగుతున్నా కళ్లు మూసుకుని కూర్చోవడాన్ని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) తీవ్రంగా తప్పుబడుతూ భారీ జరిమానా సైతం విధించింది. రాష్ట్ర సంపదను దోచేస్తున్నారని ఆక్షేపించినా చంద్రబాబు చలించలేదు. ఈ ఇసుక దోపిడీ కేసులో సీఐడీ తీగ లాగుతుంటే పచ్చ ముఠాల డొంక కదులుతోంది.

ఆది నుంచి కన్ను: 2014లో టీడీపీ అధికారంలోకి రాగానే ఇసుక రీచ్‌లను రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ద్వారా జిల్లా, మండల మహిళా సమాఖ్యలకు అప్పగించినట్లు చంద్రబాబు కథ నడిపారు. మహిళా సమాఖ్యల ముసుగులో రెండేళ్ల పాటు భారీగా ఇసుక కొల్లగొట్టినా ఆయన సంతృప్తి చెందలేదు. కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సుల మేరకు 2016లో ఏపీఎండీసీ ద్వారా ఇసుక రీచ్‌లను వేలం వేసి ఇసుక విధానాన్ని రూపొందించారు. ఈమేరకు కేబినెట్ తీర్మానం చేసి 2016 జనవరి 1న జీవో 19 ఇవ్వగా అదే ఏడాది జనవరి 15న జీవో 20 వెలువడింది. ఈ విధానం ద్వారా కూడా మిగిలిన మూడేళ్లలో తాను ఆశించిన మేరకు ఇసుక దోపిడీ సాధ్యం కాదని భావించిన చంద్రబాబు రెండు నెలల్లోనే టెండర్ల ద్వారా ఇసుక రీచ్ కేటాయింపు విధానాన్ని పక్కన పెట్టేశారు.

కేబినెట్‌ను చీకట్లో ఉంచి..

ఇష్టారాజ్యంగా దోపిడీకి చంద్రబాబు తెరపైకి తెచ్చిన విధానమే 'ఉచిత ఇసుక విధానం'!

ఎంత ఇసుక అందుబాటులో ఉంది? ఎంత తవ్వుతున్నాం? ఎంతకు అమ్ముతున్నాం? అనే ప్రాథమిక లెక్కలతో కూడా నిమిత్తం లేకుండా యథేచ్ఛగా కాజేసేందుకు ఈ విధానాన్ని తెచ్చారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ చట్టాన్ని, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను తుంగలోకి తొక్కారు. రాష్ట్ర ఆర్థిక శాఖ ఆమోదం లేకుండానే కథ నడిపారు. అందుకోసం 2016 మార్చి 4న మెమో 3066 జారీ చేశారు. అది కూడా అప్పటికి రెండు రోజుల ముందు నుంచి అంటే 2016 మార్చి 2 నుంచే ఉచిత ఇసుక విధానం అమలులోకి వచ్చినట్లు అందులో పేర్కొనడం గమనార్హం. అప్పటివరకు కేబినెట్ ఆమోదంతో అమలులో ఉన్న ఇసుక విధానాన్ని తొలగిస్తూ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టినట్లు మెమో జారీ చేశారు. ఈ మెమోకు కేబినెట్ ఆమోదం లేదు. అంటే కేబినెట్ ఆమోదంతో రూపొందించిన విధానాన్ని పక్కనపెట్టి అడ్డదారిలో మెమో ఇచ్చినట్లు స్పష్టమవుతోంది.

అక్రమంగా ఇసుక తవ్వకాలపై భారీ జరిమానాలు విధించేందుకు విధివిధానాలను నిర్దేశిస్తూ 2016లో గత సర్కారు జీవో 35 జారీ చేసింది. రెండు నెలల తరువాత అంటే 2016 ఏప్రిల్ 6న జీవో 43 వెలువరించి అప్పటివరకు మెమో ద్వారా అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానానికి రాజముద్ర వేసింది. విడ్డూరం ఏమిటంటే ఆ జీవో 43కు కూడా కేబినెట్ ఆమోదం లేదు. కేబినెట్ ఆమోదం లేకుండానే ఉచిత ఇసుక విధానాన్ని దొడ్డిదారిలో తెచ్చి ఇసుక దోపిడీకి చంద్రబాబు తెరతీశారు.

పచ్చ ముఠాలకే ఉచితం

రాష్ట్రంలో ఇసుకను ప్రజలందరికీ ఉచితంగా ఇస్తున్నట్లు చంద్రబాబు నమ్మబలికారు.

అందుకోసం కేబినెట్ ఆమోదం లేకుండా జారీ చేసిన మెమో 3066, జీవో 43 మధ్యలో మరో జీవో కూడా తెచ్చారు. 2016 మార్చి 14న జారీ చేసిన ఆ జీవో ద్వారా అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టేందుకు భారీ జరిమానాలను నిర్దేశించారు. ఇసుక ఉచితం అన్నప్పుడు ఇక అక్రమ తవ్వకాలు అనే మాటే ఉత్పన్నం కాకూడదు కదా? అంటే ఉచిత ఇసుక విధానం పేరుతో చంద్రబాబు కనికట్టు చేశారన్నది స్పష్టమైంది. ఆ పేరుతో కేవలం చంద్రబాబు బినామీలు, సన్నిహితులు, టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇసుక రీచ్‌లను గుప్పిట్లో పెట్టుకున్నారు. మూడేళ్లపాటు దోపిడీకి పాల్పడ్డారు. ఇతరులు ఇసుక రీచ్‌ల జోలికి రాకుండా కట్టడి చేసేందుకే జీవో 35 తెచ్చారు. కొసమెరుపు ఏమిటంటే జీవో 35కు కూడా కేబినెట్ ఆమోదం లేదు. ఉచిత ఇసుక విధానం పేరుతో తెచ్చిన మెమో 3066, అనంతరం జారీ చేసిన జీవోలు 35, 43లకు కేబినెట్ ఆమోదం లేదన్నది నిర్ధారణ అయింది. వాటికి సంబంధించిన నోట్ ఫైళ్లు అటు ఏపీఎండీసీలోగానీ ఇటు గనుల శాఖ, జలవనరుల శాఖ కార్యాలయాల్లోగానీ లేవని సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. ఇసుక దోపిడీ కోసం చంద్రబాబు పక్కాగా సాగించిన పన్నాగంపై పూర్తి ఆధారాలతో సీఐడీ దర్యాప్తును ముమ్మరం చేసింది.

సాధికార నినాదానికి.. జన నీరాజనం

- తంబళ్లపల్లె, పెదకూరపాడు, పార్వతీపురం నియోజకవర్గాల్లో ఘనంగా యాత్ర



మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో ఆర్కే వ్యాలీ పోలీస్‌స్టేషన్ ప్రారంభించిన అనంతరం అధికారులు, సిబ్బందితో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మీ ప్రోత్సాహం మరువలేను

వేముల మండల నాయకులతో సీఎం జగన్

ఇడుపులపాయ, జమ్మలమడుగు నూతన పోలీస్‌స్టేషన్లు ప్రారంభం

సాక్షి ప్రతినిధి, కడప: పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి కోసం అలుపెరగకుండా శ్రమిస్తూ ప్రజలకు సహకారం అందిస్తున్న వేముల మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులకు ధన్యవాదాలు తెలియచేస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా వైఎస్సార్ జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం ఉదయం ఇడుపులపాయ ఆర్కే వ్యాలీలో రూ.1.75 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్, రూ.2.75 కోట్లతో నిర్మించిన జమ్మలమడుగు పోలీస్ స్టేషన్లను ప్రారంభించారు. అనంతరం నెమళ్ల పార్కు వద్ద వైఎస్ ఫ్యామిలీ ప్రేయర్ హాలు ప్రాంగణంలో వేముల మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. స్థానికులు, స్నేహితులు, సన్నిహితులను ఒకేచోట కలుసుకున్న సీఎం జగన్ వారిని పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. దివంగత వైఎస్సార్ హఠాన్మరణం అనంతరం మీరంతా అందించిన ప్రోత్సాహం, సహకారం, మనోధైర్యంతో ఈరోజు ముఖ్యమంత్రిగా అందరి మేలు కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. పులివెందుల నియోజకవర్గం, వేముల మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఈ సందర్భంగా చర్చించారు. కాగా, రెండు రోజుల జిల్లా పర్యటన ముగించుకుని గన్నవరం వెళ్లేందుకు మధ్యాహ్నం కడప ఎయిర్‌పోర్టు చేరుకున్న ముఖ్యమంత్రి జగన్ దంపతులకు పలువురు ఘనంగా వీడ్కోలు పలికారు.

నోటీసులు పంపడంలో జాప్యం ఎందుకైంది?

- స్కిల్ కేసులో ఉండవల్లి పిల్‌పై హైకోర్టు విచారణ
- చంద్రబాబు, తదితరులకు నోటీసుల జారీలో జాప్యంపై ధర్మాసనం విస్మయం.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్‌కు ఆదేశం
- తదుపరి విచారణ 29కి వాయిదా

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి అప్పగించాలంటూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)లో తదుపరి విచారణ ఈ నెల 29కి వాయిదా పడింది. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న చంద్రబాబు నాయుడు, అచ్చెన్నాయుడు, సీబీఐతో పాటు మొత్తం 44 మందికి తాము అక్టోబర్ 13న నోటీసులు జారీ చేస్తే, వాటిని హైకోర్టు రిజిస్ట్రీ ఈ నెల 9న పంపడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఈ జాప్యానికి బాధ్యులైన వారిని గుర్తించాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. అంతేకాక ఈ వ్యవహారంపై విచారణ జరపాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అంతకుముందు ఉండవల్లి అరుణ్‌కుమార్ తరపున సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి వాదనలు వినిపిస్తూ, నోటీసులు పంపడంలో జరిగిన జాప్యాన్ని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఆ జాప్యానికి బాధ్యులపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. రికార్డులను ధర్మాసనం పరిశీలించింది. ఈ వ్యాజ్యంలో కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఐడీని ఆదేశించింది.

కాంగ్రెస్ హామీలన్నీ అబద్ధాలే

కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చే హామీలన్నీ అబద్ధాలేనని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖల సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఆరోపించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోపై ప్రజలకు నమ్మకం లేదనే గ్యారంటీ అనే కొత్త పదాన్ని తీసుకువచ్చిందన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణను కాంగ్రెస్‌కు ఏటీఎం కానివ్వబోమన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. బీసీ లీడర్ షిప్‌తో అనేక రాష్ట్రాల్లో అభివృద్ధి జరిగిందని, ఇప్పుడు తెలంగాణలో అభివృద్ధి జరగాలంటే బీసీలకే అధికారం ఇవ్వాలని బీజేపీ నిర్ణయించిందని వెల్లడించారు. సినీనటి రష్మిక డీప్ ఫేక్ వీడియోపై కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పందించారు. కేంద్ర ప్రభుత్వం డీప్ ఫేక్ వీడియోలపై దృష్టి పెట్టిందన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. హద్దులు మీరే సోషల్ మీడియా నియంత్రణకు సైతం చర్యలు తీసుకుంటామని చెప్పారు. వచ్చే ఫిబ్రవరి నుంచి నిబంధనలు కఠినతరం చేస్తామని రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు.

మార్పులతో బీజేపీ ఐదో జాబితా!

అధికారిక ప్రకటన తర్వాత కూడా మార్పులు

- 14 మంది పేర్లతో విడుదల.. మూడు చోట్ల అభ్యర్థుల మార్పు
- వేములవాడలో తుల ఉమ స్థానంలో చెన్నమనేని వికాస్‌రావుకు చోటు
- సంగారెడ్డిలో దేశ్‌పాండే స్థానంలో పులిమామిడి రాజు
- పొత్తుతో 111 చోట్ల బీజేపీ, 8 చోట్ల జనసేన పోటీ

సాక్షి, న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల చివరి రోజున బీజేపీ అధిష్టానం విడుదల చేసిన పార్టీ అభ్యర్థుల ఐదో జాబితా గందరగోళానికి దారితీసింది. తీవ్ర కసరత్తు అనంతరం శుక్రవారం 14 మంది అభ్యర్థులతో చివరి జాబితాను బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ విడుదల చేసింది. ఇందులో 11 మంది కొత్తవారు కాగా.. మిగతా నలుగురు మార్పులతో టికెట్ దక్కించుకున్నవారు. కానీ అధికారికంగా ప్రకటించిన తర్వాత కూడా ఐదో జాబితాలోని మూడు చోట్ల అభ్యర్థులను మార్చడం గందరగోళానికి తెరలేపింది.

- ➤ ఇటీవల వేములవాడ నుంచి తుల ఉమ పేరును ప్రకటించిన బీజేపీ అధిష్టానం అనూహ్యంగా బీఫాంను చెన్నమనేని వికాస్‌రావుకి ఇచ్చింది.
- ➤ సంగారెడ్డి నుంచి దేశ్‌పాండే రాజేశ్వర్‌రావు పేరును ఐదో జాబితాలో ప్రకటించినా.. అక్కడ పులిమామిడి రాజుకు బీఫాం అందింది.
- ➤ బెల్లంపల్లి (ఎస్సీ) నుంచి తొలి జాబితాలో సీటు పొందిన అమరాజుల శ్రీదేవిని మారుస్తూ.. కొయ్యల ఏమాజీ పేరు ప్రకటించారు. కాసేపటికే మళ్లీ అమరాజుల శ్రీదేవినే బరిలో ఉంటారని ప్రకటించి బీఫామ్ ఇచ్చారు.
- ➤ ఐదో జాబితాలో అలంపూర్ నుంచి మారెమ్మ బరిలో ఉంటారని చెప్పినా.. సాయంత్రానికి మార్చేసి, రాజగోపాల్ పేరు ప్రకటించారు.
- ➤ చాంద్రాయణగుట్టలో సత్యనారాయణ ముదిరాజ్‌కు బదులు కె.మహేందర్‌ను ఎంపిక చేశారు.
- ➤ మూడో జాబితాలో వనపర్తికి అశ్వత్థామరెడ్డి పేరు ప్రకటించగా.. తాజా జాబితాలో అనుజ్ఞారెడ్డిని అక్కడ బరిలో దింపారు.
- ➤ ఐదు జాబితాల్లో కలిపి మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను.. 111 మంది అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. పొత్తులో భాగంగా మిగతా 8 స్థానాల్లో జనసేన బరిలో ఉంది.

బీజేపీ ఐదో జాబితా ఇదీ..

నియోజకవర్గం	అభ్యర్థి
1.బెల్లంపల్లి (ఎస్సీ)	అమరాజుల శ్రీదేవి (కొయ్యల ఏమాజీ స్థానంలో)
2.పెద్దపల్లి	దుగ్యాల ప్రదీప్
3.సంగారెడ్డి	పులిమామిడి రాజు (దేశ్‌పాండే రాజేశ్వర్‌రావు స్థానంలో)
4.మేడ్చల్	ఏనుగు సుదర్శన్‌రెడ్డి
5.మల్కాజిగిరి	ఎస్.రామచందర్‌రావు
6.శేరిలింగంపల్లి	రవికుమార్ యాదవ్
7.నాంపల్లి	రాహుల్‌చంద్ర
8.చాంద్రాయణగుట్ట	కె.మహేందర్
9.కంటోన్మెంట్(ఎస్సీ)	గణేశ్ నారాయణ్
10.దేవరకద్ర	కొండా ప్రశాంత్‌రెడ్డి
11.వనపర్తి	అనుజ్ఞారెడ్డి
12.అలంపూర్(ఎస్సీ)	రాజగోపాల్ (మారెమ్మ స్థానంలో)
13.నర్సంపేట	కె.పుల్లారావు
14.మధిర(ఎస్సీ)	పెరుమార్పల్లి విజయరాజు
15.వేములవాడ	చెన్నమనేని వికాస్‌రావు (తుల ఉమ స్థానంలో)

కాంగ్రెస్ అభ్యర్థుల ఖర్చు కేసీఆరే ఇస్తున్నారు




- కేసీఆర్ మళ్లీ వస్తే ప్రభుత్వ ఉద్యోగులకు మూడు నెలలకోసారి జీతాలు
- సిర్పూర్ సభ, సిరిసిల్ల ర్యాలీల్లో బండి సంజయ్

సిర్పూర్(టి)/కౌటాల, సిరిసిల్ల: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒక్కటేనని, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల ఎన్నికల ఖర్చును బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆరే పెడుతున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. అందుకే కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచినా బీఆర్‌ఎస్‌లోకి వెళ్తారని చెప్పారు. బీఆర్‌ఎస్‌లోని పలువురు అభ్యర్థులను ఓడించేది కూడా కేసీఆరేనని అని తీవ్ర ఆరోపణలు చేశారు. కుమురంభీం జిల్లా సిర్పూర్(టి)లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబుకు మద్దతుగా శుక్రవారం నిర్వహించిన విజయ సంకల్ప సభలో సంజయ్ మాట్లాడారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులకు మూడు నెలలకోసారి జీతాలిస్తారని వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్ ఇటీవల ఫాంహౌస్‌లో చేసింది రాజశ్యామల యాగం కాదని.. వశీకరణ పూజలు చేశారని ఆరోపించారు.

బీసీని సీఎం చేస్తామంటే ఓర్వలేకపోతున్నారు.

బీజేపీ ఈ రాష్ట్రంలో బీసీని ముఖ్యమంత్రిని చేస్తామంటే బీఆర్‌ఎస్ ఓర్వలేకపోతోందని బండి సంజయ్ అన్నారు. కులం కంటే గుణం ముఖ్యమని కేసీఆర్ అంటూ బీసీలను అవమానిస్తున్నడని.. వాళ్ల సీఎం పదవికి పనికిరారా.. అని ప్రశ్నించారు. సిరిసిల్లలో బీజేపీ అభ్యర్థిగా రాణీరుద్రమ శుక్రవారం నామినేషన్ వేయగా.. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. బీజేపీ రాష్ట్రంలో లేదని అహంకారంతో బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని.. కానీ పార్టీ ప్రజల గుండెల్లో ఉందని సంజయ్ వ్యాఖ్యానించారు. బీజేపీకి అవకాశమిస్తే ఎలాంటి మచ్చ లేని పేద బీసీ నాయకుడు సీఎం అవుతారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ విన్యాసాలు చేస్తున్నాయి: కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: బీసీని సీఎం చేస్తామని బీజేపీ ప్రకటించాక కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దిక్కుతోచని స్థితిలో విన్యాసాలు చేస్తున్నాయని పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నైరాశ్యంలో, ఓటమి భయంతో సిద్ధరామయ్య ద్వారా బీసీ డిక్లరేషన్ చేసిందన్నారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పైనా బీజేపీ బీసీ సీఎం ప్రభావంఉందన్నారు. అందులోనూ ఎలాంటి పసలేదని విమర్శించారు. శుక్రవారం బీజేపీ మీడియా సెంటర్లో ఆయన మాట్లాడుతూ...మసిపూసి మారేడుకాయ చేసి..కొత్త సీసాలో పాత సారా అన్నట్లుగా కాంగ్రెస్ డిక్లరేషన్ ఉందన్నారు. బీసీ వర్గాల నుంచి ప్రధాని కావడంతో బీసీలకు బీజేపీపైనే నమ్మకం, గురి ఏర్పడిందని వివరించారు. కాంగ్రెస్‌లో అందరూ సీఎం మేమంటే మేమని నల్లగొండ బ్రదర్స్, జానారెడ్డి, ఉత్తమ్ రెడ్డి, జగ్గారెడ్డి ప్రకటిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ గతంలోనే...రాష్ట్రంలో రాజారాం, జగన్నాథరావు, కొండా లక్ష్మణ్ బాపూజీ, డి.శ్రీనివాస్‌లను ఎందుకు సీఎం చేయలేదని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ సమగ్ర కుటుంబ సర్వే చేసి బయట పెట్టకుండా రాజకీయ అవసరాల కోసం వాడుకుంటోందని ఆరోపించారు. శనివారం పరేడ్‌గ్రౌండ్స్‌లో ఎమ్మార్పీఎస్ నిర్వహిస్తున్న అణగారిన కులాల విశ్వరూప మహాసభలో ఆయా వర్గాలకు భరోసా ఇవ్వడానికి ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు.

కమలంలో కొత్త లొల్లి

నామినేషన్ల చివరిరోజు కొందరు అభ్యర్థుల మార్పు

- అసంతృప్తితో రగిలిపోతున్న బీజేపీ నేతలు
- జాబితాలో ప్రకటించినా బీఫాం లు ఇవ్వకపోవడంపై ఆగ్రహం
- ఆత్మహత్య చేసుకుంటానంటూ కిషన్‌రెడ్డికి దేశ్‌పాండే ఫోన్!

సాక్షి, హైదరాబాద్: నామినేషన్ల దాఖలు చివరిరోజు అభ్యర్థుల జాబితాలో కొన్ని మార్పులు చేసి, ఇదివరకే ప్రకటించిన వారికి బీఫాంలు ఇవ్వకపోవడం బీజేపీకి కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. టికెట్లు దక్కని వారితో పాటు జాబితాలో ప్రకటించినా బీఫామ్స్ దక్కని వారిలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. శుక్రవారం ప్రకటించిన 14 మంది అభ్యర్థుల జాబితా అంతా వివాదాస్పదం కావడంతో సమస్య మరింత ముదిరింది. వేములవాడలో తుల ఉమకు బదులు వికాస్‌రావుకు, సంగారెడ్డిలో రాజేశ్వర్ దేశ్‌పాండేకు బదులు పులిమామిడి రాజుకు బీఫామ్‌లు ఇవ్వడంతో తుల ఉమ, దేశ్‌పాండే కన్నీటి పర్యంతం అయ్యారు. స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలవనున్నట్లు ప్రకటించడంతో పార్టీ నాయకులు వారిని బుజ్జగించే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

చివరి క్షణంలో పలువురికి చెయ్యి

బీసీ మహిళ (కురుమ) ఉమకు టికెట్ కోసం ఈటల రాజేందర్ గట్టిగా పట్టుబట్టారు. ఆమెకు సీటు కేటాయించకపోతే తాను ఎన్నికల్లో పోటీ చేయనని అల్టిమేటమ్ కూడా ఇచ్చారు. దీంతో నాయకత్వం దిగివచ్చినట్టు ప్రచారం జరిగింది. కానీ చివరకు బీఫామ్ ఇవ్వలేదు. సంగారెడ్డిలో పులిమామిడి రాజుకు కూడా సీటు కేటాయించాలని ఈటల కోరారు. దీంతో ఏదో ఒక సీటు ఎంపిక చేసుకోవాలని అధిష్టానం సూచించిందని, గెలిచే అవకాశాలున్న సంగారెడ్డి వైపు ఈటల మొగ్గుచూపినట్టుగా తెలుస్తోంది. కాగా తనను నామినేషన్ వేసుకోమని చెప్పి బీఫామ్ ఇవ్వకపోవడంపై తీవ్ర మనస్థాపానికి గురైన దేశ్‌పాండే.. కిషన్‌రెడ్డికి ఫోన్‌చేసి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానంటూ హెచ్చరించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జాబితాలో బెల్లంపల్లి స్థానానికి ఏమాజీ పేరుంటే శ్రీదేవిని, అలంపూర్‌లో మారెమ్మ ప్లేస్‌లో రాజగోపాల్‌ను బీజేపీ ఖరారు చేయడం కూడా వివాదానికి తెరతీసింది.

అనూహ్యంగా కంటోన్మెంట్ సీటు...

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను చివరి నిమిషం వరకు కాంగ్రెస్‌లోనే ఉండి ఇంకా బీజేపీలో చేరని సాయి గణేష్‌కు కేటాయించడంపై కూడా పార్టీ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇక్కడ మాజీ డీజీపీ కృష్ణప్రసాద్‌కు నామినేషన్ వేసేందుకు సిద్ధం కావాలంటూ చెప్పిన బీజేపీ.. ఆయనకు మొండి చేయి చూపి సాయి గణేష్‌కు టికెట్ కేటాయించడం పార్టీలో తీవ్ర చర్చనీయాంశమైంది. అదేవిధంగా తుది జాబితాలో పోటీకి సుముఖంగా లేని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావుకు మల్కాజిగిరి సీటును కేటాయించడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. మల్కాజిగిరి టికెట్ కోసం ఆకుల రాజేందర్, బీజేవైఎం అధ్యక్షుడు భానుప్రకాష్ మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో నాయకత్వం మధ్యే మార్గంగా రామచంద్రరావుకు అవకాశం ఇచ్చినట్టు సమాచారం. దీంతో భానుప్రకాష్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. శేరిలింగంపల్లి టికెట్‌ను రవికుమార్ యాదవ్‌కు కేటాయించడంతో గత కొంతకాలంగా ఇక్కడ పనిచేస్తూ ఈ సీటును గట్టిగా కోరుకున్న గజ్జెల యోగానంద్ ఎలాంటి కార్యాచరణకు దిగుతారనేదది చర్చనీయాంశమైంది.

బీసీలకు 36 సీట్లు



బీజేపీ ప్రకటించిన మొత్తం 111 సీట్లలో (జనసేనకు 8 సీట్లు) బీసీలు-36, ఓసీ-44 (రెడ్డి-29, వెలమ-8, కమ్మ-3, బ్రాహ్మణ-2, వైశ్య-1, నార్త్ ఇండియన్ అగర్వాల్-1) ఎస్సీ 19+2 (రిజర్వ్‌డ్‌తో పాటు అదనంగా 2 జనరల్ సీట్లు (నాంపల్లి, చాంద్రాయణగుట్ట), ఎస్టీలకు 10 కేటాయించారు. బీసీలకు ఇతర పార్టీల కంటే అధిక సీట్లనే కేటాయించినా.. 40కి పైగా సీట్లు కేటాయిస్తామనే హామీని నేతలు నిలబెట్టుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా మాదిగలకు ఎక్కువ ప్రాధాన్యం దక్కింది. 21 స్థానాలను ఎస్సీలకు కేటాయించగా, అందులో మాదిగ సామాజిక వర్గానికి 14, మాల సామాజిక వర్గానికి 7 ఇచ్చారు. బీసీలకు కేటాయించిన 36 సీట్లలో ముదిరాజ్ 9, మున్నూరు కాపు 7, యాదవ 5, గౌడ 5, పెరిక 2 లోధ్ 2 పద్మశాలి, ఆరే కటిక, లింగాయత్, వాల్మీకి బోయ, ఆరే క్షత్రియ, విశ్వకర్మలకు ఒక్కో సీటు కేటాయించారు.

పొత్తుతో ప్రయోజనం లేదు

- జనసేనకు కామన్ సింబల్ లేక ఇండిపెండెంట్లుగానే బరిలోకి..
- బీజేపీ నాయకుల పెదవి విరుపు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అంతగా పట్టు, గుర్తింపు లేని జనసేనపార్టీకి 8 సీట్లు కేటాయించినా దాని వల్ల తమ పార్టీకి రాజకీయంగా పెద్దగా ప్రయోజనం లేకుండా పోతోందని బీజేపీ నేతలు పెదవి విరుస్తున్నారు. జనసేన రాష్ట్రంలో రిజిస్టర్డ్ రాజకీయ పార్టీ కాకపోవడంతో ఎన్నికల్లో పోటీకి 'కామన్‌సింబల్'దక్కలేదు. ఆ పార్టీకి గతంలో కేటాయించిన 'గాజు గ్లాసు'గుర్తును కూడా ఈసీ కేటాయించకపోవడంతో, ఆ పార్టీ అభ్యర్థులు 8 స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులుగానే బరిలో నిలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జనసేనకు కేటాయించిన కూకట్‌పల్లి, తాండూ రు, కోదాడ, నాగర్‌కర్నూల్, ఖమ్మం, కొత్తగూడెం, వైరా, అశ్వారావుపేట సీట్లలో పలువురు టికెట్ ఆశించిన బీజేపీ నాయకులు నిరాశలో కూరుకుపోయారు. కూకట్‌పల్లి, తాండూరు, కోదాడ, నాగర్‌కర్నూల్ సీట్లలో ప్రజల్లో బీజేపీకి సానుకూలత ఉన్నా జనసేనకు ఆ సీట్లు కేటాయించడంతో అసంతృప్తి నెలకొంది. దీంతో జనసేన పొత్తుతో బీజేపీకి ప్రయోజనం లేని పరిస్థితి ఏర్పడిందని బీజేపీ నేతలు వాపోతున్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
11-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
72	30
64,905	19,425

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,726	▲	2
డోజోన్స్	34,145	▲	253
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,360	▼	95
డాక్స్	15,234	▼	118
షాంఘై	3,039	▼	14
నికాయ్	32,568	▼	78

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,240	▲	143
బంగారం (99.5 స్వచ్ఛత)	59,999	▲	143
వెండి (కిలో)	70,416	▲	116

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	82.53	84.20
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	100.23	103.53
€	యూరో	ఒకటికి	87.43	90.47
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	54.27	55.92
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	51.83	54.14
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	59.32	61.67
SAR	సౌదీ రియాల్	ఖాయమనకు	22.27	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాయమనకు	21.79	23.59
¥	చైనా యువాన్	ఖాయమనకు	10.31	12.38

బంగారానికి ధనత్రయోదశి డిమాండ్

పసిడి, వెండి కాయిన్ల కొనుగోళ్లు



న్యూఢిల్లీ: దీపావళికి ముందు ధనత్రయోదశి సందర్భంగా శుక్రవారం బంగారం షాపులు సందడిగా కనిపించాయి. సాధారణ రోజులతో పోలిస్తే బంగారం, వెండి విక్రయాలకు డిమాండ్ ఏర్పడింది. బంగారం ధరలు కూడా కొంత తగ్గడం సానుకూలించింది. అక్టోబర్ 28న 10 గ్రాముల బంగారం (24 క్యారెట్లు) రూ.63,000 వరకు వెళ్లగా, అక్కడి నుంచి రూ.1,500 వరకు తగ్గడంతో వినియోగదారులు కొనుగోళ్లకు ఆసక్తి చూపించారు. ధనత్రయోదశి నాడు బంగారం కొనుగోలు చేస్తే మంచి దనే నమ్మకం ఎక్కువ మందిలో ఉండడం తెలిసిందే. గురువారం బంగారం 10 గ్రాముల ధర రూ.400 తగ్గి రూ.60,950 వద్ద ముగియగా, ధనత్రయోదశి సందర్భంగా ఢిల్లీలో 10 గ్రాములకు రూ.50,139 (పన్నులు కాకుండా) పలికింది. సాధారణంగా ధనత్రయోదశి నాడు దేశవ్యాప్తంగా 20–30 టన్నుల వరకు బంగారం అమ్ముడుపోతుంటుంది. మధ్యాహ్నం తర్వాత నుంచి షాపులకు కస్టమర్ల రాక పెరిగినట్టు వర్తకులు తెలిపారు. మధ్యాహ్నం తర్వాత త్రయోదశి రావడం తెలిసిందే. శనివారం మధ్యాహ్నం వరకు త్రయోదశి ఉంటున్నందున కొనుగోళ్లు మరింత పెరగొచ్చని వర్తకుల అంచనాగా ఉంది. ''బంగారం ధరలు వ్యాపారానికి అనుకూలంగా ఉన్నాయి. మంచి విక్రయాలు నమోదవుతాయని భావిస్తున్నాం. కస్టమర్ల నుంచి మంచి స్పందన వస్తోంది''అని అఖిల భారత జెమ్ అండ్ జ్యుయలరీ డొమెస్టిక్ కౌన్సిల్ డైరెక్టర్ దినేష్ జైన్ తెలిపారు.

రాత్రి 8 గంటల వరకు అందిన సమాచారం మేరకు దేశవ్యాప్తంగా రూ.30,000 కోట్ల విలువ చేసే బంగారం, వెండి ఆభరణాలు, ఆర్టికల్స్ కొనుగోళ్లు జరిగాయి. ఇందులో బంగారం కొనుగోళ్లు రూ.27,000 కోట్లుగా, వెండి కొనుగోళ్లు రూ.3,000 కోట్ల వరకు ఉంటాయని ఆల్ ఇండియా జ్యుయలర్స్, అండ్ గోల్డ్ స్మిత్స్ ఫెడరేషన్ నేషనల్ ప్రెసిడెంట్ పంకజ్ అరోరా తెలిపారు. గతేడాది ధనత్రయోదశి రోజున బంగారం, వెండి కొనుగోళ్లు రూ.25,000 కోట్లుగా ఉన్నాయి.

నెమ్మదించిన పారిశ్రామికోత్పత్తి



సెప్టెంబర్‌లో ఐఐపీ 5.8%కి పరిమితం

న్యూఢిల్లీ: దేశీయంగా పారిశ్రామికోత్పత్తి వృద్ధి నెలవారీగా చూస్తే సెప్టెంబర్‌లో మందగించింది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 5.8 శాతానికి పరిమితమైంది. ఆగస్టులో ఇది 10.3 శాతంగా ఉంది. గతేడాది సెప్టెంబర్‌లో ఐఐపీ 3.3 శాతంగా నమోదైంది. తాజాగా తయారీ, మైనింగ్ రంగాలు మెరుగుపడ్డాయి. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య కాలంలో నమోదైన 7.1 శాతంతో పోలిస్తే సమీక్షాకాలంలో ఐఐపీ 6 శాతానికి పరిమితమైంది. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన ఐఐపీ గణాంకాల ప్రకారం..

- తయారీ రంగ వృద్ధి 4.5 శాతంగా (గత సెప్టెంబర్‌లో రెండు శాతం) నమోదైంది.
- విద్యుదుత్పత్తి వృద్ధి గత సెప్టెంబర్‌లో 11.6 %గా ఉండగా ఈసారి 9.9%కి పరిమితమైంది.
- మైనింగ్ ఉత్పత్తి గతేడాది సెప్టెంబర్‌లో మైనస్ 5.2 శాతంగా ఉండగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో 11.5 శాతం పెరిగింది.
- క్యాపిటల్ గూడ్స్ సెగ్మెంట్ వృద్ధి 7.4 శాతంగా (గత సెప్టెంబర్‌లో 11.4 శాతం) నమోదైంది. కన్జూమర్ డ్యూరబుల్స్ వృద్ధి గత సెప్టెంబర్‌లో మైనస్ 5.5 శాతంగా ఉండగా ఈసారి ఒక్క శాతం మేర నమోదైంది. కన్జూమర్ నాన్–డ్యూరబుల్ గూడ్స్ ఉత్పత్తి మైనస్ 5.7 శాతం నుంచి 2.7 శాతానికి చేరింది.
- మౌలిక/నిర్మాణ రంగ ఉత్పత్తుల వృద్ధి 7.5%గా ఉంది. గత సెప్టెంబర్‌లో ఇది 8.2 శాతం.

రెండు కంపెనీలకు ఐఎస్‌పీ లైసెన్స్



న్యూఢిల్లీ: జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్, భారతి గ్రూప్ ప్రమోట్ చేస్తున్న వన్‌వెబ్ తాజాగా టెలికం శాఖ నుంచి ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ (ఐఎస్‌పీ) లైసెన్స్ అందుకున్నట్టు సమాచారం. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలను అందించేందుకు ఈ రెండు సంస్థలకు ఏడాది క్రితమే అనుమతులు లభించాయి. ఈ కంపెనీలు టెరెస్ట్రియల్ నెట్‌వర్క్‌లతో లేదా వీశాట్ ద్వారా శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలను అందించవచ్చని ఒక అధికారి తెలిపారు.

కోల్ ఇండియా లాభం అప్

- క్యూ2లో రూ. 6,800 కోట్లు
- షేరుకి రూ. 15.25 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం కోల్ ఇండియా పటిష్ట ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 13 శాతం పుంజుకుని రూ. 6,800 కోట్లను తాకింది. అధిక అమ్మకాలు ఇందుకు సహకరించాయి. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 6,044 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 15.25 చొప్పున తొలి మధ్యంతర డివిడెండును బోర్డు ప్రకటించింది. కాగా.. మొత్తం అమ్మకాలు సైతం రూ. 27,539 కోట్ల నుంచి రూ. 29,978 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు 9 శాతం పెరిగి రూ. 26,000 కోట్లను దాటాయి. ఈ కాలంలో ఇంధన కొనుగోలు ఒప్పందం(ఎఫ్ఎస్ఏ)లో భాగంగా ఒక్కో టన్ను బొగ్గుకు సగటున దాదాపు రూ. 1,542 చొప్పున లభించినట్లు కంపెనీ వెల్లడించింది. దేశీ బొగ్గు ఉత్పత్తిలో 80 శాతం వాటాను ఆక్రమిస్తున్న కంపెనీ తాజా సమీక్షా కాలంలో 157.42 మిలియన్ టన్నులను ఉత్పత్తి చేసింది. గతేడాది క్యూ2లో 139.23 ఎంటీ బొగ్గు మాత్రమే ఉత్పత్తయ్యింది. ఇక అమ్మకాలు సైతం 154.53 ఎంటీ నుంచి 173.73 ఎంటీకి జంప్ చేశాయి. ఈ ఏడాది 780 ఎంటీ విక్రయాలను కంపెనీ లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే.

ఫలితాల నేపథ్యంలో కోల్ ఇండియా షేరు యథాతథంగా రూ. 324 వద్ద ముగిసింది.

ఎల్ఐసీ లాభం 7,925 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో బీమా రంగ ప్రభుత్వ దిగ్గజం ఎల్ఐసీ ఇండియా నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 50 శాతం క్షీణించి రూ. 7,925 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 15,952 కోట్లు ఆర్జించింది. నికర ప్రీమియం ఆదాయం సైతం రూ. 1,32,632 కోట్ల నుంచి రూ. 1,07,397 కోట్లకు వెనకడుగు వేసింది. అయితే తొలి ఏడాది ప్రీమియం రూ. 9,125 కోట్ల నుంచి రూ. 9,988 కోట్లకు మెరుగుపడింది. ఇక మొత్తం ఆదాయం రూ. 2,22,215 కోట్ల నుంచి రూ. 2,01,587 కోట్లకు నీరసించింది. పెట్టుబడుల నుంచి మాత్రం ఆదాయం రూ. 93,942 కోట్లకు ఎగసింది. గత క్యూ2లో రూ. 84,104 కోట్లు లభించింది. స్థూల మొండిబకాయిలు 5.6 శాతం నుంచి 2.43 శాతానికి తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో ఎల్ఐసీ షేరు ఎన్ఎస్ఈలో 1 శాతం నష్టంతో రూ. 610 వద్ద ముగిసింది.

బీ న్యూ దీపావళి ఆఫర్లు

ముంబై: ప్రముఖ మొబైల్ రిటైల్ సంస్థ 'బీ న్యూ' మొబైల్స్ దీపావళికి ఆఫర్లు ప్రకటించింది. స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై రూ.5,999 స్మార్ట్ వాచ్ లేదా రూ.2,999 బ్లూటూత్ ట్రూ వైర్‌లెస్ బహుమతిగా పొందొచ్చని సంస్థ సీఈఓ వై.సాయి నిఖిలేష్ తెలిపారు. స్మార్ట్ టీవీ కొనుగోలుపై రూ.17,999 విలువైన 120 వాట్స్ సౌండ్‌బార్‌ను రూ.999లకు, ఎంపిక చేసిన ల్యాప్‌టాప్‌పై రూ.17,999 విలువైన 120 వాట్స్ సౌండ్‌బార్ ఉచితంగా పొందొచ్చన్నారు. ఐఫోన్ 15 సిరీస్‌పై రూ.41,400, ఐఫోన్ 13 సిరీస్‌పై రూ.39,900 వరకు తగ్గింపు ఉంటుందన్నారు. శాంసంగ్ ఎస్–సిరీస్‌పై రూ.15,999 విలువైన బోట్ క్వాకే 200 వాట్స్ సౌండ్‌బార్, ఫోల్డ్ సిరీస్‌పై రూ.24,999 విలువైన ఎంఐ టీవీని ఉచితంగా లభిస్తుందన్నారు. బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 80% వరకు రాయితీ అందిస్తామన్నారు. బజాజ్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలుపై రూ.11 వేల వరకు, హెచ్‌డీబీ ద్వారా రూ.10 వేల వరకు, క్లవర్‌పే ద్వారా 15% వరకు క్యాష్‌బ్యాక్ లభిస్తుందన్నారు. నో కాస్ట్ ఈఎంఐ సదుపాయం ఉందన్నారు.



సంవత్ 2079కు లాభాల వీడ్కోలు

- ఆదుకున్న ఆఖరి గంట కొనుగోళ్లు
- ఇంట్రాడేలో పరిమిత శ్రేణి ట్రేడింగ్



ముంబై: సంవత్ 2079 ఏడాదికి స్టాక్ మార్కెట్ స్వల్ప లాభాలతో వీడ్కోలు పలికింది. ట్రేడింగ్ చివర్లో మెటల్, ఫైనాన్స్, విద్యుత్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు శుక్రవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఇంట్రాడేలో 251 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ చివరికి 72 పాయింట్ల లాభంతో 64,905 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 66 పాయింట్లు క్షీణించిన నిఫ్టీ ఆఖరికి 30 పాయింట్లు పెరిగి 19,425 వద్ద నిలిచింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాల నేపథ్యంలో సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడాయి. ఐటీ, టెలికమ్యూనికేషన్, ఆటో, టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అధిక ద్రవ్యోల్బణ కట్టడికి అవసరమైతే కఠిన ద్రవ్య పాలసీ విధాన అమలుకు వెనకాడమని ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ వ్యాఖ్యలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

- ఈ సంవత్ 2079 ఏడాదిలో సెన్సెక్స్ 5,073 పాయింట్లు, నిఫ్టీ 1,694 పాయింట్లు చొప్పున పెరిగాయి. ఇదే కాలంలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.44 లక్షల కోట్లు పెరిగింది.
- ఈఎస్ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ షేరు లిస్టింగ్ రోజు 15% లాభాలు పంచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.60)తో పోలిస్తే 20% ప్రీమియంతో రూ.71 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 24% ర్యాలీ చేసి రూ.75 వద్ద గరిష్టాన్ని తాకింది. చివర్లో లాభాల స్వీకరణతో 15% లాభంతో రూ.69 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3,555 కోట్లుగా నమోదైంది.
- డాలర్ మారకంలో రూపాయి విలువ 4 పైసలు నష్టపోయి జీవితకాల కనిష్టం 83.33 స్థాయి వద్ద స్థిరపడింది. కొనసాగుతున్న విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఉపసంహరణ, క్రూడాయిల్ ధరల్లో అస్థిరతలు దేశీయ కరెన్సీ కోతకు కారణమయ్యాయని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. ఈ సెప్టెంబర్ 18న 83.32 స్థాయి వద్ద ఆల్‌టైం కనిష్టాన్ని తాకిన సంగతి తెలిసిందే. పారిశ్రామికోత్పత్తి, ద్రవ్యోల్బణ డేటా రూపాయి గమనాన్ని నిర్దేశి స్తాయని ట్రేడర్లు పేర్కొన్నారు.

ఆదివారం మూరత్ ట్రేడింగ్

దీపావళి సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలు ఆదివారం గంట పాటు ప్రత్యేక 'మూరత్ ట్రేడింగ్' నిర్వహించనున్నాయి. సాయంత్రం 6.15 గంటలకు మొదలై 7.15 గంటలకు ట్రేడింగ్ ముగియనుంది. ఈ ఘడియల్లో షేర్లు కొనుగోలు చేస్తే మంచి లాభాలు గడిస్తాయని మార్కెట్ వర్గాల నమ్మకం. బలిప్రతిపద సందర్భంగా నవంబర్ 14న(మంగళవారం) ఎక్స్ఛేంజీలకు సెలవు.

హ్యాపీ మొబైల్స్ 'ఫెస్టివ్ క్యాష్‌బ్యాక్ ధమాకా'



హైదరాబాద్: దీపావళి సందర్భంగా హ్యాపీ మొబైల్స్ 'ఫెస్టివ్ క్యాష్‌బ్యాక్ ధమాకా' ఆఫర్లు ప్రకటించింది. మొబైల్స్, ఎల్ఈడీ స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌ల కొనుగోలుపై ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ ద్వారా 10% వరకు క్యాష్‌బ్యాక్ పొందొచ్చని సంస్థ సీఎండీ కృష్ణ పవన్ చెప్పారు. అన్ని మొబైల్ యాక్సెసరీస్‌లపై 65% వరకు తగ్గింపు ఉంటుందన్నారు. ఆన్‌లైన్ కన్నా తక్కువ ధరలు, అద్భుతమైన డీల్స్, ప్రత్యేక డిస్కౌంట్లు అందిస్తున్నామని కంపెనీ ఎండీ కోట సంతోష్ వివరించారు.

రిలయన్స్ డిజిటల్ దీపావళి ఆఫర్లు

హైదరాబాద్: రిలయన్స్ డిజిటల్ దీపావళి సందర్భంగా 'అన్‌లిమిటెడ్‌సెలబ్రేషన్స్' పేరుతో ఆఫర్లు ప్రకటించింది. ఇందులో భాగంగా స్మార్ట్ టీవీలు, మొబైల్స్, వాషింగ్ మెషిన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, వైర్‌లెస్ ఇయర్ బడ్లు, స్మార్ట్‌వాచ్‌లు, గృహోపకరణాలపై భారీ రాయితీ పొందవచ్చు. క్రెడిట్, డెబిట్ కార్డులపై గరిష్టంగా రూ.15వేల వరకు డిస్కౌంట్ లభిస్తుంది. ఈఎంఐ, సులభ ఫైనాన్స్ సదుపాయాలు ఉన్నాయి. రిలయన్స్ డిజిటల్ స్టోర్లు, మై జియో స్టోర్లు, రిలయన్స్‌డిజిటల్.ఇన్ ద్వారా కస్టమర్లు ఈ ఆఫర్లు పొందవచ్చు.






సౌత్‌జోన్ జట్టులో త్రిష

సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే సౌత్‌జోన్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో హైదరాబాద్ నుంచి గొంగడి త్రిష, భోగి శ్రావణి... ఆంధ్ర నుంచి బారెడ్డి అనూష, ఎస్.అనూష, నీరగట్టు అనూష ఎంపికయ్యారు. ఈ టోర్నీ ఈనెల 24 నుంచి డిసెంబర్ 4 వరకు లక్నోలో జరుగుతుంది.

సెమీఫైనల్లో సుమిత్

హెల్సింకి ఓపెన్ ఏటీపీ చాలెంజర్–125 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. 69వ ర్యాంకర్ ఎమిల్ రుసువోరి (ఫిన్‌లాండ్)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో 169వ ర్యాంకర్ సుమిత్ తొలి సెట్‌ను 6–3తో నెగ్గి, రెండో సెట్‌లో 3–1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఈ దశలో ఎమిల్ గాయంతో వైదొలిగాడు. దాంతో సుమిత్‌ను విజేతగా ప్రకటించారు.



ఇరుగు దిష్టి... పొరుగు దిష్టి...

రచిన్‌కు దిష్టి తీసిన అమ్మమ్మ



సాక్షి, బెంగళూరు: వన్డే ప్రపంచకప్‌లో సంచలన ప్రదర్శన కనబరుస్తున్న న్యూజిలాండ్ క్రికెటర్ రచిన్ రవీంద్ర భారత సంతతికి చెందిన వాడని తెలిసిందే. రచిన్ కన్నడిగుడు. ఇప్పటికీ అతని మూలాలు బెంగళూరుతో ముడిపడే ఉన్నాయి. అందుకే శ్రీలంకతో మ్యాచ్ ముగియగానే రచిన్ అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. తన మనవడు పుట్టింది విదేశంలో అయినా స్వదేశీ అలవాట్లు, సంప్రదాయాలు బాగా తెలిసిన పెద్దావిడ (అమ్మమ్మ) తన ఇంటికి రాగానే రచిన్‌ను సోఫాలో కూర్చోబెట్టి దిష్టి తీసింది. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరలవుతోంది. కివీస్‌లో స్థిరపడిన రచిన్ తల్లిదండ్రులు దీప, రవి కృష్ణమూర్తి బెంగళూరు వాసులు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన రవి వృత్తిరీత్యా 1990లో కివీస్‌కు వలస వెళ్లగా... 1999లో వెల్లింగ్టన్‌లో రచిన్ జన్మించాడు. రవి కృష్ణమూర్తికి క్రికెట్ అంటే ఇష్టం. భారత దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్‌లంటే అభిమానం. అందువల్లే తన కుమారుడికి వారిద్దరి పేర్లు కలిపి పెట్టారు. తనకిష్టమైన క్రికెట్‌లో బ్యాటర్‌ను చేశాడు.

రచిన్‌కు ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు



దుబాయ్: రచిన్ రవీంద్ర ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డుకు ఎంపికయ్యాడు. ప్రస్తుత వరల్డ్‌కప్‌లో రచిన్ అత్యధిక పరుగులు (565) చేసిన రెండో బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. లీగ్ దశలో మొత్తం 9 మ్యాచ్‌లాడిన ఈ కివీస్ ఓపెనర్ 3 శతకాలు, 2 అర్ధసెంచరీలు సాధించాడు. న్యూజిలాండ్ సెమీస్ చేరడంలో కీలక భూమిక పోషించాడు. ఈ నిలకడైన ప్రదర్శనే అతనికి ఐసీసీ అవార్డుకు ఎంపిక చేసింది. రేసులో ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన దక్షిణాఫ్రికా ఓపెనర్ డికాక్ (591), భారత సీమర్ బుమ్రా (15 వికెట్లు) ఉన్నప్పటికీ అవార్డు మాత్రం రచిన్‌నే వరించింది. 2021 జనవరి నుంచి ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు ఇస్తోంది. రచిన్‌కంటే ముందు న్యూజిలాండ్ నుంచి డెవాన్ కాన్వే (2021–జూన్), ఎజాజ్ పటేల్ (2021–డిసెంబర్) ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు గెల్చుకున్నారు.

శ్రీలంక క్రికెట్ బోర్డు సస్పెండ్

ఐసీసీ నిర్ణయం

దుబాయ్: శ్రీలంక క్రికెట్ బోర్డు వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కఠిన నిర్ణయం తీసుకుంది. శ్రీలంక క్రికెట్ బోర్డు సభ్యత్వాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు... ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని శుక్రవారం ఐసీసీ ప్రకటించింది. ఈనెల 21న ఐసీసీ బోర్డు సమావేశం జరుగుతుందని, ఆ తర్వాతే శ్రీలంక బోర్డు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత వస్తుందని ఐసీసీ తెలిపింది. భారత్‌లో జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక నిరాశాజనక ప్రదర్శన చేసింది. ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచింది. దాంతో శ్రీలంక జట్టు ఆటతీరుపై ఆ దేశ ప్రభుత్వ క్రీడా మంత్రి రోషన్ రణసింఘే ఆగ్రహం వ్యక్తం చేస్తూ శ్రీలంక క్రికెట్ బోర్డును రద్దు చేశారు. మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన తాత్కాలిక కమిటీని నియమించారు. అయితే ఈ నిర్ణయంపై బోర్డు కోర్టుకు వెళ్లింది. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కోర్టు క్రికెట్ బోర్డును పునర్నియమించింది. జింబాబ్వే (2021) తర్వాత ఐసీసీ ద్వారా సస్పెన్షన్‌కు గురైన రెండో పూర్తిస్థాయి సభ్యత్వ దేశం శ్రీలంక కావడం గమనార్హం.

దర్జాగా దక్షిణాఫ్రికా గెలుపు

- ఐదు వికెట్ల తేడాతో సఫారీ విక్టరీ
- రాణించిన కొయెట్జీ, డసెన్
- ప్రపంచకప్‌ను ఓటమితో ముగించిన అఫ్గానిస్తాన్
- అజ్మతుల్లా పోరాటం వృథా



డసెన్

అహ్మదాబాద్: ఈ వన్డే వరల్డ్‌కప్‌లో అందరినీ ఆకట్టుకున్న అఫ్గానిస్తాన్ పోరాటం చివరకు పరాజయంతో ముగిసింది. ఇది వరకే సెమీఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలిచి ఈనెల 16న కోల్‌కతాలో ఆ్రస్టేలియాతో జరిగే రెండో సెమీఫైనల్ పోరులో పూర్తి విశ్వాసంతో బరిలోకి దిగనుంది. నిర్ణీత తొమ్మిది లీగ్ మ్యాచ్‌లను పూర్తి చేసుకున్న దక్షిణాఫ్రికా ఏడో విజయంతో 14 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. అసాధ్యమైన సమీకరణంతో సెమీఫైనల్ ఆశలు వదులుకున్న అఫ్గానిస్తాన్ ఈ మెగా ఈవెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తోపాటు మాజీ విశ్వవిజేతలు పాకిస్తాన్, శ్రీలంకలను ఓడించామన్న సంతృప్తితో స్వదేశానికి వెళ్లనుంది. నరేంద్ర మోదీ స్టేడియంలో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో 244 పరుగుల వద్ద ఆలౌటైంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ (107 బంతుల్లో 97 నాటౌట్; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేసి సెంచరీకి మూడు పరుగుల దూరంలో నిలిచాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో గెరాల్డ్ కొయెట్జీ 4, ఎన్‌గిడి, కేశవ్ మహరాజ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం సునాయాస లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 47.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 247 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వాన్‌డర్ డసెన్ (95 బంతుల్లో 76 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచి గెలిపించాడు. అఫ్గాన్ బౌలర్లలో రషీద్ ఖాన్, మొహమ్మద్ నబీ చెరో 2 వికెట్లు తీశారు.

ఒమర్జాయ్ ఒంటరిగా...

ఓపెనర్లు ఇబ్రహీమ్ జద్రాన్ (15), రహ్మానుల్లా గుర్బాజ్ (22 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్) పెద్దగా రాణించలేదు. కెప్టెన్ హష్మతుల్లా (2) కూడా నిరాశపరచడంతో 45 పరుగులకే 3 వికెట్లను కోల్పోయిన అఫ్గాన్‌ను మిడిలార్డర్ బ్యాటర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ ఆదుకున్నాడు. 71 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అవతలివైపు రహ్మత్ షా (46 బంతుల్లో 26; 2 ఫోర్లు), ఇక్రామ్ (12), రషీద్ ఖాన్ (14), నూర్ అహ్మద్ (32 బంతుల్లో 26; 4 ఫోర్లు) ఇలా ఏ ఒక్కరు బాధ్యతగా క్రీజులో నిలువలేకపోయినా... అజ్మతుల్లా మాత్రం కడదాకా నిలబడి ఒంటరి పోరాటం చేశాడు. శతకానికి 3 పరుగుల దూరంలో అజేయంగా నిలిచాడు. అతని పోరాటం వల్లే అఫ్గాన్ ఆ మాత్రం స్కోరు చేసింది.



ఒమర్జాయ్

ఆదుకున్న డసెన్

సునాయాస లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓపెనర్లు డికాక్ (47 బంతుల్లో 41; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ బవుమా (28 బంతుల్లో 23; 3 ఫోర్లు) తొలి వికెట్‌కు 64 పరుగులు జోడించి మంచి ఆరంభమే ఇచ్చారు. అయితే మార్క్‌రమ్ (32 బంతుల్లో 25; 1 ఫోర్, 1 సిక్స్), క్లాసెన్ (10) లాంటి కీలక బ్యాటర్లు విఫలమవడంతో 139 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన డసెన్... మిల్లర్ (33 బంతుల్లో 24; 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి పరిస్థితి చక్కదిద్దాడు. తర్వాత ఫెలుక్‌వాయో (37 బంతుల్లో 39 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్సర్లు) ధాటిగా ఆడటంతో దక్షిణాఫ్రికా సంచలనానికి తావివ్వకుండా గెలిచింది. అబేధ్యమైన ఆరో వికెట్‌కు డసెన్, ఫెలుక్‌వాయో 65 పరుగులు జోడించారు.

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) క్లాసెన్ (బి) కేశవ్ 25; జద్రాన్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 15; రహ్మత్ షా (సి) మిల్లర్ (బి) ఎన్‌గిడి 26; హష్మతుల్లా (సి) డికాక్ (బి) కేశవ్ 2; అజ్మతుల్లా ఒమర్జాయ్ (నాటౌట్) 97; ఇక్రామ్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 12; నబీ (సి) డికాక్ (బి) ఎన్‌గిడి 2; రషీద్ ఖాన్ (సి) డికాక్ (బి) ఫెలుక్‌వాయో 14; నూర్ అహ్మద్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 26; ముజీబ్ (సి) మార్క్‌రమ్ (బి) కొయెట్జీ 8; నవీనుల్ (రనౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్) 244. వికెట్ల పతనం:** 1–41, 2–41, 3–45, 4–94, 5–112, 6–116, 7–160, 8–204, 9–226, 10–244. **బౌలింగ్:** రబడ 10–0–40–0, ఎన్‌గిడి 8.3–0–69–2, మార్క్‌రమ్ 4.3–0–25–0, కొయెట్జీ 10–1–44–4, కేశవ్ మహరాజ్ 10–1–25–2, ఫెలుక్‌వాయో 7–0–36–1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నబీ 41; బవుమా (సి) గుర్బాజ్ (బి) ముజీబ్ 23; డసెన్ (నాటౌట్) 76; మార్క్‌రమ్ (సి) నవీనుల్ (బి) రషీద్ 25; క్లాసెన్ (బి) రషీద్ ఖాన్ 10; మిల్లర్ (సి అండ్ బి) నబీ 24; ఫెలుక్‌వాయో (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (47.3 ఓవర్లలో 5 వికెట్లకు) 247. వికెట్ల పతనం:** 1–64, 2–66, 3–116, 4–139, 5–182. **బౌలింగ్:** ముజీబ్ 10–0–51–1, నవీనుల్ 6.3–0–52–0, నబీ 10–1–35–2, ఒమర్జాయ్ 1–0–8–0, రషీద్ ఖాన్ 10–1–37–2, నూర్ అహ్మద్ 9–0–49–0, రహ్మత్ షా 1–0–12–0.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	9	7	2	14	1.261
ఆస్ట్రేలియా	8	6	2	12	0.861
న్యూజిలాండ్	9	5	4	10	0.743
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	9	4	5	8	-0.336
ఇంగ్లండ్	8	2	6	4	-0.885
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	9	2	7	4	-1.419
నెదర్లాండ్స్	8	2	6	4	-1.635

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా × బంగ్లాదేశ్
వేదిక: పుణే
ఉదయం గం. 10:30 నుంచి

ఇంగ్లండ్ × పాకిస్తాన్
వేదిక: కోల్‌కతా

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

రన్నరప్ నైశిక్ రెడ్డి జోడీ



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య జూనియర్ సర్క్యూట్ టోర్నీలో తెలంగాణకు చెందిన గనగామ నైశిక్ రెడ్డి రన్నరప్‌గా నిలిచాడు. ఢాకాలో జరిగిన ఈ టోర్నీలో నైశిక్ రెడ్డి–ప్రబీర్ ముకేశ్ చావ్లా (భారత్) ద్వయం బాలుర డబుల్స్ విభాగం ఫైనల్లో ఓటమి చవిచూసింది. తుది పోరులో నైశిక్–ప్రబీర్ జోడీ 2–6, 3–6తో భారత్‌కే చెందిన తవీశ్ పావా–అర్జున్ యాదవ్ జంట చేతిలో ఓటమి పాలైంది.

సెమీస్‌లో అభయ్ నిష్క్రమణ



న్యూఢిల్లీ: నియోస్ వెనిస్ వెర్డె ఓపెన్ స్క్వాష్ టోర్నీలో భారత ప్లేయర్ అభయ్ సింగ్ సెమీఫైనల్లో నిష్క్రమించాడు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం రెండో సీడ్ రోరీ స్టీవర్ట్ (స్కాట్లాండ్)తో జరగాల్సిన సెమీఫైనల్లో అభయ్ గాయం కారణంగా బరిలోకి దిగకుండా తన ప్రత్యర్థికి వాకోవర్ ఇచ్చాడు. క్వార్టర్ ఫైనల్లో అభయ్ 11–1, 7–11, 19–17, 8–11, 11–6తో ఆరో సీడ్ విక్టర్ బైర్టస్ (చెక్ రిపబ్లిక్)పై గెలిచాడు.

క్లుప్తంగా...

సోమవారం సెలవు లేనట్టే!

సెలవు ప్రకటిస్తే ఎన్నికల షెడ్యూల్ మార్చాలి: సీఈఓ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దీపావళి పండుగకు మరుసటి రోజు సోమవారం సెలవు ప్రకటించే అవకాశాలు లేవని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సోమవారం సెలవు ప్రకటించేందుకు ఉన్న అవకాశాలపై రాష్ట్ర ప్రభుత్వం.. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) కార్యాలయం అభిప్రాయం కోరింది. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటిస్తే, అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఆ మేరకు ఒక రోజు ముందుకు జరుపుతూ కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుందని సీఈఓ కార్యాలయం బదులిచ్చినట్లు సమాచారం. సోమవారం అభ్యర్థుల నామినేషన్లను పరిశీలించాల్సి ఉన్న నేపథ్యంలో ఆ రోజు సెలవు ప్రకటిస్తే సమస్యలు తలెత్తుతాయని అభిప్రాయపడినట్లు తెలిసింది. దీంతో సోమవారం సెలవు ప్రకటించే అంశంపై కేంద్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతి పొందాలనే ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకున్నట్లు సమాచారం.

సికింద్రాబాద్-రెక్సాల్ మధ్య ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: దీపావళి, ఛాత్ పూజల సందర్భంగా ప్రత్యేక జనసాధారణ్ రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ తెలిపారు. సికింద్రాబాద్-రెక్సాల్ (07007/07008) ప్రత్యేక రైళ్లు ఈ నెల 12, 19 తేదీల్లో ఉదయం 10.30 గంటలకు బయల్దేరి మంగళవారం ఉదయం 6 గంటలకు రెక్సాల్ చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో ఈ నెల 14, 21 తేదీల్లో సాయంత్రం 7.15 గంటలకు బయల్దేరి గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటాయి. సికింద్రాబాద్-బెనారస్ (07005/07006) ప్రత్యేక రైళ్లు ఈ నెల 15, 22 తేదీల్లో రాత్రి 9.40 గంటలకు బయల్దేరి శుక్రవారం ఉదయం 6.30 గంటలకు బెనారస్ చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో ఈ నెల 17, 24 తేదీల్లో ఉదయం 8.35 గంటలకు బయల్దేరి శనివారం సాయంత్రం 6.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటాయి.

గోదావరి-కావేరిపై సమ్మతి!

నదుల అనుసంధానం ఎంఓయూపై సంతకాలకు సూత్రప్రాయ అంగీకారం

- ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ వద్దన్న తెలంగాణ.. అక్కడే నిర్మిస్తామన్న టాస్క్‌ఫోర్స్ చైర్మన్
- పోలవరం నుంచి గోదావరి జలాలను తరలించాలని కోరిన ఏపీ
- తదుపరి దశల్లో పరిశీలిస్తామని చైర్మన్ హామీ
- ప్రస్తుత తమ వాటాను పూర్తిగా వాడుకుంటామని ఛత్తీస్‌గఢ్ స్పష్టీకరణ
- ఆలోగా మహానది-గోదావరి అనుసంధానం పూర్తి చేస్తామన్న చైర్మన్
- తొమ్మిది రాష్ట్రాలతో ఎన్‌డబ్ల్యూడీఏ సంప్రదింపులు.. టాస్క్‌ఫోర్స్ సమావేశం


టాస్క్‌ఫోర్స్ సమావేశంలో వెదిరె శ్రీరామ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై చిన్న ముందడుగు పడింది. ప్రాజెక్టు నిర్మాణానికి సమ్మతి తెలుపుతూ పరస్పర అవగాహన ఒప్పందం(ఎంఓయూ)పై సంతకాలు చేసేందుకు తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలు, పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపాయి. కేంద్ర జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధలో నదుల అనుసంధానంపై సంప్రదింపులు, టాస్క్‌ఫోర్స్ సమావేశాలను నిర్వహించింది. టాస్క్‌ఫోర్స్ చైర్మన్ వెదిరె శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీల్లో ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ భోపాల్‌సింగ్, తెలంగాణ నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్, ఏపీ జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, ఇతర రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31 నాటికి ప్రాజెక్టు డీపీఆర్‌ను సిద్ధం చేసి రాష్ట్రాలకు అందజేస్తామని, అప్పటి నుంచి 15 రోజుల్లోగా అన్ని రాష్ట్రాల సీఎంలు ఎంఓయూపై సంతకాలు చేయాలని వెదిరె శ్రీరామ్ సూచించారు. ఈ భేటీల నిర్ణయాలను ఈనెల 22న ఢిల్లీలో నిర్వహించనున్న ఎన్‌డబ్ల్యూడీఏ పాలక మండలి సమావేశంలో ఆమోదిస్తామన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఇచ్చంపల్లి(గోదావరి)-మూసీ-నాగార్జునసాగర్-సోమశిల- గ్రాండ్ ఆనికట్ (కావేరి)లను అనుసంధానం చేస్తామని తెలిపారు.

ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ వద్దు: తెలంగాణ

గోదావరి జలాల్లో తెలంగాణ వాటాకు రక్షణ కల్పిస్తే అనుసంధానం ప్రాజెక్టుకు సమ్మతి తెలుపుతామని సమావేశంలో తెలంగాణ ఈఎన్‌సీ సి.మురళీధర్ స్పష్టంచేశారు. ప్రాజెక్టు ద్వారా తరలించే 148 టీఎంసీల్లో తెలంగాణకు 50శాతం కేటాయించాలని కోరారు. గోదావరి జలాల్లో రాష్ట్రాల వారీగా వాటాలను నిర్ధారించి, భవిష్యత్తులో ఎలాంటి మార్పులు జరగకుండా ఫ్రీజ్ చేయాలన్నారు. గోదావరిపై ఇచ్చంపల్లి వద్ద కాకుండా కొంత ఎగువన బ్యారేజీ నిర్మించి నీటిని తరలించాలని.. లేకుంటే దిగువన ఉన్న సమ్మక్క బ్యారేజీ నిర్వహణలో సమస్యలు వస్తాయని పేర్కొన్నారు.

ఇచ్చంపల్లి వద్దే నిర్మిస్తాం: వెదిరె శ్రీరాం

తెలంగాణ సహా ఏ రాష్ట్ర వాటా నీటికీ నష్టం కలిగించమని వెదిరె శ్రీరామ్ సమాధానమిచ్చారు. భౌగోళికంగా ఉన్న ప్రతికూలతల దృష్ట్యా ఛత్తీస్‌గఢ్, ఇతర ఎగువ రాష్ట్రాలు వాడుకోలేకపోతున్న గోదావరి జలాలనే తరలిస్తామని స్పష్టం చేశారు. గోదావరిలో మిగులు జలాల లభ్యత లేదని నిర్ధారించిన నేపథ్యంలో వాటిని సైతం వినియోగించబోమని హామీ ఇచ్చారు. తెలంగాణకు 50శాతం వాటా కేటాయింపును పరిశీలిస్తామన్నారు. తొలి విడత ప్రాజెక్టుకు కేవలం 400 హెక్టార్ల భూసేకరణ మాత్రమే అవసరమని చెప్పారు. ఇచ్చంపల్లి వద్దే బ్యారేజీ నిర్మాస్తామని, సమ్మక్క బ్యారేజీకి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మా వాటా పూర్తిగా వాడుకుంటాం: ఛత్తీస్‌గఢ్

గోదావరిలో తమ రాష్ట్ర వాటాను పూర్తిగా వాడుకుంటామని సమావేశంలో ఛత్తీస్‌గఢ్ చీఫ్ ఇంజనీర్ కుబేర్‌సింగ్ గురోవర్ స్పష్టం చేశారు. ఈ మేరకు కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికి సర్వేలు పూర్తిచేసి, సీడబ్ల్యూసీ నుంచి ప్రాథమిక స్థాయి అనుమతులు పొందామని చెప్పారు. దీంతో ఛత్తీస్‌గఢ్ తన వాటా జలాలను వాడుకోవడం ప్రారంభించిన వెంటనే గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టు ద్వారా నీటి తరలింపును నిలుపుదల చేస్తామని వెదిరె శ్రీరామ్ హామీ ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్ ప్రాజెక్టులు పూర్తి కావడానికి మరో 10 ఏళ్లకు పైగా పట్టవచ్చని, ఆలోగా మహానది-గోదావరి అనుసంధానం పూర్తి చేస్తామని చెప్పారు.

పోలవరం నుంచే అనుసంధానం జరపాలి: ఏపీ

గోదావరి-కావేరి అనుసంధానాన్ని పోలవరం ప్రాజెక్టు నుంచి చేపట్టాలని ఏపీ తరఫున శశిభూషణ్ కుమార్ కోరారు. గోదావరిలో ఛత్తీస్‌గఢ్ వాడుకోని జలాలను సాంకేతికంగా నిర్ధారించాలని కోరారు. గోదావరిలో 75శాతం లభ్యత ఆధారంగా నికర జలాల లభ్యత లేదని తేల్చుతూ సీడబ్ల్యూసీ ఇచ్చిన నివేదికలో తారతమ్యాలు ఉన్నాయని, మరింత స్పష్టత కల్పించాలని సూచించారు. బెడ్తి-వార్ధా నదుల అనుసంధానం ప్రాజెక్టు ద్వారా రాయలసీమలోని హెచ్ఎల్‌సీ ప్రాజెక్టుకు నీళ్ల కేటాయించాలన్నారు. ఎగువ రాష్ట్రాల వినియోగంతో గోదావరిలో దిగువ చివరి రాష్ట్రం ఏపీ వాటాకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని.. ఇందుకోసం ఏపీతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఎన్‌డబ్ల్యూడీఏను కోరారు. దీనిపై స్పందించిన వెదిరె శ్రీరామ్.. తొలివిడతలో ఇచ్చంపల్లి నుంచి అనుసంధానం చేపడతామని, తదుపరి దశల్లో ఇతర ప్రాంతాల నుంచి సైతం గోదావరి జలాల తరలింపును పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఏపీ వాటాలకు రక్షణ కల్పించే విషయంలో రాజీపడబోమని భరోసా ఇచ్చారు. నాగార్జునసాగర్, సోమశిల జలాశయాల కింద ఇప్పటికే ఉన్న ఆయకట్టుతోపాటు నదుల అనుసంధానం ప్రాజెక్టు కింద ప్రతిపాదిస్తున్న కొత్త ఆయకట్టుకు సైతం సాగునీటిని సరఫరా చేసేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలపై అధ్యయనం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

టీఎస్ ఆర్టీసీ కార్తీక మాసం ప్రత్యేక బస్సులు

అఫ్జల్‌గంజ్ (హైదరాబాద్): పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రసిద్ధ శైవ క్షేత్రాలకు, పంచారామాలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు టీఎస్ ఆర్టీసీ రంగారెడ్డి ప్రాంత రీజనల్ మేనేజర్ ఎ. శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దక్కన్ పంచశైవ క్షేత్రాలైన వేములవాడ (రాజరాజేశ్వర స్వామి), కాళేశ్వరం (ముక్తేశ్వర కాళేశ్వరస్వామి), రామప్పగుడి (రామలింగేశ్వర స్వామి), వెయ్యిస్తంభాల గుడి (రుద్రేశ్వరస్వామి), పాలకుర్తి (సోమనాథస్వామి) దేవాలయాలతో పాటు పంచారామాలైన అమరావతి (అమరేశ్వరాలయం), భీమవరం (సోమేశ్వరాలయం), ద్రాక్షారామం (భీమేశ్వరాలయం), పాలకొల్లు (రామలింగేశ్వరాలయం), సామర్లకోట (కుమార రామ భీమేశ్వరాలయం)లకు ప్రతి ఆదివారంతో పాటు కార్తీక పౌర్ణమి ముందు రోజు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. పంచశైవ క్షేత్రాలకు కార్తీక పౌర్ణమి ముందు రోజు మధ్యాహ్నం 2 గంటలకు హైద్రాబాద్ నుంచి బయలుదేరి దర్శనానంతరం సోమవారం రాత్రికి తిరిగి హైదరాబాద్ చేరుకుంటారని తెలిపారు. దీనికి గానూ రాజధాని సర్వీసుకు ఒక్కొక్కరికి రూ.2,400, సూపర్ లగ్జరీకి రూ.1,900, ఎక్స్‌ప్రెస్‌కి రూ.1,500లుగా నిర్ణయించినట్లు తెలిపారు. పంచారామాలకు ప్రతి ఆదివారంతో పాటు కార్తీక పౌర్ణమి ముందు రోజు సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి దర్శనం అనంతరం మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి హైదరాబాద్ చేరుకుంటారని తెలిపారు. దీనికి గానూ రాజధాని సర్వీసుకు రూ.4,000, సూపర్ లగ్జరీకి రూ.3,200లుగా నిర్ణయించినట్లు తెలిపారు. దర్శనాలు, స్నాన వసతి కోసం రూ.550 ముందుగా బస్సులోనే చెల్లించాలని సూచించారు. ఈ యాత్రల కోసం భక్తులు తమ ప్రయాణాన్ని ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9959226257, 9959224911, 9959226248 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పీవోపీఎస్కేల్లో పాస్‌పోర్టు దరఖాస్తుదారులకు సేవలు సులభతరం


చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న ఆర్పీవో దాసరి బాలయ్య

రాంగోపాల్‌పేట్: పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో (పీవోపీఎస్కే) పాస్‌పోర్టు దరఖాస్తుదారులకు సేవలు మరింత సులభతరం చేయాలని ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారులు, పోస్టల్ శాఖ అధికారులు నిర్ణయించారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయంలో ఆర్పీవో దాసరి బాలయ్య, తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు దరఖాస్తుదారులకు మరింత సులభంగా ఎలా సేవలందించాలనే అంశాలపై చర్చించారు. మేడ్చల్‌లోని పీవోపీఎస్కే వద్ద కమ్యూనికేషన్ టవర్‌ను నిర్మించాలని తద్వారా పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో లాగే ఇక్కడ దరఖాస్తుదారులకు సేవలు అందించవచ్చని తెలిపారు. దీంతో పాస్‌పోర్టు జారీలో జాప్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. పీవోపీఎస్కేల్లో ఉన్న సిబ్బంది కొరత గురించి చర్చించి దాన్ని త్వరలోనే పరిష్కరించాలని నిర్ణయించారు. తెలంగాణవ్యాప్తంగా 14 పోస్టాఫీసుల్లో పాస్‌పోర్టు సేవా కేంద్రాలున్నాయని, వీటిని పోస్టాఫీస్, పాస్‌పోర్టు కార్యాలయ ఉద్యోగులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి రోజూ పాస్‌పోర్టులు, పోలీస్ క్లియరెన్స్‌ల కోసం సగటున 755 దరఖాస్తులు ప్రాసెస్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రోజూ 3 వేల పాస్‌పోర్టులను ప్రాంతీయ పాస్‌పోర్టు కేంద్రం ద్వారా స్పీడ్ పోస్టులో 24 గంటల్లోపే దరఖాస్తుదారులకు పంపిస్తున్నట్లు వివరించారు.

రైల్వేలో ఎలక్ట్రిక్ విప్లవం

సంప్రదాయ డీజిల్ ఇంజిన్లను రైల్వే శాఖ వేగంగా వదిలించుకుంటోంది. ఇందులో భాగంగా ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లను పెద్ద సంఖ్యలో సమకూర్చుకుంటోంది. భారతీయ రైల్వేలో కీలక జోన్లలో ఒకటిగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే, ఏకంగా వేయి కరెంటు ఇంజిన్లను వినియోగంలోకి తెచ్చి కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఆధునిక ఇన్సులేటెడ్ గేట్ బైపోలార్ ట్రాన్సిస్టర్స్ (ఐజీబీటీ) ప్రొపల్షన్ సిస్టంతో ఉన్న 1,000వ ఎలక్ట్రిక్ ఇంజిన్‌ను శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే పట్టాలెక్కించింది. దూరప్రాంతాలకు నడిచే దాదాపు అన్ని కీలక రైళ్లను ఇప్పుడు ఎలక్ట్రిక్ ఇంజిన్లతోనే నడిపించేందుకు ఏర్పాట్లు చేసింది. శుక్రవారం అందుబాటులోకి వచ్చిన ఎలక్ట్రిక్ ఇంజిన్‌కు సహస్రాశ్వ అన్న పేరు పెట్టారు. దీన్ని లాలాగూడ ఎలక్ట్రిక్ లోకోషెడ్ తనిఖీలో భాగంగా జోన్ జీఎం అరుణ్‌కుమార్ జైన్ ప్రారంభించారు.

- వేయి కరెంటు ఇంజిన్లను వినియోగం లోకి తెచ్చిన ద.మ. రైల్వే
- 'సహస్రాశ్వ'పేరుతో 1,000వ ఇంజిన్ శుక్రవారం ప్రారంభం
- బ్రేక్ వేసినప్పుడల్లా కరెంటును ఉత్పత్తి చేయటం దాని ప్రత్యేకత
- ఈ రూపంలో ప్రతి ఇంజిన్‌తో సంవత్సరానికి 976 టన్నుల బొగ్గు ఆదా
- 874 రైళ్లకు కరెంటు ఇంజిన్ల ఏర్పాటు
- జోన్ పరిధిలో 6650 రూట్ కి.మీ. విద్యుదీకరణ పూర్తి


వెయ్యో ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ను ప్రారంభిస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

సాక్షి, హైదరాబాద్: రైలు మార్గాలను విద్యుదీకరించటం ద్వారా ఆధునికతకు శ్రీకారం చుట్టిన రైల్వే ఇప్పుడు డీజిల్ ఇంజిన్లను శాశ్వతంగా నిలిపివేయాలని నిర్ణయించింది. వాటిని కేవలం రైలు యార్డులు, ఇతర చోట్ల కోచ్‌లను పార్క్ చేయటానికి తరలించడం లాంటి పనులకే వినియోగించబోతోంది. ప్రయాణికుల రైళ్లతో పాటు సరుకు రవాణా రైళ్లను సైతం కరెంటు ఇంజిన్లతోనే నడపటం ద్వారా వాతావరణ కాలుష్యానికి కళ్లెం వేస్తోంది. డీజిల్ వినియోగాన్ని తగ్గించటం ద్వారా చమురు ఖర్చుకు బ్రేక్ వేస్తోంది. డీజిల్ ఇంజిన్లతో పోలిస్తే కరెంటు ఇంజిన్ల వినియోగం వల్ల ఖర్చు భారీగా తగ్గుతుంది.

- ప్రయాణికుల రైలును ఒక డీజిల్ లోకోమోటివ్‌తో నడిపితే సగటున ఏడాదికి 45 లక్షల లీటర్ల డీజిల్ ఖర్చవుతుంది. అదే గూడ్సు రైలు అయితే 15 లక్షల లీటర్లు ఖర్చు అవుతుంది. ఒక్కో ఇంజిన్ ద్వారా అంతమేర ఇంధనం ఆదా అవుతుంది.
- ఒక ఎలక్ట్రిక్ లోకోమోటివ్ ప్రయాణికుల రైలును లాగేందుకు ప్రతి కి.మీ.కు ఆరు యూనిట్ల కరెంటును ఖర్చు చేస్తుంది. డీజిల్‌తో పోలిస్తే ఇది పెద్ద ఆదా అన్నమాట.
- ప్రస్తుతం ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లను కూడా ఆధునికీకరించారు. సంప్రదాయ కరెంటు ఇంజిన్ బదులు తాజాగా ఇన్సులేటెడ్ గేట్ బైపోలార్ ట్రాన్సిస్టర్స్ (ఐజీబీటీ)ప్రొపల్షన్ సిస్టం ఉన్న ఇంజిన్లు వాడుతున్నారు. బ్రేక్ వేసినప్పుడల్లా ప్రత్యేక మెకానిజం వల్ల కొంత చొప్పున కరెంటు ఉత్పత్తి అవుతుంది. ఈ రూపంలో 12.4 శాతం కరెంటు ఆదా అవుతుంది. దాన్ని తిరిగి గ్రిడ్‌కు పంపి.. పునర్వినియోగానికి వీలు కల్పిస్తారు. అంటే.. ఒక ఇంజిన్ సగటున సాలీనా 976 టన్నుల బొగ్గును ఆదా చేస్తుందన్నమాట.
- డీజిల్ వినియోగాన్ని నిరోధించటం వల్ల వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. ప్రతి లోకోమోటివ్ సంవత్సరానికి 2.362 కిలో టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గిస్తుంది.
- ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉన్న వేయి కరెంటు లోకోమోటివ్‌లలో 600 ఇన్సులేటెడ్ గేట్ బైపోలార్ ట్రాన్సిస్టర్స్ (ఐజీబీటీ)ప్రొపల్షన్ సిస్టం ఉన్న ఇంజిన్లే. మిగతావి సంప్రదాయ ఇంజిన్లు.
- సంప్రదాయ ఎలక్ట్రిక్ ఇంజిన్ 5000 హెచ్.పీ. సామర్థ్యం కాగా, ఆధునిక ఇంజిన్ల సామర్థ్యం 6000 హెచ్.పీ.

త్వరలో అన్ని మార్గాల విద్యుదీకరణ

దక్షిణ మధ్య రైల్వేలో కొత్త లైన్లు మినహా మిగతా ప్రధాన మార్గాలన్నీ విద్యుదీకరించారు. 6650 రూట్ కి.మీ.మార్గాన్ని విద్యుదీకరించగా, కేవలం 691 కి.మీ. మాత్రమే మిగిలి ఉంది. తెలంగాణకు సంబంధించి అక్కన్నపేట-మెదక్, మనోహరాబాద్-కొత్తపల్లి (సిద్దిపేట వరకు పూర్తి) మార్గాలు మాత్రమే విద్యుదీకరించాల్సి ఉంది.

695 రైళ్లు కరెంటువే..

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో లైన్ల విద్యుదీకరణ వేగంగా పూర్తి అవుతుండటం, కరెంటు ఇంజిన్లు అందుబాటులోకి వస్తుండటంతో రైళ్లకు ఎలక్ట్రిక్ ఇంజిన్లనే ఎక్కువగా వాడుతున్నారు. జోన్‌పరిధిలో ప్రస్తుతం 874 రైళ్లను కరెంటు ఇంజిన్లతోనే నడుపుతున్నారు. మరో 695 రైళ్లకు ఇంకా డీజిల్ ఇంజిన్లు వాడుతున్నారు. వీటిల్లో విద్యుదీకరించని మార్గాల్లో నడుస్తున్న రైళ్లు ఉన్నాయి. కొత్తగా కరెంటు ఇంజిన్లు అందుబాటులోకి వచ్చే కొద్దీ డీజిల్ ఇంజిన్ల వినియోగం తగ్గనుంది. మిగతా కొత్త మార్గాలను కూడా విద్యుదీకరిస్తే ఇక డీజిల్ ఇంజిన్ల వినియోగం నామమాత్రమే అవుతుంది.


కోర్టుకు హాజరైన అలంపూర్ తహసీల్దార్

- ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియలో స్థానికత అంశంపై పిటిషన్ వేసిన ఓ యువతి
- తదుపరి విచారణకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కూడా హాజరుకావాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: స్థానికంగా ఉంటున్నట్లు ఓ ఎంబీబీఎస్ అభ్యర్థికి సర్టిఫికెట్ జారీ చేసిన కేసులో జోగుళాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ తహసీల్దార్ ఆర్.మంజుల హైకోర్టుకు హాజరయ్యారు. గత విచారణ సందర్భంగా కోర్టుకు హాజరుకాని తహసీల్దార్‌పై న్యాయస్థానం బెయిలబుల్ వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. తదుపరి విచారణకు తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హాజరుకావాలని ఆదేశించింది. విచారణను వచ్చే నెల 4కు వాయిదా వేసింది. తను తెలంగాణకు చెందిన అభ్యర్థినే అయినా లోకల్ కోటాలో ఎంబీబీఎస్ సీటు ఇచ్చేందుకు కాళోజీ వర్సిటీ నిరాకరించిందని పేర్కొంటూ ఎస్.వెన్నెల అనే యువతి హైకోర్టులో పిటిషన్ వేశారు. తెలంగాణ మెడికల్, డెంటల్ కాలేజీల అడ్మిషన్ (ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులలో ప్రవేశం) నిబంధన-2017లోని 3(ఐఐఐ)(ఆ) ప్రకారం విద్యార్థిని స్థానికవ్యక్తిగా పరిగణించాలంటే అర్హత పరీక్ష(నీట్)కు ముందు నాలుగేళ్లు తెలంగాణలోనే చదివి ఉండాలని చెబుతోంది. ఈ నిబంధన రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తోందని గతంలో ఇదే న్యాయస్థానం అభిప్రాయపడింది. ఇలాంటి నిబంధనను తప్పుబడుతూ గతంలో సుప్రీంకోర్టు పలు కేసుల్లో ఉత్తర్వులు కూడా ఇచ్చిందని గుర్తుచేసింది. శాశ్వత నివాసితులైన విద్యార్థులను 'స్థానిక'ంగానే పరిగణించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పును తనకు కూడా వర్తింపజేయాలని వెన్నెల కోరారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన సమాచారం ఆధారంగా తాను లోకల్ సర్టిఫికెట్ జారీ చేసినట్లు తహసీల్దార్ వివరణ ఇచ్చారు. దీంతో ధర్మాసనం...తదుపరి విచారణకు ఆర్ఐను కూడా హాజరుకావాలని ఆదేశించింది.

ఓపెన్ ప్లాట్లే ఇవ్వండి

హౌసింగ్‌బోర్డు వివాదంలో ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం.. జీవో కొట్టివేత



సాక్షి, హైదరాబాద్: 1991లో ప్రభుత్వం జారీచేసిన జీవో ప్రకారం 320 మంది ఉద్యోగులకు ఓపెన్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్లాట్లను ఫ్లాట్లు మారుస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 32ను కొట్టివేసింది. ఏపీ హౌసింగ్ బోర్డు ఉద్యోగులకు హైదరాబాద్ కూకట్‌పల్లి సర్వే నంబర్ 964, 1009లో 13 ఎకరాలను ప్రభుత్వం 1991లో కేటాయించింది. గజం రూ.45 చొప్పున కేటాయించాలని చెబుతూ ప్లాట్లను సిద్ధం చేసే బాధ్యతను హౌసింగ్ బోర్డుకు అప్పగించింది. అయితే లేఅవుట్ సిద్ధమయ్యాక ఆ మొత్తాన్ని రూ.116కు పెంచింది. దీనిపై చర్చ కొనసాగుతుండగానే కేటాయింపును నిలిపివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్లాట్లకు బదులు ఫ్లాట్లను కేటాయించాలంటూ జీవో 32ను విడుదల చేసింది. దీన్ని ఉద్యోగులు హైకోర్టులో సవాల్ చేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి ప్రభుత్వం పేర్కొన్న విధంగా రూ.116 చెల్లించిన 107 మందికి ప్లాట్లను అప్పగించాలని తీర్పునిచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ ప్రభుత్వం, హౌసింగ్ బోర్డు, మరికొందరు అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టి తీర్పు వెలువరించింది. ప్రభుత్వం ఉద్యోగుల నుంచి సొమ్ము వసూలు చేసినందున ఆ భూమిపై వారికే హక్కులు ఉంటాయని పేర్కొంది. ఉద్యోగులకు ప్లాట్లు కేటాయించడం కొత్తకాదని, జీవో 32ను కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. మొత్తం 320 మందికి ప్లాట్లను 4 నెలల్లో రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.